www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
10-12-2024
సంపుటి : 01 | సంచిక : 218 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

ఇది టెక్, డేటా
## నడిపించే శతాబ్దం

- గత పదేళ్లలో ఇంటర్నెట్ వినియోగం నాలుగు రెట్లు పెరిగింది
- డిజిటల్ చెల్లింపుల్లో భారీగా పుంజుకొంది
- 'వికాస్ భీ- విరాసత్ భీ' మంత్రంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది
- ప్రపంచవ్యాప్తంగా భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారు
- ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ 2024లో ప్రధాని మోదీ

2



త్వరలో..
## ఏపీ క్యాబినెట్‌లోకి నాగబాబు

- అసెంబ్లీ స్థానాలననుసరించి ఏపీలో మరో మంత్రి పదవికి ఛాన్స్
- పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయింపు
- సీఎం చంద్రబాబు ప్రకటన



**విశ్వంభర, అమరావతి:**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఏపీ క్యాబినెట్‌లో చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా ప్రకటించారు. జనసేనలో చురుగ్గా వ్యవహరిస్తున్న నాగబాబు.. ప్రస్తుతం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో అసెంబ్లీ స్థానాల సంఖ్యను అనుసరించి.. 25 మంత్రి పదవులకు అవకాశం ఉంది. కానీ, ప్రస్తుత మంత్రివర్గంలో 24 మంది ఉన్నారు. జనసేన నుంచి ప్రస్తుతం..

మిగతా2లో...



ఈ రోజు చరిత్రలో
# నిలిచిపోతుంది

## తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు..



- 4 కోట్ల బిడ్డల భావోద్వేగం
- పదేళ్లపాటు తెలంగాణ తల్లి వివక్షకు గురైంది
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్నాం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీఎస్'ను 'టీజీ'గా మార్చాం
- 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించాం
- 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు రూ.కోటి నగదు, 300గజాల స్థలం నజరానా: సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- అధికారికంగా ఆమోదించిన ప్రభుత్వం.. ఉత్తర్వులు జారీ

2

## ఆర్‌బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

- నేటితో ముగియనున్న శక్తికాంత దాస్ పదవీ కాలం
- కొత్త గవర్నర్‌ను నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం



ఈ పార్లమెంటు సమావేశాల్లోనే
## జమిలి ఎన్నికల బిల్లు!

- ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నం
- విస్తృత సంప్రదింపుల కోసం జేపీసీకి సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచన

2



ఆశా వర్కర్లపై పోలీస్
## లాఠీచార్జి అమానుషం..

ఇదేనా తెలంగాణ ఆడబిడ్డలకు సోనియా గాంధీ బర్త్ డే గిఫ్ట్
కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం ఖాయం
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత..!

2

## తెలంగాణ తల్లులపై ఏంటీ దుర్మార్గం?

- "మాతృ మూర్తులపై పురుష పోలీసులతో దౌర్జన్యమా?
- ఏం పాపం చేశారని ఆశా వర్కర్లను రోడ్డుపై లాగిపారేశారు?
- ఇందిరమ్మ రాజ్యమంటే అణచివేతలు.. అక్రమ అరెస్టులేనా?
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



2

గ్రూప్ 2 పరీక్షలను
## వాయిదా వేయలేం

ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి
పిటిషన్లను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

2



నెలలో ఒక రోజు
## వసతి గృహాలకు వెళ్తాం

- విద్యార్థులతో కలిసి భోజనం చేస్తాం
- వసతి గృహాల్లో సదుపాయాల కల్పనకు
- రూ.5వేల కోట్లు కేటాయించాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 100 | ₹ 122 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹ 177 | ₹ 201 |

చెన్నమనేని రమేశ్
## జర్మనీ పౌరుడే..

తప్పుడు డాక్యుమెంట్లతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారు
తేల్చిచెప్పిన హైకోర్టు
రూ.30లక్షల జరిమానా విధింపు

2



## తెలంగాణ తల్లిపై రాజకీయ లొల్లి

### విగ్రహం రూపకల్పనపై భిన్నాభిప్రాయాలు..

- తెలంగాణ తల్లి విగ్రహం నాలుగుకోట్ల మంది బిడ్డల భావోద్వేగం..
- రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే విగ్రహంపైనా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది
- ముఖ్యమంత్రి రేవంత్, కాంగ్రెస్ నాయకుల వాదన
- తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర..విగ్రహమార్పు మూర్ఖపు చర్య
- తెలంగాణ ఆత్మగా భావించే బతుకమ్మ లేకుండా విగ్రహాన్ని ఎలా రూపొందిస్తారు
- మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకుల వాదన
- అసహనం వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు..

3



## త్వరలో ఏపీ క్యాబినెట్‌లోకి నాగబాబు..

(మొదటి పేజీ తరువాయి)
పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ మాత్రమే మంత్రులుగా ఉన్నారు. కానీ, కూటమి పొత్తుల్లో భాగంగా జనసేనకు 4, బీజేపీకి ఒక మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంది. భర్తీ కావాల్సిన ఆ ఒక్క స్థానం జనసేన నుంచి ఖరారు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాగబాబును మంత్రిమండలిలోకి తీసుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

## నెలలో ఒక రోజు వసతి గృహాలకు వెళ్తాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** నెలలో ఒక రోజు వసతి గృహాలకు వెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సీఎంతో పాటు సభ్యులందరూ వసతి గృహాలను పరిశీలిస్తారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో భట్టి విక్రమార్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. డిసెంబర్ నెల నుంచే హాస్టళ్లలో పర్యటిస్తామని.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఇందుకోసం రూ.5వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. గత పదేళ్లలో డైట్ ఛార్జీలు పెంచలేదని.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే డైట్ ఛార్జీలు పెంచినట్లు భట్టి తెలిపారు.

## తెలంగాణ తల్లులపై ఏంటీ దుర్మార్గం?

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లులపై ఏంటీ దుర్మార్గం? ఆశా వర్కర్లు మీకు తల్లుల్లా కనిపించడం లేదా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్లు హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న ఆశాలను పోలీసులు అడ్డుకోవడంతో వారి మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీనిపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ''మాతృ మూర్తులపై పురుష పోలీసులతో దౌర్జన్యమా? ఏం పాపం చేశారని ఆశా వర్కర్లను రోడ్డుపై లాగిపారేశారు?ఇందిరమ్మ రాజ్యం అంటే అణచివేతలు, అక్రమ అరెస్టులేనా? ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. లేకపోతే వారి ఆగ్రహ జ్వాలలను తట్టుకోలేరు'' అని హెచ్చరించారు.

## గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయలేం

**విశ్వంభర, హైదరాబాద్:** టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్2 పరీక్షలను వాయిదా వేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయినందున వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. డిసెంబర్ 16న రైల్వే పరీక్ష ఉందని, ఒకే రోజు గ్రూప్2, రైల్వే పరీక్షలు ఉన్నందున పరీక్షను వేరే తేదీకి మార్చాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే, గ్రూప్2 వాయిదా వేయడం వల్ల లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులంతా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్లు కొట్టివేసింది.

## చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడే..

**విశ్వంభర, హైదరాబాద్:** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కు తెలంగాణ హైకోర్టు లో షాక్ తగిలింది. పౌరసత్వం కేసులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చిచెప్పింది.జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని.. తప్పుడు డాక్యుమెంట్లతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆయనకు రూ.30లక్షల జరిమానా విధించింది. నెలలోపు చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిలో రూ.25లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, రూ.5లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. తప్పుడు సమాచారంతో ఎన్నికల్లో పోటీ చేశారంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో చెన్నమనేని రమేశ్‌కు వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

## ఆర్‌బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

**దిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన గవర్నర్‌గా రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగియడంతో తదుపరి గవర్నర్‌ను కేంద్రం నియమించింది. 2018లో ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్.. పదవీ కాలం 2021లోనే ముగియగా కేంద్రం మరో మూడేళ్లు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబర్ 10తో ముగియనుండడంతో కొత్త గవర్నర్‌ను నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. మల్హోత్రా ఆర్‌బీఐకి 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. డిసెంబర్ 11 నుంచి మూడేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.సంజయ్ మల్హోత్రా 1990 బ్యాచ్ రాజస్థాన్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఐఐటీ కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ అభ్యసించారు. విద్యుత్, ఆర్థిక, పన్నులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మైన్స్ తదితర రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా సర్వీసులందించారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని రెవెన్యూ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక, పన్నుల విషయంలో అపారమైన అనుభవం కలిగిన ఆర్థిక, ట్యాక్సేషన్‌లో అపారమైన అనుభం కలిగిన సంజయ్ మల్హోత్రా.. ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు.

### సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలోనూ తెలంగాణ వచ్చేది కాదు: కోమటిరెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

# ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన ఈ రోజు (డిసెంబర్ 9) చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎన్నో ఏళ్లు అవహేళనకు గురైందని చెప్పారు. రాష్ట్ర సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరం 'టీజీ' అని రాసుకున్నామని, వాహనాలు, కార్యాలయాల మీద కూడా అదే రాసుకున్నామని చెప్పారు. కానీ, గత ప్రభుత్వం మాత్రం 'టీజీ' అక్షరాలు కాదని, టీఎస్ అని పెట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. '' ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీఎస్'ను 'టీజీ'గా మార్చాం. ఉద్యమ రోజుల్లో ఎక్కడ విన్నా.. 'జయ జయహే తెలంగాణ' వినిపించేది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ గీతానికి గౌరవం దక్కలేదు. అందుకే మేం 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించాం. పదేళ్లపాటు తెలంగాణ తల్లి వివక్షకు గురైంది. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్నాం. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారు. తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉద్రూతలూగించారు. వారిని గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉంది. మొత్తం 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం నజరానా ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ, అమరవీరుల స్తూపం రూపశిల్పి ఎక్కా యాదగిరి, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, బండి యాదగిరి, గూడ అంజయ్య, గద్దర్, జయరాజ్ కుటుంబాలకు రూ.కోటి చొప్పున నగదు, 300 గజాల స్థలం బహుమానంగా ఇస్తున్నాం'' అని రేవంత్ రెడ్డి తెలిపారు.

### తొలి ప్రకటన వచ్చింది ఈ రోజే - భట్టి విక్రమార్క

డిసెంబర్ 9వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఇస్తున్నట్లు కేంద్రం నుంచి తొలి ప్రకటన డిసెంబర్ 9నే వచ్చిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నామని, కానీ, ఆ ఆకాంక్షలు మాత్రం గత పదేళ్లు నెరవేరలేదని చెప్పారు.

''ప్రజలు తొమ్మిదిన్నరేళ్లు నిర్బంధాల మధ్య గడిపారు. రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టి అతలాకుతలం చేశారు. భారీ అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించాం. రైతు రుణమాఫీ కింద రూ.21వేల కోట్లు ఇచ్చాం. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వాన్ని ఇచ్చారు. భారీ అప్పుల్లో ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పదేళ్లపాటు విద్యార్థుల డైట్ ఛార్జీలను గత ప్రభుత్వం పెంచలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డైట్ ఛార్జీలను ఒకేసారి 40శాతం పెంచాం. గురుకులాలకు కూడా గత ప్రభుత్వం సరైన భవనాలు నిర్మించలేదు'' అని భట్టి అన్నారు.

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి..

తెలంగాణ చరిత్ర కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన 20 అడుగుల తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గుండుపూసలు, హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్కసారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా రూపకల్పన చేశారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డ్రోన్ షో ఆకట్టుకుంది. విద్యుత్ కాంతుల్లో సచివాలయ భవనం వెలుగులీనింది. కళ్లుమిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగు ప్రజలను పరవశింపజేశాయి.

### తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆమోదించిన ప్రభుత్వం..

తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆమోదిస్తూ ప్రభుత్వం తెలుగులో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. తెలంగాణ తల్లి జాతి అస్తిత్వ, ఆత్మగౌరవ ప్రతీక కాబట్టి.. చిత్ర రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ తల్లి చిత్రాన్ని బహిరంగంగా లేదా సామాజిక మాధ్యమాల్లో మాటలు, చేతలతో అగౌరవపరచడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేయడం, అవమానించడం, కించపరచడాన్ని నేరంగా పరిగణించనున్నట్లు జీవోలో పేర్కొంది. డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని రాష్ట్ర, జిల్లా, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార కార్యక్రమంగా జరుపుకోవాలని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర బహుజనుల పోరాట పటిమ, సాంస్కృతిక, సంప్రదాయ, వ్యవసాయ పద్ధతులను, శ్రమించే జీవనశైలిని, భావితరాలకు స్ఫూర్తిని కలిగించే చిహ్నంగా తెలంగాణ తల్లి ఉండాలని ప్రభుత్వం భావించినట్లు జీవోలో పేర్కొంది.



తెలంగాణ తల్లి అంటే 4 కోట్ల బిడ్డల భావోద్వేగం: సీఎం రేవంత్

డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని చెప్పారు. 'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాటలు నిత్యసత్యమని పేర్కొన్నారు. భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు.. ఆ జాతి అస్తిత్వమే అని చెప్పారు. అస్తిత్వానికి మూలం సంస్కృతి.. సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని వివరించారు.

''స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి. తెలంగాణ జాతి భావనకు జీవం పోసింది. నిరంతరం చైతన్యపరిచి లక్ష్యసాధన వైపు నడిపింది. తెలంగాణ తల్లి స్వరూపానికి అధికారిక గుర్తింపు లేదు. ప్రజాపోరాటాలకు ఊపిరి పోసుకున్న మాతృమూర్తిని గౌరవించుకునేందుకు నిర్ణయించాం. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ప్రజల మనోఫలకాల్లో నిలిచిన రూపాన్ని సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విగ్రహానికి రూపకల్పన చేశాం.

తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో తీర్చిదిద్దాం. గుండు పూసలు, హారం, ముక్కుపుడకను పొందుపర్చాం. ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్కసారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి రూపకల్పన చేశాం. సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా ఏర్పాటు చేశాం. చరిత్రకు దర్పణంగా నిలుచున్న విగ్రహాన్ని రూపొందించాం. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను పొందుపరిచాం'' అని రేవంత్‌రెడ్డి వివరించారు.

### అదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి..

తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించిన అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. అదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అని ప్రభుత్వం నమ్ముతోందని చెప్పారు. ఇది అత్యంత ప్రాధాన్యంతో కూడుకున్న అంశమని.. దీనిపై అభిప్రాయాలు చెప్పే అవకాశం అందరికీ కల్పించినందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినమని.. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆనాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం చేత సోనియా గాంధీ ప్రకటన చేయించారని భట్టి విక్రమార్క గుర్తు చేశారు.

## ఈ పార్లమెంటు సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు!

**దిల్లీ:** జమిలి ఎన్నికల పై మరో ముందడుగు పడనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లేదంటే వచ్చే సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. ఆ తర్వాత దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ.. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లును సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేపీసీ సంప్రదింపులు జరపడంతోపాటు అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలని సూచిస్తూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమర్పించిన నివేదికకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఒక దేశంఒకే ఎన్నికల విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని కోవింద్ కమిటీ పేర్కొంది. అయితే, దీనికోసం పలు రాజ్యాంగ సవరణలను కమిటీ సిఫార్సు చేసింది.

జమిలి ఎన్నికల ప్రతిపాదనలపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 30కిపైగా పార్టీలు దీన్ని సమర్థించగా.. కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంటోంది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతు ఇవ్వడం లేదని.. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే చెబుతున్నారు. ఇదిలాఉంటే, దేశంలో పార్లమెంటుతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు గతంలోనూ జరిగాయి. 1951 నుంచి 1967 దాకా దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలే జరిగాయి. తర్వాత వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలడంతో మధ్యంతర ఎన్నికలొచ్చి జమిలి మాయమైంది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువులు మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వీటన్నింటినీ రాబోయే సార్వత్రిక ఎన్నికలతో కలపాలంటే.. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచడమో..మరికొన్నింటికి తగ్గించడమో చేయాల్సి ఉంటుంది.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 5 బిల్లులు.. 2 నివేదికలను శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన తదితర అంశాలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారు. ఈ అంశంపై స్వల్ప చర్చ చేపట్టే అవకాశాలున్నాయి. తర్వాత పలు సంతాప తీర్మానాలు ప్రవేశ పెడతారు. అనంతరం సభ వాయిదా పడే అవకాశాలున్నాయి. ఈ సమావేశాల్లోనే రైతు భరోసా విధివిధానాలపై చర్చించనున్నారు.

### రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన: మంత్రి పొన్నం

విశ్వంభర, హైదరాబాద్:తెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

### గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని

## అధికారికంగా ఆవిష్కరించారా?: మంత్రి సీతక్క



**విశ్వంభర, హైదరాబాద్:** సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవనరూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని చెప్పారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు. ''తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాపై విమర్శలు చేస్తున్నారు. గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడైనా అధికారికంగా ఆవిష్కరించారా? కేటీఆర్ సోదరికి దేవతా విగ్రహ రూపాన్ని ఇస్తే ఎలా ఉంటుందో అలా పెట్టుకొని దాన్ని రాష్ట్ర ప్రజలపై రుద్దారు. నేడు మేం తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించాం. గుండెల నిండా పాడుకునే 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా ఏర్పాటుచేయాలనే ఆలోచన గత పాలకులకు రాలేదు. నేడు మేం చేస్తుంటే అడ్డుకుంటున్నారు.

ఉద్యమ సమయంలో టీజీ అని.. అధికారంలోకి వచ్చాక టీఎస్ అని మార్చారు. అప్పుడు భాజపా మాట్లాడలేదు. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పెట్టిన విగ్రహాన్ని చూస్తుంటే మా అక్కాచెల్లెళ్లను చూసినట్లే ఉంది. తెలంగాణ మహిళలు మట్టి బిడ్డలు.. ఆ శ్రామిక తత్వానికి ప్రతిరూపంగా రూపొందించాం'' అని సీతక్క అన్నారు.

## ఇది టెక్, డేటా నడిపించే శతాబ్దం

'ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2024'లో ప్రధాని మోదీ

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రతి పెట్టుబడిదారుడు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన 'ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2024'లో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనుంది. ''రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ మంత్రంగా భారత్ చేసిన అభివృద్ధి ప్రతి రంగంలోను కనిపిస్తోంది. గత పదేళ్లలో భారత్ 10 అతి పెద్ద ఆర్థికవ్యవస్థల నుంచి 5వ స్థానానికి చేరింది. గత పదేళ్లలో ఆర్థికవ్యవస్థ మారడంతో ఎగుమతులు రెట్టింపు అయ్యాయి. ఇక ఎఫ్‌డీఐలు కూడా రెండింతలు పెరిగాయి. ఈ సమయంలో దేశంలో ఇన్ఫ్రాపై వ్యయాలు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు చేర్చాము.

భారత్ వంటి వైవిధ్యభరితమైన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం మనకు పెద్ద ఉపయోగం. మరికొన్నేళ్లపాటు మనం అత్యంత యువ దేశంగా ఉండనున్నాం. ఇక్కడే అత్యధికమంది నైపుణ్యవంతులైన యువకులు ఉంటారు. ఇది టెక్, డేటా నడిపించే శతాబ్దం. గత పదేళ్లలో ఇంటర్నెట్ వినియోగం నాలుగు రెట్లు పెరిగింది. ఇక డిజిటల్ చెల్లింపుల్లో భారీగా పుంజుకొంది.

స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వాలు రాజస్థాన్ అభివృద్ధి, సంస్కృతిని నిర్లక్ష్యం చేశాయి. అందుకే ఈ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. 'వికాస్ భీ విరాసత్ భీ' మంత్రంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాజస్థాన్‌లోని పరిస్థితులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు బాగా నేర్చుకొంటారు. భారత్‌లో అతి పెద్ద సోలార్ పార్కుల్లో చాలావరకు ఇక్కడే ఏర్పాటవుతున్నాయి. డ్రైపోర్టులకు ఇది అత్యంత అనుకూలమైన ప్రదేశం. రెండు ఎయిర్ కార్గో కాంప్లెక్సులు కూడా ఏర్పాటుచేశాం'' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ తొలుత మాట్లాడుతూ ఇప్పటికే రూ.30 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగినట్లు తెలిపారు. అనంతరం వ్యాపారవేత్తలు బిర్లా గ్రూప్‌నకు చెందిన కుమార మంగళం బిర్లా, మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా, వేదాంత రిసోర్స్ వ్యవస్థాపకులు అనిల్ అగర్వాల్ ప్రసంగించారు.

## ఆశా వర్కర్లపై పోలీస్ లాఠీచార్జి అమానుషం..

**విశ్వంభర, హైదరాబాద్:** గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగినందుకు కాంగ్రెస్ పాలకులు ఆడబిడ్డలను ఖాకీలతో కొట్టించడం అమానుషం అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. నెలకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలియజేసిన ఆశా వర్కర్లను దారుణంగా పోలీసులు కొట్టారని ఆరోపించారు. ఆశా వర్కర్లను బలవంతంగా పోలీస్ వ్యాన్లలో ఎక్కించిన తీరు.. ఆనాడు తెలంగాణ ఉద్యమ సమయంలో ఉన్న నిర్బంధాలు, అణచివేతకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదేనా తెలంగాణ ఆడబిడ్డలకు సోనియా గాంధీ బర్త్ డే గిఫ్ట్ అని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో, బతుకమ్మ ఆడే చేతులతోనే, ఆడబిడ్డలు కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం ఖాయం అని స్పష్టం చేశారు.



# తెలంగాణ తల్లిపై రాజకీయ లొల్లి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో చీఫ్ :** తెలంగాణ సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి నిలువెత్తు రూపం కొలువుదీరింది. 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని సెక్రటేరియట్ లో ఆవిష్కరించింది తెలంగాణ ప్రభుత్వం. బీఆర్ఎస్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉంది. బీజేపీ కూడా తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో కొంచెం ఇష్టం కొంచెం కష్టమన్నట్లే ప్రతిస్పందించింది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీర్చిదిద్దామని ప్రకటించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. లక్ష మంది మహిళల సమక్షంలో గ్రాండ్‌గా విగ్రహాన్ని ఆవిష్కరించింది. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయితే, తెలంగాణ తల్లి విగ్రహం భావన కాదు భావోద్వేగం.. తెలంగాణ అస్థిత్వానికి చిహ్నం.. కొత్త రూపురేఖలతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర పాలనాకేంద్రంలో ఆవిష్కరించడంపై రాజకీయ రచ్చతో పాటు భావోద్వేగ చర్చ జరుగుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు విగ్రహం చుట్టే జరుగుతోంది చర్చ. అమ్మ ఆహార్యం ఎలా కనిపించాలి ..?బతుకమ్మ లేకుండా విగ్రహం ఏంటి..? ప్రభుత్వాలు మారితే పాత పథకాల్లో కొన్ని ఆగిపోతాయి. కొత్త పథకాలు తెరపైకొస్తాయి. కానీ అధికారం మారగానే సంస్కృతీ సంప్రదాయాలు మారిపోతాయా, ఆత్మగౌరవ అంశాలు తెరపైకొస్తాయా అనేది తెలంగాణ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.





### తెలంగాణ తల్లి విగ్రహం నాలుగుకోట్ల మంది బిడ్డల భావోద్వేగం..

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ముందే అసెంబ్లీలో ఈ అంశంపై మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ తల్లి విగ్రహం నాలుగుకోట్ల మంది బిడ్డల భావోద్వేగమన్నారు. ప్రశాంత వదనంతో నిండైన రూపంతో చాకలి ఐలమ్మ, సారలమ్మ పోరాట స్ఫూర్తి కనిపించేలా హుందాగా, నిండుతనంతో కనిపించేలా విగ్రహాన్ని రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ తల్లి రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులను పరిగణనలోకి తీసుకున్నామన్నారు సీఎం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టూబొట్టుతో, గుండు పూసలు, హారం, ముక్కు పుడకతో చేతులెత్తి మొక్కేలా తల్లి ఆకృతిని తీర్చిదిద్దామన్నారు. ఆకుపచ్చ చీర , కడియాలు, మెట్టెలతో తెలంగాణ తల్లి ప్రతిమకు రూపకల్పన చేసింది ప్రభుత్వం. తెలంగాణ తల్లి నిల్చున్న పీఠం చరిత్రకు దర్పణంగా నిలుస్తుందన్నారు సీఎం. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే విగ్రహంపైనా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆవిష్కరణ సందర్భంగా సీఎం మండిపడ్డారు.ఇప్పటిదాకా అసలు రూపమే లేదు. ఇక మార్చిందెక్కడ అంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ తల్లికి ఇంతవరకూ అధికారికంగా ఒక రూపాన్ని ఇవ్వలేదంటోంది అధికారపక్షం. బీఆర్ఎస్ భవన్‌లో ఉండే తెలంగాణ తల్లి విగ్రహాన్ని కేసీఆర్ ఉద్యమ సమయంలో తీర్చిదిద్దారని, అయితే ఆ విగ్రహ నమూనాని అధికారికం చేయలేదని, పదేళ్లు అధికారంలో ఉన్నా ప్రతిష్టించే ప్రయత్నం చేయలేదంటోంది కాంగ్రెస్ సర్కార్. తెలంగాణ ప్రభుత్వం ఉత్సవాలు చేయాలనుకున్నప్పుడు తెలంగాణ తల్లి విగ్రహ నమూనా అధికారికంగా లేదనేది సర్కారు వాదన. అసెంబ్లీలోనూ ఇదే వాదన బలంగా వినిపించారు మంత్రులు.అయితే రాష్ట్రంలోని సగటు మహిళని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ తల్లిని తీర్చిదిద్దామంటున్న ప్రభుత్వం.. విపక్షాల వాదనను కొట్టిపారేస్తోంది.

### కొత్త విగ్రహాన్ని రూపొందిస్తామని అధికారంలోకి రాగానే చెప్పిన రేవంత్

బీఆర్ఎస్ హయాంలో రూపుదిద్దిన తెలంగాణ తల్లి విగ్రహం రాచరిక పోకడలకు దగ్గరగా ఉందని ఆక్షేపిస్తూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ ఆడబిడ్డను గుర్తు చేసేలా.. సాధారణ మహిళలా, పోరాట స్ఫూర్తిని చాటేలా కొత్త విగ్రహాన్ని రూపొందిస్తామని అధికారంలోకి రాగానే చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ అస్తిత్వ చిహ్నంగా తెలంగాణ తల్లికి రూపమిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలుగు తల్లి స్థానంలో తమ ప్రాంత అస్తిత్వానికి ప్రతీకగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెరపైకి తీసుకొచ్చారు. తెలంగాణకు చెందిన ప్రముఖ రచయిత బీఎస్ రాములు మొదటిసారి తెలంగాణ తల్లికి ఒక రూపాన్ని ఇచ్చే ప్రయత్నం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చాలా ప్రాంతాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటయ్యాయి.

### తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసే కుట్ర - బీఆర్ఎస్ వాదన..

తెలంగాణ సంస్కృతికి చిహ్నంగా బీఆర్ఎస్ తీసుకొచ్చిన తెలంగాణ తల్లి విగ్రహంలో ఒక చేతిలో బతుకమ్మ, గద్వాల, పోచంపల్లి నేతన్నల కృషి చూపించే పట్టు చీర, కరీంనగర్ వెండి మట్టెలు, మెట్ట పంటలకు చిహ్నంగా మక్కకంకులు ఉండేవి. కోహినూర్ వజ్రంతో కిరీటంతో పాటు వడ్డాణం, జరీ అంచుచీర, నిండైన కేశ సంపదతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అప్పట్లో తీర్చిదిద్దారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విగ్రహం రూపురేఖల్లో మార్పులుచేర్పులు చేశారు. ఆకుపచ్చ చీరలో తెలంగాణ తల్లి విగ్రహం ఉంది. మెడలో కంటె, బంగారు ఆభరణాలున్నాయి. ఎడమ చేతిలో వరి, మొక్కజొన్న కంకులు, జొన్నలు ఉన్నాయి. చెవులకు కమ్మలతో నిండుగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించారు. అయితే ఇందులో బతుకమ్మ కనిపించలేదు.విగ్రహ నమూనా బయటికొచ్చినప్పటి నుంచే ఇది తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసే కుట్రని వాదిస్తూ వచ్చింది బీఆర్ఎస్. తెలంగాణ ఆత్మగా భావించే బతుకమ్మ లేకుండా విగ్రహాన్ని ఎలా రూపొందిస్తారని ప్రశ్నిస్తోంది విపక్షపార్టీ. తెలంగాణ తల్లిని పేదరికంతో చూపించే ప్రయత్నం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని వాదిస్తోంది బీఆర్ఎస్. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రముఖ కవి, రచయిత జూలూరి గౌరీశంకర్ పిటిషన్ వేశారు. తెలంగాణ తల్లి రూపు రేఖలు మార్చడంతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను కూడా మార్చకుండా చూడాలని కోరారు.అధికారికం సంగతి పక్కనపెడితే దశాబ్ద కాలంగా ప్రజల మనసుల్లో ముద్రపడ్డ రూపాన్ని మార్చాల్సిన అవసరం ఏంటని ప్రశ్నిస్తోంది బీఆర్ఎస్. బతుకమ్మని తీసేసి కాంగ్రెస్ పార్టీ గుర్తు పెట్టారని విపక్షపార్టీ ఆరోపిస్తోంది. మొదట్నించీ విగ్రహ మార్పుని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్.. ఈ భావోద్వేగ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకుంటోంది. కేసీఆర్‌పై కుట్రతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారంటోంది బీఆర్ఎస్. కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణభవన్ దగ్గర నిరసనకు దిగారు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు. ఫాంహౌస్‌లో పార్టీనేతలతో భేటీలో విగ్రహమార్పుపై స్పందించారు కేసీఆర్. ఇది మూర్ఖపు చర్యన్న బీఆర్ఎస్ అధినేత ప్రభుత్వ చర్యని వ్యతిరేకించాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఓపక్క ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుండగానే.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో తెలంగాణ తల్లి పాత విగ్రహాన్ని పునరావిష్కరించింది బీఆర్ఎస్.

### కాంగ్రెస్ అపచారానికి.. తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలి.. కేటీఆర్ పిలుపు

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడిక్కడ తెలంగాణ తల్లి విగ్రహాలకు మంగళవారం పాలాభిషేకం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. 'ప్రభుత్వం చేసిన అపచారానికి తప్పకుండా రీతిలో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుడికి, ప్రతి ఒక్క ఉద్యమ బిడ్డకి నేను విజ్ఞప్తి చేస్తున్నా. మనం రెండు పనులు చేద్దాం. ఖచ్చితంగా తెలంగాణ తల్లిని 2007లో ఏ తల్లి అయితే ఉద్యమంలో నుంచి ఉద్భవించిందో.. సోషల్ మీడియా, వాట్సాప్ డీపీల్లో తెలంగాణ తల్లి డీపీగా పెట్టుకుందాం.. ఎవడు ఏం పీకుతడో చూద్దాం అనే మాట నేను విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ.. ఎక్కడైతే తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయో.. అక్కడ రేపటి రోజున.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా పాలాభిషేకాలు చేద్దాం. అవసరమైతే పంచామృతాభిషేకాలు చేద్దాం.. జరిగిన తప్పుకు క్షమాపణలు అడుగుదాం.. ఈ కాంగ్రెస్ మూర్ఖులకు చరిత్ర తెలియదు.. ఈ సన్నాసులను క్షమించమని కోరుదాం' అన్నారు.

### విగ్రహం రూపకల్పనపై భిన్నాభిప్రాయాలు..

5కోట్ల 30లక్షల రూపాయల వ్యయంతో తెలంగాణ తల్లి కొత్త కాంస్య విగ్రహాన్ని ప్రముఖ శిల్పి రమణారెడ్డి బృందం రూపుదిద్దింది. విగ్రహం ఎత్తు 17 అడుగులు, కిందిగద్దె మరో మూడు అడుగులతో మొత్తం 20 అడుగుల ఎత్తున రూపొందించారు. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి కొత్త విగ్రహంపై కవులు, ప్రజాసంఘాలనుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అసహనం వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు..

రాష్ట్ర సంస్కృతిని చాటాల్సిన విగ్రహం, పాటల విషయంలోనూ వివాదాలపై ఆవేదన వ్యక్తంచేస్తున్నారు తెలంగాణ ఉద్యమకారులు.ఏ రాష్ట్రానికైనా రాష్ట్ర గీతం ఒకటే ఉంటుంది. ఆరాధించే తల్లి ఒకటే ఉంటుంది. కానీ తెలంగాణకు వచ్చేసరికి సీన్ మారుతోంది. మీ తల్లి మీదే.. మా తల్లి మాదే. మీ గీతం మీదే.. మా గీతం మాదే అన్నట్లుంది పరిస్థితి. తమ హయాంలో రూపుదిద్దిన విగ్రహమే అసలు సిసలు తెలంగాణ తల్లి అని వాదిస్తోంది బీఆర్ఎస్. జయజయహే తెలంగాణ పాటని ప్రభుత్వం రాష్ట్రగీతంగా ప్రకటించినా.. పాతపాటనే ఆలపిస్తామంటోంది బీఆర్ఎస్. టీజీని కంటిన్యూ చేస్తామని కాంగ్రెస్ అంటుంటే.. అధికారంలోకి రాగానే మళ్లీ టీఎస్‌గా మారుస్తామంటోంది బీఆర్ఎస్. పదేళ్ల తర్వాత కూడా తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతంపై ఎడతెగని పంచాయితీపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఉద్యమకారులు అసహనంతో ఉన్నారు.

### ప్రతి అంశంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ లమధ్య భిన్నవాదనలు ...

తెలంగాణ తల్లి విషయంలోనే కాదు.. తెలంగాణ భావోద్వేగాలతో ముడిపడ్డ ప్రతీ విషయంలోనూ సెంటిమెంట్ మళ్లీ తెరపైకొస్తోంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిందంటోంది కాంగ్రెస్. అందుకే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తప్పిదాలను సరిచేస్తున్నామంటోంది. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడానికి ముందే.. తెలంగాణ సమాజంపై ప్రభావం చూపే కొన్ని కీలకాంశాలపై తనదైన ముద్రవేసే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. దీనిని బీఆర్ఎస్ వ్యతిరేకించింది. తాము అధికారంలోకొచ్చాక మారుస్తామని హెచ్చరించింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో భారీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించింది. భావోద్వేగాలతో రాజకీయం చేసిన బీఆర్ఎస్.. తెలంగాణ సమాజం ఆకాంక్షలను ఏనాడూ గౌరవించలేదంటోంది కాంగ్రెస్. తాము అధికారంలోకొచ్చాకే తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామంటోంది. జయజయహే తెలంగాణ గీతంలో మార్పులు చేసి రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించిన సమయంలో కూడా విపక్షాలనుంచి కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేర్పులతో జూన్2 ఆ పాటను విడుదల చేసింది.జయజయహే తెలంగాణ పాటలో పది జిల్లాల తెలంగాణ అనే పదం స్థానంలో పద పదాన అని చేర్చారు. ప్రత్యేక రాష్ట్రాన ప్రజల కలలు పండాలి.. అంటూ పాత పాట ముగుస్తుంది. రాష్ట్రం సిద్ధించటంతో ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి అని కొత్త పాటలో ముగింపు వాక్యాన్ని చేర్చారు. నవాబులు అనే పదం స్థానంలో భాగ్యనగరి పదాన్ని చేర్చారు. ఫుల్ వెర్షన్ కోసం అందెశ్రీ కొత్త చరణాలు రాశారు. ఇందులో తెలంగాణ కవుల ప్రాశస్త్యాన్ని వివరించారు. కీరవాణి స్వరకల్పనతో పదమూడున్నర నిమిషాల నిడివితో రాష్ట్ర అధికారిక గీతాన్ని తీర్చిదిద్దారు అందెశ్రీ. రాష్ట్ర అధికారిక కార్యక్రమాల్లో, ప్రముఖులు వచ్చిన సందర్భాల్లో ఆలపించేందుకు రెండున్నర నిమిషాల నిడివితో మరో గీతాన్ని రూపొందించారు.అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక తెలంగాణ రాష్ట్ర సంక్షిప్తరూపం టీఎస్‌ని.. టీజీగా మార్చేసింది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా టీజీకి అధికారిక గుర్తింపు ఇచ్చామని ప్రభుత్వం ప్రకటించింది. 2014లోనే టీజీగా పెట్టాలని అనుకున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వెహికల్ రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర సంస్థలకు టీఎస్ అని పెట్టాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సంక్షిప్తరూపం టీజీగానే ప్రజల్లో విస్తృతంగా ప్రచారమైంది. అందుకే అధికారంలోకి రాగానే కాంగ్రెస్ దీనిపై నిర్ణయంతీసుకుని ఆ క్రెడిట్ తన ఖాతాలో వేసుకుంది.తెలంగాణ అధికారిక చిహ్నాన్ని కూడా మార్చాలనుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రత్యామ్నాయ లోగోను సిద్ధంచేసింది. చార్మినార్, కాకతీయ కళాక్షేత్రాలను తొలగిస్తున్నారన్న ప్రచారంతో పాటు.. కొత్త రాజముద్రపై తీవ్ర చర్చ జరిగింది. విపక్షపార్టీ అభ్యంతరాలతో పాటు వివిధ వర్గాల నుంచి కొన్ని సూచనలతో ప్రస్తుతానికి పాత చిహ్నాన్నే కొనసాగిస్తోంది. ఇక అభివృద్ధి కార్యక్రమాలు, పాత పథకాల విషయంలోనూ అప్పటి ఇప్పటి ప్రభుత్వాలు భిన్నమైన వైఖరితో ముందుకెళ్తున్నాయి. బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా కొనసాగించిన స్కీమ్‌ల స్థానంలో కొత్త పథకాలు తెరపైకొస్తున్నాయి. కొత్త రాష్ట్రంలో వరుసగా ఏర్పడ్డ రెండు ప్రభుత్వాల పాలనతీరు పూర్తి భిన్నంగా ఉందన్న చర్చ నడుస్తోంది. మళ్ళీ అధికారంలో వస్తే ఒక్క మహాత్మా గాంధీ పేరు తప్ప అన్ని గాంధీల పేర్లను తొలగిస్తామని హెచ్చరిస్తున్న బీఆర్ఎస్. తల్లి విషయంలో కాదు. కొత్త రాష్ట్రంలో వరుసగా ఏర్పడిన రెండు ప్రభుత్వాలు... రెండు భిన్నమైన ఆలోచనలతో సాగుతున్న వ్యవహారం. తెలంగాణాని టీఎస్ నుంచి టీజీ మార్చడం, రాష్ట్ర గీతాన్ని గుర్తించడం. తల్లి విగ్రహాన్ని మార్చడం ఇలా ప్రతి అంశంలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ లు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి.

# తెలంగాణ తల్లులే కాంగ్రెస్‌ను గద్దె దించుతారు

**- పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సిద్ధమవుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ తల్లుల లాంటి మహిళలను అరెస్టు చేయించారని భారాస ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 18 వేలు జీతం ఇవ్వాలంటూ ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలపైకి కాంగ్రెస్ ప్రభుత్వమే పోలీసులను ఉసిగొల్పిందని ఆరోపించారు. రాష్ట్రంలో 12 వేల మంది సర్పంచ్‌లు ఆందోళన చేస్తున్నారని, వారి గోడును పట్టించుకునే వారే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ప్రభుత్వ పెద్దలు చేపట్టిన పనులకు రూ.వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారని, చిన్న చిన్న పనులు చేసిన సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఏడాది కాలంగా ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ విఫలమైందన్నారు. ''గ్రామాల్లో వీధిదీపాలకు కూడా డబ్బులు ఇవ్వడం లేదు. ఆరోగ్య సేవలు అందించే ఆశా కార్యకర్తలను పట్టించుకోకుండా, మాజీ సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తోంది. ఇవాళ ప్రతి పోలీస్‌స్టేషన్ రణరంగమైంది. రాష్ట్రంలోని ప్రతి మహిళ ఘోషిస్తోంది. కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడుతున్నాయి. మహిళా లోకమంతా ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దించుతుంది'' అని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

**సీఐపై చేయి చేసుకున్న ఆశా వర్కర్**

ఆశా కార్యకర్తల ఆందోళనతో కోఠి డీఎంహెచ్ఎస్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న ఆశాలను పోలీసులు అడ్డుకోవడంతో వారి మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో సుల్తాన్ బజార్ సీఐ శ్రీనివాస్‌పై ఓ ఆశా కార్యకర్త చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది.

# ఖమ్మంలో విషాదం.. తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య

**విశ్వంభర, మామిళ్లగూడెం:** తల్లి మందలించిందని మనస్తాపానికి గురై ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలోని మామిళ్ల గూడెంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లాలో నివాసం ఉండే మెడికల్ రిప్రజెంటేటివ్ కుమార్తె ఖమ్మంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొద్దిరోజులుగా పలు ఆరోగ్య సమస్యలు ఉండడంతో మధ్యాహ్న వేళల్లో పాఠశాలకు వెళ్లి పరీక్షలు రాస్తోంది.ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లాల్సి ఉండగా.. ఉదయం పెన్ను కొనుక్కొని వస్తానని చెప్పి ఇంటికి ఆలస్యంగా రావడంతో బాలిక తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఇంటి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు.
విద్యార్థిని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు, సీఐ అంజలి తెలిపారు.

# నడిరోడ్డు పైనే మమ్మల్ని అడ్డుకోవడం సమంజసమా?: కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ అదానీ ఫొటో ముద్రించిన టీషర్టులతో వెళ్లిన తమను అసెంబ్లీలోకి అనుమతించకపోవడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ గేటు వద్ద నిరసన కొనసాగించారు. అదానీరేవంత్ బొమ్మ ఉన్న టీషర్టులతోనే లోపలికి వెళ్తామని తేల్చి చెప్పారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.
అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్‌కు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు అదానీ ఫొటో ఉన్న టీషర్టులు ధరించి వెళ్లారన్నారు. ''లగచర్ల ప్రజల తరఫున నిరసన తెలిపేందుకు సభకు వెళ్తున్నాం. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల తరఫున పోరాడతాం. నడిరోడ్డుపైనే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సమంజసమా? అదానీకి కాంగ్రెస్ నేతలు దాసోహం అంటున్నారు. అదానీరేవంత్ బంధాన్ని బయటపెడతాం. పోలీసులను అడ్డుపెట్టుకొని సభకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు దిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ కడుతున్నారు. ఆ పార్టీ దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అసెంబ్లీలో నిరసన తెలుపుతాం''అని చెప్పారు.





**రాహుల్‌కు ఒక నీతి.. రేవంత్‌కు మరో నీతా?: హరీశ్‌రావు**

హరీశ్‌రావు మాట్లాడుతూ ''అదానీ ఫొటో ఉన్న టీషర్టులు ధరించి కాంగ్రెస్ నేతలు పార్లమెంట్‌కు వెళ్లారు. దిల్లీలో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలు ఆ టీషర్టులు వేసుకొని వెళ్తే మీకు ఫర్వాలేదు. రాష్ట్రంలో మేం నిరసన తెలుపుతూ టీషర్టులు ధరిస్తే మీకు ఇబ్బందేంటి? రాహుల్‌గాంధీకి ఒక నీతి.. రేవంత్‌రెడ్డికి మరో నీతి ఉంటుందా? కాంగ్రెస్ పార్టీకి ఒక సిద్ధాంతం లేదా? రాష్ట్రంలో దుర్మార్గ, అరాచక పాలన సాగుతోంది. ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు యత్నిస్తున్నారు. సభలో ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలని ఎవరైనా ఉద్యమాలు చేశారా? కొత్తగా రూపొందించిన విగ్రహంలో బతుకమ్మను తొలగించి చెయ్యి గుర్తు పెట్టారు. అలా చేయడం తెలంగాణ మహిళలను కించపరచడమే. రాష్ట్ర ప్రజలకు ఇది అవమానం. కేసీఆర్‌పై కుట్రతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారు.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయం చేస్తే చరిత్ర క్షమించదు: కూనంనేని



**విశ్వంభర, హైదరాబాద్:** సభలో భారాస సభ్యులు ఉంటే బాగుండేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కోరుకున్నట్లు తెలంగాణ తల్లి రూపం ఉండదన్నారు. కవులు, కళాకారులు, మేధావుల సలహాలు, సూచనల మేరకు రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఒక్కొక్కరూ ఒక్కో పాత్ర పోషించారని చెప్పారు. రాజకీయ కోణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని వివాదం చేస్తే చరిత్ర క్షమించదని వ్యాఖ్యానించారు.
''తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలి. ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నామని చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. తెరాసను భారాసగా మార్చుకోవచ్చు.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా రూపకల్పన చేస్తే తప్పు జరిగినట్లా?తెలంగాణ తల్లి విగ్రహం కన్నతల్లిలా ఉండాలనేదే ఉద్దేశం'' అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# గన్‌పార్కు వద్ద నివాళులర్పించిన కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు



**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్కు వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డితో పాటు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
అమరవీరులను కీర్తిస్తూ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ గేయాన్ని ఆలపించారు. ఈ సమయంలో కేటీఆర్ సహా ఆ పార్టీ నేతలంతా దేశపతి పాటను అనుసరిస్తూ నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ అదానీ ఫొటోలు ముద్రించిన టీషర్టులు బీఆర్ఎస్ నేతలు ధరించారు.

**అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు....**

అసెంబ్లీ గేటు వద్ద భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. టీషర్టులపై సీఎం రేవంత్, అదానీ ఫొటో తొలగించి లోపలికి వెళ్లాలని వారు సూచించారు. దీనికి భారాస నేతలు అంగీకరించలేదు. అసెంబ్లీలోకి అనుమతించకపోవడంతో అక్కడే వారు నిరసనకు దిగారు. 'ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం.. దిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ' తదితర నినాదాలు చేశారు.

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

# పౌరుల రక్షణకే హక్కులు

- సమిష్టి బాధ్యతతోనే మానవ హక్కులకు రక్షణ
- నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

**“ మానవులంతా ఒక్కటే. ప్రతి ఒక్కరికి సహజసిద్ధమైన గౌరవం, సమాన, శాశ్వత హక్కులుంటాయి. ఏ వ్యక్తి విషయంలోనైనా ఈ అంశాలకు సంబంధించి ఎవరైనా భంగం కలిగిస్తున్నారంటే బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో న్యాయస్థానాలతో పాటు మానవ హక్కుల కమిషన్లు ఉన్నాయి. ఆదివారం 'మానవ హక్కుల దినోత్సవం' సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం.**



### ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం...

అసమానతలు తగ్గించి, సకల మానవ హక్కులతో, సమానత్వంతో జనజీవన స్రవంతిలో మమేకమై జీవించడమే మానవ హక్కుల దినోత్సవ ప్రధాన ఉద్దేశం. భారత దేశంలో1994 నుంచి మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమల్లో ఉంది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను కాపాడగలిగితే అదే నిజమైన మానవ హక్కుల పరిరక్షణగా భావించవచ్చు. మానవ హక్కులతో కూడిన ఆర్థిక వ్యవస్థ పేదరిక నిర్మూలనకు నిజమైన మార్గం. సమాజంలో ఉండే ప్రతీ ఒక్కరు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జీవించినప్పుడే మానవ జీవితాలకు సార్థకత. స్వేచ్ఛ అనేది కేవలం వ్యక్తిగతమైనదే కాదు, సంఘంతో ముడి పడి ఉన్న అంశం కూడా. మన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఇతరులకు ఇబ్బందిగా మారితే అలాంటి స్వేచ్ఛకు అర్థం లేదు. అలాంటి స్వేచ్ఛ సమాజానికే గొడ్డలి పెట్టు లాంటిది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం, హక్కుల కోసం దేశంలో అనేక ఉద్యమాలు జరిగాయి. వాటి ఫలితంగానే భారతదేశం లాంటి అనేక దేశాలు పరాయి దేశాల పీడన నుంచి విముక్తి చెందాయి. ప్రతీ దేశం తమ దేశంలోని ప్రజల మనోభీష్టాలకు, సక్రమ పాలనకు అనుగుణంగా రాజ్యాంగ రూపంలో కొన్ని నియమ నిబంధనలు ఏర్పాటు చేసుకున్నాయి.

### వ్యక్తుల రక్షణ కోసం రూపొందించినవే మానవ హక్కులు..

జాతి, కుల, మత, వర్ణ, లింగ, రాజకీయపరమైన వివక్షకు గురవ్వకుండా వ్యక్తుల రక్షణ కోసం రూపొందించినవే మానవ హక్కులు. ఇందులో చిత్రహింసలు, క్రూరత్వం, వెట్టి చాకిరి, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కులుంటాయి. అకారణంగా నిర్బంధానికి గురిచేయకుండా రక్షణ, స్వేచ్ఛగా స్వదేశం, విదేశాల్లో పర్యటించే హక్కులూ ఉన్నాయి. స్వేచ్ఛ, భావ ప్రకటన, బాలల, విద్య, మహిళ, ప్రజాస్వామ్య, కాపీరైట్, జాతీయత వంటి హక్కులలో.. ఎవరు ఏది ఉల్లంఘించినా శిక్షార్హులే.

### జాతీయ, రాష్ట్ర కమిషన్లకు శిక్షించే అధికారం..

మానవ హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి న్యాయస్థానాలతో పాటు మానవ హక్కుల కమిషన్‌లూ ఏర్పాటయ్యాయి. హక్కుల ఉల్లంఘన కారకులను శిక్షించేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఈ కమిషన్లు పూర్తి అధికారాలతో పనిచేస్తున్నాయి. మానవుల ధన, మాన, ప్రాణాలకు భరోసా ఇచ్చేలా మానవ హక్కుల కమిషన్లున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలతో అధికారం గల వారు వ్యక్తుల హక్కులకు భంగం కలిగిస్తున్న ఘటనలు అప్పుడప్పుడు బయటకొస్తున్నాయి. ఇటీవల రక్షణ లేని జీవితాలను గడుపుతున్నవారూ ఈ జాబితాలోకి చేరుతున్నారు. మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన తర్వాతే.. ఉల్లంఘన కారకులకు తగిన హెచ్చరికల ద్వారా బాధితులకు కాస్త ఊరట కలుగుతోంది..

### హక్కులను కాపాడని ఆర్భాటాలు వృథా..

మానవ హక్కుల సందేశాలు, అనునయన వాక్యాలు బాధిత హృదయాలకు సాంత్వన చేకూర్చలేవు. బాధితులకు సకాలంలో న్యాయం అందినప్పుడే చట్టాలపట్ల ప్రజలకు గౌరవం పెరుగుతుంది. ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలు మానవ హక్కుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమే. మయన్మార్ ప్రజాస్వామ్య ఉద్యమనేత 'ఆంగ్ సాన్ సూకీ' కి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధించడం మానవ హక్కుల భక్షణకు నిదర్శనం. ప్రపంచ దేశాలు, ఐక్య రాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు ఇలాంటి చర్యలను నిలువరించకుండా మానవ హక్కుల దినోత్సవాల పేరిట చేసే ఆర్భాటాలు ప్రహసనప్రాయంగా మారతాయి. అఫ్ఘాన్ లో తాలిబాన్ల పాలనకు చరమ గీతం పాడాలి. రష్యా, ఉక్రెయిన్ ల మధ్య యుద్ధం పరిసమాప్తి కావాలి. యుద్ధాల వల్ల మానవ హక్కులు హరించబడుతున్నాయి. ప్రపంచ ప్రజలంతా వారికి ఉన్న హక్కులతో స్వేచ్ఛగా జీవించే వాతావరణం నెలకొల్పాలి.

### అణచివేత వల్ల హక్కులకు భంగం

భారతదేశం లాంటి భిన్న వైరుధ్యాలు గల దేశాల్లో రాజ్యాంగం నిబంధనలు పూర్తి స్థాయిలో అమలు చేయాలంటే కొంత కష్టతరమైన పనే. అయినప్పటికీ మన దేశంలోని మేధావుల వలన, ప్రాచీన కాలం నుంచీ వస్తున్న సంస్కారం, సహనం వంటి భావాల వల్ల రాజ్యాంగం చాలా వరకు సరిగానే అమలు అవుతున్నది. దేశంలో కొన్ని విభేదాలు తలెత్తుతున్నాయి. భిన్నమతాలు, భిన్న కులాలు, విభిన్న సంస్కృతుల సమాహారమైన దేశంలో స్వల్ప సంఘర్షణలు సహజం. అనేక దేశాల్లో యుద్ధం, నేరాలు, రాజ్యహింస, రాజకీయ కక్షల వల్ల చాలా మంది వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోతున్నారు. అణచివేత, లింగవివక్ష, అవిద్య, అనాగరిక పద్ధతుల వల్ల, మూర్ఖ భావజాలం వల్ల కూడా చాలా మంది తమకున్న హక్కులను కోల్పోతున్నారు.

### ప్రజల్లో అవగాహన లోపం

అన్ని విధాలా హక్కుల పరిరక్షణ జరగాలని ఆకాంక్షిస్తూ.. వ్యక్తులు, సామాజిక మత సమూహాలు, మానవ హక్కుల సంస్థలు, పార్లమెంటు ఈ మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. మానవ హక్కుల పరిరక్షణ కోసం కొన్ని స్వచ్ఛంద సంస్థలు అక్కడక్కడ పనిచేస్తున్నాయి. యువతలో ఇంకా మరింత చైతన్యం నింపాల్సిన అవసరం ఉంది. తమ హక్కులకు భంగం కలిగినప్పుడు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చనే విషయంపై సైతం ప్రజలకు అవగాహన లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. దీనిపై విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పలు స్వచ్ఛంద సంస్థలు సూచిస్తున్నాయి.


### సమిష్టి బాధ్యతతోనే మానవ హక్కులకు రక్షణ


ఈ సమస్త సృష్టిలో అన్ని జీవరాశులు స్వేచ్ఛగా జీవిస్తున్నాయి. అయితే ఇతర జీవుల కంటే భిన్నంగా, సక్రమమైన పద్ధతిలో జీవించాలనే ధ్యేయంతో మనిషి కొన్ని నిబంధనలు ఏర్పరచుకున్నాడు. ఈ నిబంధనల వల్ల మానవ సమాజంలో తోటి మనుషులు ఇబ్బంది పడకుండా మనుగడ సాగిస్తున్నాడు. మానవుడు సంఘ జీవి, సమాజంతో సంబంధం లేకుండా మనుగడ సాగించడం దుస్సాధ్యం. స్వేచ్ఛగా జీవించడం, ఒకరి స్వేచ్ఛ మరొకరికి ఇబ్బందికరంగా మారకుండా ప్రవర్తించడానికి వివిధ దేశాలు ఆయా దేశాలకు అనుగుణమైన రాజ్యాంగాలు రూపొందించారు. అయితే కొన్ని దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతున్నది. ఉగ్రవాదం పేరుతో కొన్ని సంస్థలు, ప్రజల్లో తిరుగుబాటును అణచి వేయడానికి కొన్ని ప్రభుత్వాలు మానవ హక్కులను హరిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు మారాలి. మనిషి జీవించడానికి ఉన్న అన్ని హక్కులను పరిరక్షించాలి. ప్రతీ వ్యక్తికి జన్మతః కొన్ని హక్కులు సహజంగా ప్రాప్తిస్తాయి. వాటిని కాలరాసే హక్కు ఎవరికీ లేదు. ప్రతీ ఒక్కరికీ రంగు, జాతి, కుల, మత, దేశ, ప్రాంత, భాష, లింగభేదం లేకుండా స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, ఇతరులకు ఇబ్బంది లేకుండా జీవించే హక్కులున్నాయి. ఇవే మానవ హక్కులు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ విశ్వ మానవ హక్కుల తీర్మానాన్ని1948 డిసెంబర్ 10న ఆమోదించింది. ఈ తీర్మానం ఆమోదించిన డిసెంబర్ 10 వ తేదీని 'అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం'గా ఏటా జరుపుకుంటున్నాం.

# మనిషితనపు కలల జెండా.. రహీమొద్దీన్ కవిత్వం

**“ కవిత్వంలో ఆసక్తికరమైన ఎత్తుగడ, వినూత్నమైన ప్రతీకలు, పాఠకుడిని ఒక అవ్యక్తమైన భావనకు గురి చేసే ఆర్ద్రమైన ముగింపు ఉన్నప్పుడు ఆ కవిత్వం పాఠకుడిని ఆసాంతం చదివేలా చేస్తుంది. పాఠకుడు తనను తాను ఏ కవిత్వంలో దర్శించుకోగలుగుతాడో ఆ కవిత్వం పట్ల ఆకర్షితుడవుతాడు. వాస్తవ జీవితాలను ఆవిష్కరించిన కవిత్వం పది కాలాలపాటు నిలుస్తుంది. రహీమొద్దీన్ కవిత్వం చదివాక పాఠకుడు తప్పకుండా ఇటువంటి అనుభూతికే లోనవుతాడు.**
**ఇటీవల కలల రంగు కవిత్వంతో తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రతో అడుగుపెట్టారు రహీమొద్దీన్. ఇది వారి తొలి పుస్తకం. కానీ చదువరులకు మాత్రం ఈ విషయం చెప్తే గాని తెలియదు. ఒక చేయి తిరిగిన అనుభవజ్ఞుడైన కవి రాసిన కవితా పంక్తులుగా ఇందులోని కవితలు దర్శనమిస్తాయి. రహీమొద్దీన్ సాహిత్యం చదివిన వారు కాదు. కానీ జీవితాన్ని చదివిన వారు. మానవీయ విలువలు, వివక్ష పట్ల నిరసన, భవిష్యత్తు సమాజం పట్ల ఆలోచన వీరి కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది.**

రహీమొద్దీన్ కవిత్వంలో మనిషితనం ఉట్టిపడుతోంది. తన ఊర్లో ఇంటి పక్కన ఉండే రాములు బాబాయ్ మరణించినప్పుడు కవి ఆవేదన ఆయనలోని మానవీయ గుణాన్ని బహిర్గత పరుస్తుంది.
"పుట్టిన మట్టిని సారవంతం చేసే
వాన పాము లాంటి పుట్టుకలు కొన్నే ఉంటయ్
మా రాములు బాబాయి లెక్క...
దొండపాదు లెక్క
గుండె లోపలికి తీగలు బారిన ఆత్మీయతలాయే!
మనిషి పోయినంత సులభం కాదు మరిచిపోవడం..."
అంటూ రాములు బాబాయ్ గుణాన్ని అద్భుతంగా కవిత్వీకరించారు. కల్మషం లేని గ్రామీణుల మనస్తత్వాన్ని రాములు బాబాయ్ ద్వారా చిత్రీకరించాడు.
"కొంచెం పనుంది రమ్మని ఎవరు పిలిచినా కాదనకుండా వెళ్లేటోడు
మోసకారి మృత్యువు కూడా అట్లనే పిలుచుకుపోయినట్లుంది..." అనే ఆర్ద్రమైన అభివ్యక్తి పాఠకుల హృదయాన్ని ద్రవింప చేస్తుంది.
అనగనగా ఒక అమ్మ కథ కలల రంగు కవిత్వ సంపుటి లో ఎన్నదగిన కవిత. తల్లి గొప్పదనాన్ని చెబుతూనే తల్లి ఏ విధంగా వివక్షకు గురవుతున్నదో కూడా ఈ కవితలో చెప్పారు.
" ఎనుగంతా పారిన కంచ కాకర తీగకు
మొదలెక్కడో దొరకనట్టు
అంతం లేని అమ్మ దుఃఖపు తీగకు
ఆది ఎక్కడో దొరకదు." అంటూనే అమ్మ కళ్ళలో సుడిగుండాలను చూశానని, తాను రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడ్డా అమ్మ ఏనాడు బాధపడలేదని తన మనసులోని బాధలకు రికాము లేని పనినే ఔషధంగా పూసుకున్నదని తల్లి సహనశీలతను అభివర్ణిస్తారు. బిడ్డగా,కోడలిగా, భార్యగా అనేక బాధ్యతలు నిర్వహించిన అమ్మ అన్ని చోట్ల దుఃఖాన్నే అనుభవించిందని ఆవేదనతో చెప్పారు.
"మసీదు మీనారు మీద నుంచి
కనిపించే పండుగ నెలవంక కోసం అందరూ వెతుకుతుంటే
అమ్మ ముఖంలో మెరిసే నెలవంక కోసం
నేను వెతుకుతున్న..." అంటూ ఒక ఆశావహ దృక్పథంతో కవితను ముగిస్తారు. అమ్మ చేతి ఆసరా అనే మరో కవితలో చీపురు గురించి చెప్పినట్లు కనిపించినా అంతర్లీనంగా ఆ కవిత నిండా అమ్మ కష్టమే దాగి ఉంది.
సాధారణంగా మనిషి ఉన్నప్పుడు మనిషి విలువ తెలియదు. ఇంట్లో అన్నీ తానై నడిపించే అర్ధాంగి లేని ఓ సాయం కాలాన్ని కవి జీర్ణించుకోలేని స్థితిని అద్భుతంగా కవిత్వీకరించారు
"తోడు లేనప్పుడు అంకెల విలువే కాదు
ఆనందం విలువ కూడా తగ్గిపోతుందని
ఆమె లేని ఈ సాయంత్రం
జీవిత గణితంలోని తీసివేతల అధ్యాయం నాకు నేర్పింది... "అంటూ అర్ధాంగి లేని వెలితిని చక్కని కవిత్వంగా మలిచారు.
పెరుగుతున్న ప్రపంచీకరణ నగరీకరణ ఫలితంగా అంతరిస్తున్న పల్లెలు, ధ్వంసం అవుతున్న పర్యావరణం పట్ల ఆవేదన వీరి కవిత్వంలో కనిపిస్తున్నది.
పొలం నెత్తురు కవితలో
"పట్నం పులి పంజా విసురుతున్నది
నగరపు రోడు కొండచిలువలా చుటేసునంది




దరిదాపుల్లో ఉండటమే పంట పొలం చేసుకున్న పాపం
పచ్చని దేహం నిండా పచ్చి నెత్తురు తాగే కోరల గాట్లే"
అంటూ సాగే ఈ కవితలు నగరం పల్లెలను ఎట్లా మింగేస్తున్నదో, ఆశల గాలానికి చిక్కిన రైతు బతుకు ఎలా విలవిలలాడుతున్నదో, పొలాలు ధ్వంసమై ధనవంతుల చేతుల్లో చిక్కుకున్న వైనాన్ని చక్కగా కవిత్వీకరించారు.
ప్రపంచీకరణ కార్పొరేటీకరణ చాప కింద నీరులా పాకి మనలను బందీ చేస్తున్న వైనాన్ని తెలుపుతూ రాసిన వీరి కవిత్వం పాఠకులను ఆలోచింపజేస్తుంది
"వాడి ఉపాయం వలలో చిక్కిన
ఐక్యమత్యం మరచిన అమాయక పావురాలం కదా
మనం కన్ను తెరిచేలోపే
వాడు మన కలలన్నీ ఖరీదైన కవర్లో ప్యాక్ చేస్తడు
రేపటి మన ముద్దని కార్పొరేట్ గద్దలు ఎత్తుకుపోయినంక
ఈయాల రోడ్డు మీద మొలిచిన మేకులే రేపు మన కంచంలో మొలుస్తయ్ " అంటూ హెచ్చరిస్తున్నాడు.
పర్యావరణ స్పృహ వీరి కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తున్నది. చెట్లు పెంచాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ రాసిన ఆకుపచ్చని దీవెన కవితలో
"ఊయల నుండి ఊత కర్ర దాకా తోడై నడిపించి
విషయాన్ని పీల్చుకొని అమృత ఫలాలు దోసిళ్లతో పంచుతూ
ఆకుపచ్చగా దీవించింది.. "అని చెట్టు గొప్పదనాన్ని తెలియ చెప్పారు.
మనిషి ఆనంద విషాదాలకు మూలం మనసే. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఒక తాత్విక దృక్పథంతో చెప్పారు రహీమొద్దీన్.
"ఎవరి నుండి వారే దూరమవుతున్న ఈ పరుగులో
ఏ గమ్యానికి చేరుకుంటే మాత్రం ఏం మిగులుతుంది...
మనసుకు బిగించుకున్న గడియ తీసినప్పుడే సంభాషణ మొదలవుతుంది
మాటల తడితోనే బతుకు చిగురు తొడుగుతుంది..."
అంటూ ఎవరికి వారు ఏకాకిగా మారుతున్న ఈ తరుణంలో ఒకరినొకరు పలకరించుకోవలసిన అవసరం ఉందనితెలియజేశారు.
'కష్టజీవి' కి ఇరువైపుల నిలిచిన వాడే కవి అన్నారు శ్రీశ్రీ. శ్రమజీవుల పట్ల రహీమొద్దీన్ సరిగ్గా ఇట్లాంటి అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. తన ఇంటిని నిర్మించిన భవన నిర్మాణ కార్మికులను చూసి వారి బతుకు చిత్రాన్ని కవిత్వంగా అల్లారు.
"పొద్దున్నే తాపీ పట్టుకున్న సూర్యులై
తన కళ్ళలో సంతోషపు కిరణాలు మెరిపించే వాళ్ళు"
అని తాపీ మేస్త్రీలను కృతజ్ఞతా పూర్వకంగా అభినందిస్తారు. రైతుల పట్ల కూడా రహీమొద్దీన్ ప్రేమ ఇలాగే కనిపిస్తుంది.
" వాళ్లు వానలో తడిసి పచ్చని పొలమై చిగురిస్తరు
వాళ్లు బురదను బుజ్జగించి బువ్వ చేస్తరు
అరకబట్టి ఆదమసి నిద్రపోతున్న మట్టి పొరలని తట్టి లేపుతరు "వంటి కవిత్వ పాదాలు అన్నదాతల పట్ల వీరికి ఉన్న మమకారాన్ని తెలుపుతున్నాయి. రైతు అయిన తన తండ్రిని స్మరించుకునే కవితలోనూ రైతు పట్ల సహానుభూతి కనిపిస్తుంది.
"అన్నం పెట్టే రైతును
ఆడపిల్లను కన్న తండ్రిని
తలెత్తుకొని బతకనిచ్చే దేశమా ఇది? అంటూ ఆవేదన వ్యక్తం చేసారు. మునిసిపల్ కార్మికుల సేవ గొప్పదనాన్ని మనసారా కీర్తించారు.
రహీమొద్దీన్ కవిత్వంలో అస్తిత్వ స్పృహ ఉన్నది. సమాజంలో తనకు ఎదురవుతున్న వివక్షను ప్రశ్నించే గుణం ఉన్నది. నేను ఒంటరిని కాదు అనే కవితలో తాను ఈ దేశ మూలవాసినని ద్వితీయ పౌరులుగా ఎంచబడుతున్న మైనారిటీల పక్షాన నిలబడి మాట్లాడగలిగారు.
" నేనెప్పుడూ పుట్టిన మట్టిని సాటి మనిషినీ
సమానంగా ప్రేమించే వాణ్ణే
మతాన్ని మసీదు గుమ్మం దగ్గరే వదిలి
సోదర భావాన్నే తలపై పెట్టుకున్నాను" అని స్పష్టం చేశారు. తానెప్పుడూ ఒంటరిని కాదని, కుర్చీ కోసం తనను ఒంటరిగా చేసే కుట్రలను భగ్నం చేస్తానని గాయపడుతున్న సోదరులంతా తన వెంటే ఉంటారని చెప్పడం వీరి అస్తిత్వ దృక్పథానికి సామాజిక స్పృహకు నిదర్శనం. కొత్త మచ్చ అనే మరో కవితలో కూడా ఇట్లాంటి స్పృహ కనిపిస్తున్నది. కరోనాకాలంలో కరోనా వ్యాపిస్తున్న తొలిదశలో ఈ దేశంలోకి ముస్లింలే ఆ వ్యాధిని తీసుకువచ్చినట్లుగా సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారాలు విచ్చలవిడిగా సాగాయి. బహుశా ఈ నేపథ్యంలోనే కవి ఈ కవితలో స్పందించి ఉండవచ్చు
"పుట్టుకతో ఉన్న మచ్చలనే ఉతికి ఆరేసుకుంటూ
నా వతన్ మీద నాకున్న ప్యార్ ను నిరూపించుకోలేక
నా తిప్పలేదో నేను పడతాంటే
అటు పోయి ఇటు పోయి కొత్త మచ్చ లెక్క
నన్ను అంటుకున్నవేందే కరోనా? "అంటూ ప్రశ్నిస్తాడు. కలల రంగు సంపుటిలో ఉన్న మరో కవిత వెలుగు రాగాల పాట ప్రజా చైతన్యమే లక్ష్యంగా ఆవిర్భవించింది.
"నక్షత్రం కాలేకపోయినా
మినుగురులై నలుగురు కదిలితే చాలదూ
వెలుతురు నెత్తురులో ఉరకలెత్తడానికి
ఐదు వేళ్ళు కలిస్తే ఆయుధమవుతుందని మరిచారా
శక్తులను వ్యక్తులుగా విడదీస్తున్న కుట్రలను గమనించలేదా..." అని నిలదీస్తూ ప్రశ్నిస్తూ పాదాలకు కవాతులు పరిచయం చేయమంటాడు. శ్వాసకు జ్వలించడం నేర్పమంటాడు. కన్నీటి నిప్పు అనే మరొక కవితలోనూ పేదరికం తీవ్రమైనప్పుడు విప్లవం తప్పదని స్పష్టం చేస్తారు.
'మరిగే గుండెలో మంట పుడితే
కన్నీళ్లలో నిప్పు రాజుకొని
కార్చిచ్చు వ్యాపించక తప్పదు' అని హెచ్చరిస్తారు.
ప్రజలను చైతన్య పరచడమే నిజమైన కవి కర్తవ్యం. రహీమొద్దీన్ ఈ కర్తవ్య సాధనలో కృతకృత్యువయ్యారు.
రహీమొద్దీన్ స్త్రీల పట్ల సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుభూతి కలిగిన వారు. స్త్రీ పురుష సమానత్వాన్ని కాంక్షించే కవిత్వం వీరి కవిత్వ సంపుటిలో కనిపిస్తున్నది. దీన్ని స్త్రీవాద సంఘీభావ కవిత్వం అనవచ్చునేమో..
మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీలను సన్మానించడం ఒక ప్రహసనంగా మారుతున్న వైనాన్ని కవి వ్యంగ్యంగా ఈ విధంగా చెప్పారు
'మైకులు తేనె జల్లులు కురిపిస్తున్నా
మనసులను విషపూరితం చేసిన సంస్కృతి వాసన ఏదో
అక్కడ వీస్తున్న గాలికి తెలుసు ఆమెకూ తెలుసు అయినా
సభ అత్యంత సహజమైన నటనతో రక్తి కడుతున్నది...' మొక్కుబడిగా సాగుతున్న మార్చి 8 సభలను గురించి తన కవితలో తెలియజేశారు. ఇటువంటి మరో గొప్ప కవిత హింసాగృహం.
"ఇల్లు అతనిదే ఇంటి పేరు అతనిదే
కనిపించని అనేక గాయాల సాక్షిగా
నా దేహం మీది హక్కులన్నీ అతనివే..." పురుషాహంకార సమాజంలో ఎదుర్కొంటున్న అవస్థలను ఆవేదనభరితంగా తెలియజేశారు. ఈ కవిత చివరలో ఇట్లాంటి బాధితుల అడుగులన్నీ ఒక్కటై కవాతు చేస్తే హింసాగృహాలన్నీ ధ్వంసం అవుతాయనే ఆకాంక్షను వ్యక్తపరిచారు. బజ్జీల బహెన్ కవితలో కూడా స్త్రీ సాధికారతను కాంక్షిస్తాడు. మగదిక్కు కోల్పోయి బతుకును నాలుగు చక్రాల మీద నెట్టుకుంటూ వస్తున్న ఆమె ఆత్మవిశ్వాసాన్ని కీర్తిస్తాడు.
ఇట్లా చెప్పుకుంటూ వెళ్తే రహీముద్దీన్ కవిత్వమంతా ఉటంకించదగినదే. ఇటీవల కాలంలో తెలుగులో సీరియస్ కవిత్వం రాస్తున్న యువతరం పెరుగుతుండడం హర్షణీయపరిణామం. తగుళ్ల గోపాల్, తుల శ్రీనివాస్, మెట్టా నాగేశ్వరరావు, చిగురాళ్లపల్లి ప్రసాద్, పల్లిపట్టు నాగరాజు, తండా హరీష్ వంటి కవుల కోవలోనివారే రహీమొద్దీన్. భవిష్యత్తు తెలుగు కవిత్వానికి భరోసా సంతకంగా నిలుస్తున్న రహీమొద్దీన్ కవిత్వానికి జేజేలు పలుకుతున్నాను.

**- డాక్టర్ సాగర్ల సత్తయ్య**
**7989117415**

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించండి

## అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ఇన్ ఛార్జ్ కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీర బ్రహ్మచారి, జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలలో వారికి కేటాయించిన పనులు షెడ్యూలు ప్రకారం ధాన్యం కొనుగోలు, వసతి గృహాలు తనిఖీ, తదితర అభివృద్ధి పనులపై నిత్యం తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా పలు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. గార్ల మండలం, కోట్యా నాయక్ తండాకు చెందిన బి.హేమలత.. తనకు కంటిచూపు సమస్య ఉందని, ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. తొర్రూరు మండలం గుర్తుర్ కు చెందిన బోర్ర జ్యోతి, తన భర్త చనిపోయాడని తనకు ఒంటరి మహిళ పెన్షన్, ఏదైనా ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. మహబూబాబాద్ మండలం, హనుమంతరావు నగర్ కు చెందిన కే.ఏలీషా, తనకు స్కాలర్ షిప్ ఇప్పించాలని దరఖాస్తు చేశారు. మహబూబాబాద్ 30వ వార్డుకు చెందిన కొమురు నారాయణ, మిషన్ భగీరథ నల్ల కలెక్షన్ ఇప్పించుటకు దరఖాస్తు చేశారు. గూడూరు మండలం అయోధ్య పురం గ్రామానికి చెందిన ఏ దేవేందర్, మల్లేష్, భీష్మాచారి, వెంకన్న, తమకు డబుల్ బెడ్ రూమ్ నిర్మించుకున్న సంబంధించి డబ్బులు నేరుగా ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. మహబూబాద్ పట్టణానికి చెందిన కొమిర బండ్లీన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయుటకు దరఖాస్తు చేసుకున్నారు. చిన్న గూడూరుకు చెందిన గంగాధర దేవేందర్, తనకు ప్రధానమంత్రి విశ్వకర్మ రుణం మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. కంబాలపల్లి కి చెందిన తాటి వెంకటరెడ్డి తన పేరు మీద క్రాప్ లోన్ రుణమాఫీ వర్తింపజేయాలని దరఖాస్తు చేశారు. నెల్లికుదురు మండలం కచికల్ కు చెందిన ముత్యాల స్వరూప తనకు ఉచిత కరెంటు జీరో బిల్లు పథకాన్ని వర్తింపచేయాలని దరఖాస్తు చేసుకున్నారు. గార్ల మండలం బుద్ధారం కు చెందిన బానోత్ రాజు.. తాను వికలాంగుడనని తనకు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఇలా అన్ని విభాగాలకు కలిపి మొత్తం దరఖాస్తులు 136 వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.నరసింహస్వామి, జడ్పీసీఈఓ పురుషోత్తం, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ హరిప్రసాద్, ఆర్ అండ్ బీ ఈ ఈ భీమ్లా నాయక్, డీ ఏ ఓ విజయనిర్మల, డీవీహెచ్ఓ డాక్టర్ బి.కిరణ్ కుమార్, మెప్మా పీడీ బి.విజయ, సీపీఓ సుబ్బారావు, డీహెచ్ఓ జినుగు మరియన్న, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## చేనేత పద్మ సమైక్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా రమేష్



**విశ్వంభర, రామన్నపేట:** చేనేత పద్మ సమైక్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షునిగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా రాపోలు రమేష్ ను నియమిస్తూ చేనేతపద్మ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు కొండ రామ్మోహన్ నేత, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరందాసు వేణుగోపాల్ లు ఆదివారం రోజున ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా నియామకమైన రాపోలు రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కొండ రామ్మోహన్ నేతకు, తిరందాసు వేణుగోపాల్ నేత, తిరందాసు విష్ణు లకు, రాష్ట్ర కమిటీకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతూ చేనేత సమస్యల మీద తన వంతుగా కృషి చేసి చేనేతపద్మ సమైక్య పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు బయాలజీ పరీక్ష



**విశ్వంభర, రామన్నపేట:** టీబీఎస్ఎఫ్ తెలంగాణ బయోలాజికల్ ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు బయాలజీ పరీక్ష యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల (జీహెచ్ఎస్)లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కే.శ్రీనివాసరెడ్డి, మునిపంపుల కాంప్లెక్స్ హెచ్ఎం డి.స్వామి, మండల బయాలజీ ఫోరం అధ్యక్షులు బాసరాజు యాదగిరి, నీలం శేఖర్, మంజుల, జరీనా, క్రాంతి కుమార్, శివ పార్వతి, శేఖర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో అయ్యప్ప స్వాములు మహా పడిపూజ మధు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమనగల్ మార్కెట్ ఛైర్మన్ యాట గీతా నరసింహ, ముదిరాజ్ పీసీసీ సభ్యులు ఆయిల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చ నాయక్, సింగల్ డైరెక్టర్ చేగురి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ ఉమాపతి, కరుణాకర్, హిరాసింగ్, తులసీరామ్, షాబుద్దీన్, బాలరాజ్, యాదయ్య, వీరయ్య, మధు, భక్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు ప్రత్యేక గిరి ప్రదక్షిణ

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి మహిమాన్విత గిరి ప్రదక్షిణ సందర్భంగా డిసెంబర్ 11, 2024 బుధవారం ఉదయం 6:00 గంటలకు అయ్యప్ప మాలధారుల కోసం ప్రత్యేకంగా గిరి ప్రదక్షిణ, తదనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ప్రత్యేక దర్శనం, ప్రసాద పంపిణీ అవకాశం కల్పిస్తున్నామని దేవస్థానం వారు ఒక ప్రకటనలో తెలిపారు. కావున అయ్యప్ప మాలధారులు అందరూ ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని శ్రీ స్వామి వార్ల కృపకు పాత్రులు కావాలని యాదాద్రి దేవస్థానం వారు కోరుతున్నారు.

# అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పది

ఆమనగల్లు లైన్స్ క్లబ్



**విశ్వంభర, కడ్తాల్:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ డాక్టర్ వీరెడ్డి దామోదర్ రెడ్డి కుమార్తె ప్రార్థన రెడ్డి జన్మదిన సందర్భంగా కడ్తాల్ బస్టాండ్ లో మాజీ జిల్లా గవర్నర్, మల్టిపుల్ జిల్లా ఎల్ సీ ఐ ఎఫ్ కోఆర్డినేటర్ పర్యవేక్షణలో ఉచిత అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం మీల్స్ ఆన్ వీల్స్ వెహికల్ ద్వారా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మొదటి వైస్ గవర్నర్ లయన్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాలలో శ్రేష్టమైన దానం అన్నదానం అని, ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆమనగల్ రెగ్యులర్గా చేయడం చాలా సంతోషమని మల్టిపుల్ జిల్లా ద్వారా సమకూరిన మీల్స్ ఆన్ వీల్స్ వెహికల్ ఈ అన్నదాన కార్యక్రమాల ద్వారా సద్వినియోగం అవుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సభ్యులు తాళ్ల అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ లయన్ గంప వెంకటేష్ గుప్తా, పీసీసీ సభ్యులు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య, జూలూరు రమేష్, క్లబ్ సెక్రటరీ మహేష్, పీ ఆర్ ఓ ఎం డీ పాషా, బిచ్యా నాయక్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

# పట్టాలు పంపిణీ చేశారు.. స్థలాలను చూపలేదు!



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో 6, 7 సర్వే నెంబర్ గల భూమిలో 1998, 1999, 2000ల సంవత్సరాల్లో అర్హులైన గ్రామ ప్రజలకు పాట్ల పట్టాలు అందించారు. అయితే 2021 వరకు వాటిని చూపకుండ జాప్యం చేయడంతో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేసి, కలెక్టర్ కు, ఆర్డీవో కు వినతి పత్రాలు ఇచ్చారు. ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి చేసి ప్రభుత్వ పై ఒత్తిడి తీసుకొచ్చారు. 2023లో పాత పట్టాలు ఉన్న వారికీ నూతన పట్టలు ఇవ్వడం జరిగింది. ఒక సంవత్సరం గడిచి ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా కూడా పట్టుదారులకు ప్లాట్లకు సంబందించిన స్థలం చూపలేదు. 15 రోజులలో సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి పట్టాదారులకు న్యాయం చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు, రాస్తోరోకలు, ప్రభుత్వం కార్యాలయాల ముట్టడి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు తిరుమని రవి గౌడ్, జిల్లా నాయకులు శానామాని పాండు, బక్కి కుమార్ నీలకంఠ పాండు, పద్మ అనిల్ ముదిరాజ్, శాంతకుమారి యాదయ్య హరికాంత్,దుగ్గపురం కుమారు, పోతుగంటి మహేష్, పద్మ వెంకటేష్, కటికల శ్రీశైలం, నాయిని కుమార్ గౌడ్, తుమ్మ శ్రీను,బొల్లా శ్రీను,నూకం మహేష్ పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి

పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**విశ్వంభర, నందిగామ:** నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన యువకుడు దయ్యాలా శివ (అథ్లెటిక్)కు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వచ్చే నెలలో తమిళనాడు లో జరగబోయే ఒక ప్రైవేట్ టోర్నమెంట్ కు వెళ్లేందుకు ఈ ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులని ప్రోత్సహించాలన్నారు. క్రీడలతో శారీరకంగా, మానసికంగా చాలా దృడంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్ అప్ప, మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, పాండు రంగా రెడ్డి, ఏలికట్ట వంశీ, పెబ్బే రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్‌ని కలిసిన శివ కుమార్



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివ కుమార్ ఢిల్లీలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఒకటే దేశం ఒకటే ఎన్నికల పై చర్చించారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు జరగడం వలన కలిగే లాభాలపై తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక యువకుడిగా మాట్లాడటం జరిగింది. అందుకు బండి సంజయ్ ఒకటే దేశం – ఒకటే ఎన్నికల పై అంగీకారం తెలిపారు. శివ కుమార్ మాట్లాడుతూ.. దేశం మొత్తంలో వివిధ రాష్ట్రాల నుంచి సేవ రంగంలో కృషి చేస్తున్న యువత అంత కలిసి "సంవిధాన్ సపోర్ట్ " అనే బృందంగా కలిసి దేశం మొత్తంలో ఉన్న పార్లమెంట్ సభ్యులను పార్టీలకు అతీతంగా కలిసి ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంవిధాన సపోర్ట్ సభ్యుడు మౌళి కిషోర్ తదితరులు ఉన్నారు.

# బిల్స్ లేనందున షాపులను సీజ్ చేశాం

## జిల్లా ఇన్చార్జ్ అధికారి విజయకుమార్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో పలు దుకాణాలలో తూకం తేడాలు, నాసిరకం వస్తువులు, ఎలక్ట్రికల్ వస్తువుల షాపులపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు నాసిరకంగా దానికి సంబంధించిన బిల్స్ లేనందువలన కొన్ని షాపులను, వస్తువులను సీజ్ చేసినట్లు జిల్లా ఇన్చార్జ్ అధికారి విజయకుమార్ తెలిపారు. అయితే ఇన్చార్జీ తూనికల కొలతల అధికారి ఉండడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు అన్నారు. ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ తూనికల కొలతల అధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడి మృతి



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన తాంద్ర వీరేందర్ రెడ్డి నియోజకవర్గంలోనే ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు. షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆయన న్యాయ రంగంలో అనేక సేవలు అందించారు. రాజకీయాల్లో తనదైన ముద్రను వేసుకున్నారు. తెలుగుదేశం,బీఆర్ఎస్ పార్టీల్లో ఎనలేని సేవలను అందించారు. కేశంపేట మండలం కాంగ్రెస్ మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకురాలు తాంద్ర విశాల వీరేందర్ రెడ్డి కోడలు. వీరేందర్ రెడ్డి కుమారుడు తాంద్ర శ్రావణ్ రెడ్డి కాంగ్రెస్ రాజకీయాల్లో ముఖ్యులుగా ఉన్నారు. 1980 దశకంలో షాద్ నగర్ రాజకీయాల్లో చురుకైన నాయకుడిగా వీరేందర్ రెడ్డికి పేరు ఉంది. అంతేకాదు ఈ ప్రాంతంలో స్పాంజ్ ఐరన్ పరిశ్రమలపై రాజీలేని పోరాటాన్ని నిర్వహించి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపును పొందారు. స్పాంజ్ ఐరన్ పరిశ్రమలపై చేసిన న్యాయపోరాటం ఎట్టకేలకు ఇటీవలే ఫలించింది. ఇక న్యాయవాద వృత్తిలో వకీల్ సాబ్ గా పేరు గడించిన వీరేందర్ రెడ్డి గురించి అందరికీ తెలిసిందే. వీరేందర్ రెడ్డి మృతితో నియోజకవర్గంలో విషాదం అలుముకుంది.

## అమరవీరుల స్థూపం శుద్ధి



**విశ్వంభర, ఖైరతాబాద్:** బీఆర్ఎస్ నాయకుల తీరు పట్ల గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ తదితరుల ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు, రోహిన్ రెడ్డి లు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కి, కేటీఆర్ కు మహిళల పట్ల తీవ్ర నిర్లక్ష వైఖరి ఉందని అన్నారు. మొదటి నుంచి మహిళలను కేటీఆర్ అవమాన పరిచే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో మహిళల పట్ల కేటీఆర్ అవమాన కరంగా వ్యవహరించారని అదే ధోరణి కొనసాగిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లిని కూడా అవమాన పరిచే విధంగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ తల్లికి బీఆర్ఎస్ అడుగడుగునా అవమానాలు చేస్తున్నారని, ఇది కొనసాగింపుగా ఈ రోజు కూడా అలాగే తెలంగాణ తల్లిని అవమాన పరిచారని అన్నారు.

## కరాటే పోటీల్లో విద్యార్థులకు గోల్డ్ మెడల్స్




**విశ్వంభర, ఆమనగల్లు:** అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఆమనగల్లుకి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరించారు. హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మొదటి ఇంటర్నేషనల్ మార్షియల్ ఆర్ట్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ లో సోను కరాటే అకాడమీ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు సోను కరాటే అకాడమీ మాస్టర్ సోను తెలిపారు. ఈ పోటీల్లో ప్రణవి, దీక్షిత, శ్రవంతి, పింకీ, అరుణ, అస్మిక, హిందు, పల్లవి, గాయత్రి, నిహారిక, జస్విక బంగారు పతాకాలు సాధించారు. వైశాలి, అశ్విని సిల్వర్ పతకాలు సాధించినట్లు మాస్టర్ సోను తెలిపారు. ఈ పోటీల్లో సోను అకాడమి నుంచి 14 మంది విద్యార్థులు పాల్గొంటే 11 మంది బంగారు పతకాలు, 3 మందికి సిల్వర్ పతకాలు సాధించడంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

## వివాహానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నోముల లింగయ్య కూతురు నోముల అనుష వివాహానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య 50వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని పీసీసీ ప్రధాన కార్యదర్శి తరపున పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ అందజేశారు.

## చల్ల సముద్ర పాఠశాలకు వాలీబాల్ కిట్టు అందజేత



**విశ్వంభర, ముకుందాపురం:** 2000 2001 ముకుందాపురం చల్ల సముద్రం హైస్కూల్లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అందరూ కలిసి పాఠశాలకు వాలీబాల్ కిట్టు అందజేశారు. ఈ మేరకు హెడ్మాస్టర్ కల్పనకు అందజేశారు. ఆదివారం పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 23 ఏళ్ల తర్వాత కలవడం సంతోషకరంగా ఉందని భావించారు. అప్పటి ఉపాధ్యాయులైన దొడ్డ కృష్ణారావు, ప్రసాద్ రావు, సత్యనారాయణ, మునప, పొట్టయ్య, నూర్జహాన్ బేగం, సునంద లను సైతం పిలిపించి వారితో గడిపి వారి ఆనందాలను పంచుకున్నారు. అనంతరం వారందరినీ ఘనంగా శాలువా కప్పి, మెమంటోలతో సత్కరించి సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్ జనార్ధన్, బి బాలాజీ, ఆర్ వి చారి, తోకల రమేష్, ప్రసాద్, సురేష్, రమేష్, పార్వతీ శైలజ రజిత రజిని అనసూయ సుజాత సునీత పూర్ణిమ వీరభద్రం నరేష్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# ఆస్తులను కాపాడుకునేందుకే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి**



**విశ్వంభర, ఎల్బీనగర్:** బినామీ పేర్ల మీద ఉన్న కోట్లాది రూపాయల ఆస్తులను కాపాడుకోవడం కోసమే బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ రాజకీయ రంగు పులుముతున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మహేశ్వరం బీజేపీ కన్వీనర్ ధీరజ్ రెడ్డిలు ఆరోపించారు. సోమవారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు కాంట్రాక్ట్ పనులకు సంబంధించి మాతో నేరుగా ఎటువంటి సంబంధం లేని హనుమయ్య అనే వ్యక్తి రెండు రోజుల క్రితం తన అనుచరులతో వచ్చి తన కార్యాలయంలోనే తనపైకి దాడికి పాల్పడ్డాడని తెలిపారు. అనేకసార్లు హనుమయ్య ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అనేకమంది పెద్దపెద్ద కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్న హనుమయ్య బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ కు బినామీ అని తెలిపారు. మర్రిగూడ మండలం కురబక్షిపల్లి గ్రామంలో సుమారు 750 ఎకరాల స్థలం, యాదాద్రి జిల్లా రాజపేట మండలంలో సుమారు 90 ఎకరాల స్థలం హనుమయ్య అతని కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్నాయని తెలిపారు. ఆయా భూములు కూడా దళితులను, గిరిజనులను భయభ్రాంతులకు మోసానికి గురిచేసి లాక్కున్నారని ఆరోపించారు. హనుమయ్య భూములు లాక్కోవడంతో కొందరు ఆత్మహత్యకు కూడా చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ బినామీ కావడం వల్లే హనుమయ్య అతని కుటుంబ సభ్యుల పేరు మీద వందలాది ఎకరాల స్థలాలు ఉన్నాయని ఆరోపించారు. వ్యాపార లావాదేవీలకు సంబంధించిన విషయంలో ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఆగ మేఘాలమీద రావడం తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడమే కాకుండా బీజేపీ పేరును వాడుకుంటూ పార్టీని బదనాం చేసే విధంగా ఆరోపణలు చేస్తూ తన బినామీలను కాపాడుకోవడం కోసం తాపత్రయ పడుతున్నారని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారిగా పనిచేసిన ప్రవీణ్ కుమార్ నిజా నిజాలు తెలుసుకోకుండానే కేవలం బినామీల పేరిట ఉన్న ఆస్తులను కాపాడుకోవడం కోసం మాత్రమే ప్రయత్నిస్తున్నారని, తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తుందని మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్ అధ్యక్షతన సోమవారం టెలిఫోన్ కాలనీలో సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే పలు కంపెనీలను రప్పించి మహేశ్వరం నియోజకవర్గంలో వేలాది మందికి ఉపాధి కల్పించడానికి ఇండస్ట్రీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బొక్క జంగారెడ్డి, తీగల అనితరెడ్డి, చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న నిర్మలాగణేష్, రఘుపతి, బండి మధు, లక్ష్మి, గట్ల రవీంద్ర, జెల్లా జగన్నాథం, సురేందర్, వంగూరి యాదవరెడ్డి, ఎన్ఎస్ యుఐ శివ, పగిళ్ల భూపాల్ రెడ్డి, మారం సుజాత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో అన్నదాతలపై ఉక్కుపాదం సరికాదు

పాయం చిన్న చంద్రన్న, ప్రగతిశీల రాష్ట్ర కార్యదర్శి



**విశ్వంభర, మహబూబాబాద్:** దేశ రాజధాని న్యూఢిల్లీలో హర్యానా, పంజాబ్,ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల రైతాంగం గిట్టుబాటు ధర చట్టం కావాలని శాంతియుత పాదయాత్ర చేస్తుంటే మోడీ సర్కారు వారిపై ఆంక్షలు విధించి ఉక్కు పాదం మోపటం సరికాదని ప్రగతిశీల రాష్ట్ర కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం 11 నెలల రైతాంగ పోరాటం తర్వాత దేశ ప్రధానిమోడీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించిన విషయాన్ని గుర్తు చేయడానికి వస్తున్న రైతులపై యుద్ధాన్ని ప్రకటించటం సిగ్గుచేటన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతు తమ కష్టాలను బాధలను ప్రపంచానికి తెలియజేయటానికి ఢిల్లీకి పాదయాత్రగా వస్తుంటే లాటి చార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ రైతుల రక్తాన్ని కళ్ల చూస్తున్న మోడీ సర్కార్ తన విధానాలను మార్చుకోవాలన్నారు. రైతు పండించిన గిట్టుబాటు ధర చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాలలో చర్చించి ఆమోదించాలన్నారు. అన్నదాతలపై మోడీ సర్కార్ చూపుతున్న ఈ అప్రజాస్వామిక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతాంగాన్ని, ప్రజలను చంద్రన్న కోరారు.

## తీర్పు ఆలస్యమైన ధర్మమే గెలిచింది

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**విశ్వంభర, మేడిపల్లి:** వేములవాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబుది దొంగ పౌరాసత్వం అని రుజువు అయిన సందర్భంగా మేడిపల్లి మండల కేంద్రంలో బాణాసంచాలు కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. మేడిపల్లి, భీమారం ఉమ్మడి మండలాల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తి ప్రజా నాయకుడు అయిన ఆది శ్రీనివాస్ 10 ఏళ్ల నుండి చిన్నమనేని రమేష్ రావు దొంగ పౌరసత్వంతో వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందాడని కాంగ్రెస్ పార్టీ నుండి ఆది శ్రీనివాస్ చిన్నమనేని రమేష్ రావు పౌరసత్వం పై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 10 సంవత్సరాల తర్వాత చెన్నమనేని రమేష్ రావు ది జర్మనీ పౌరసత్వం అని న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. తీర్పు ఆలస్యం అయినా ధర్మం గెలిచిందని అన్నారు. న్యాయస్థానంలో విజయం సాధించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మదన్ వినోద్, ప్రధాన కార్యదర్శి చెవూరి నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జలంధర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లాజర్ బాయ్, సాయిని గంగారెడ్డి, ఉమ్మిడి రవి రాజారెడ్డి, నరసయ్య, దాసరి, శంకర్, శ్రీపతి, దామోదర్, స్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యుఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభల లోగో ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్దబోయిన వీరబాబు




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రంలోని యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్దబోయిన వీరబాబు మాట్లాడుతూ యు ఎస్ ఎఫ్ ఐ జాతీయ మహాసభలు డిసెంబర్ 14, 15 తేదీల్లో విజయవాడ లో నిర్వహించబోతున్నామని అన్నారు. యు ఎస్ ఎఫ్ ఐ నాయకులతో ఆయన కలిసి ఆలిండియా మహాసభల లోగోను ఆయన కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. భవిష్యత్తులో ఈ మహాసభల ఉద్దేశం విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించడం కోసం సుదీర్ఘంగా చర్చించబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు సైదులు, సందీప్, రవి, క్రాంతి, వెంకన్న, సుధీర్, ప్రదీప్, అన్వేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## న్యూయార్క్‌లో ఇంపాక్ట్ సదస్సుకు తెలంగాణ యువకులు



**విశ్వంభర, ఆమనగల్లు:** యునైటెడ్ స్టేట్స్ లోని న్యూయార్క్ నగరంలో జరుగుతున్న 1ఎం1 బీ – ఎనిమిదవ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ లో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించడానికి రాష్ట్రం నుండి ఎంపికైన ఐదుగురు యువ ఆవిష్కర్తల బృందంతో సోమవారం టాస్క్– సి.ఓ.ఓ, కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కలిసి వెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్కిన్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నీ దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి విరాళం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన మండల బీఆర్ఎస్ నాయకురాలు బొజ్జ కోటమ్మ భర్త శ్రవణ్ తొమ్మిది రోజుల క్రితం అకాల మరణం చెందారు. వారికి నివాళి అర్పించి, వారి కుటుంబానికి తమవంతుగా మండల నాయకులు ఒక లక్ష ఏడు వేల ఐదు వందల రూపాయలను సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క మాధవ రెడ్డి, ఇతర మండల నాయకులు పాల్గొన్నారు. విరాళం అందించిన అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ సర్పంచ్‌ల అరెస్ట్



**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి, కోరుట్ల పోలీసు స్టేషన్లలో మండలానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ మరియు సర్పంచుల అరెస్ట్ తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచ్ ల ఫోరం పిలుపుమేరకు, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ సర్పంచులు పెండింగులో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని సోమవారం తెలంగాణ సమావేశాలను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు సిద్ధమైన నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ లను సర్పంచులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మారు సాయి రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కొరకు పాటుపడిన సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'నేతాజీ సర్వీస్ టీం' ఆర్థిక సహాయం అందజేత



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లా ఫాతిమా నగర్ దర్గకు చెందిన కునుమల్ల రంజిత్ కుమార్ మమత దంపతులకు, అమృత పిల్లల హాస్పిటల్ లో పది రోజుల క్రితం పాప లంగ్స్ సమస్య తోనే జన్మించినదని, లంగ్స్ చికిత్స కోసం 4 లక్షల రూ ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. భార్య భర్తలు కూలి పని చేసుకుంటేనే కుటుంబ పోషణ జరుగుతుంది. ఇలాంటి సమయంలో పాప కి 4 లక్షల పెట్టి వైద్యం చేయిచలేని పరిస్థితి లో ఉన్నారని తెలుసుకున్న నేతాజి సర్వీస్ టీమ్ అధ్యక్షులు మొగసాని శంకర్, ఎంఆర్పీఎస్ అక్కంపెట్ మండల అధ్యక్షులు ముత్యాల శ్యామ్ కిరణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆల్వేస్ హెల్ప్ ఫర్ ఆదర్స్ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో, శ్యామ్ కిరణ్, బిచ్చుల బన్నీ, రంజిత్ ఇంటికి వెళ్లి పాప పరిస్థితి ని తెలుసుకొని 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆల్వేస్ హెల్ప్ ఫర్ ఆదర్స్ ఫౌండేషన్ సభ్యులు శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ మా అన్న నేతాజి సర్వీస్ టీమ్ శంకర్ మా పాప పరిస్థితి ని వివరిస్తూ దాతలు సహృదయంతో సహాయాన్ని అందించాలని కోరారు. సమస్య ఎక్కడున్నా ప్రాంతం భేదం తేడా లేకుండా ఆపదలో ఉన్న వారికి మా ఆల్వేస్ హెల్ప్ ఫర్ అదర్స్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా మా వంతుగా సహాయాన్ని అందించడంలో ముందుంటామని, పాప వైద్యానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.

# ప్రజల ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అన్నిశాఖల జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంపై దృష్టి సారించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన 25 దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం చాలా ముఖ్యమని, ప్రతి శాఖలో ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, సమస్యల పరిష్కారానికి సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం తర్వాత దరఖాస్తుదారునికి సమాచారం అందించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తులు పరిష్కరించిన వెంటనే ప్రజావాణి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ మంగిలాల్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బెదిరింపులకు గురి చేయొద్దు

**జిల్లా ప్రవేట్ టీచర్స్ అధ్యక్షుడు**



**విశ్వంభర, మహబూబాబాద్:** మానుకోట జిల్లా కేంద్రంగా 2024–25 సంవత్సరం ప్రైవేట్ ఉపాధ్యాయుల యూనియన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ప్రవేట్ టీచర్స్ అధ్యక్షులు గండు మురళీ తెలిపారు. మానుకోట పట్టణంలో ఉన్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వారి వారి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను టార్గెట్ చేస్తున్నారు. మీకు యూనియన్ ఎందుకు, మీరు యూనియన్ లో ఉంటే మీ జాబ్ తీసి వేస్తాం అని బెదిరిస్తున్నారు. మరి మీ ప్రైవేట్ యాజమాన్యాలకు యూనియన్ ఉన్నప్పుడు మా ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఎందుకు ఉండకూడదని ప్రశ్నిస్తున్నామని గండు మురళీ అన్నారు. వృత్తి మీద ఉన్న గౌరవంతో మాకోసం విద్యార్థుల కొరకు పాఠశాలల్లో పని చేస్తున్నాము. మా కంటూ కష్టం వచ్చినప్పుడు మా కంటు ఒక ధైర్యం ఉండాలి, మాకు కష్టం వస్థే యూనియన్ లో ఉన్న టీచర్స్ ఒకరికి ఒకరు ఆదుకుంటారనే ఉద్దేశ్యం తో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. అంతే గానీ ప్రైవేట్ యాజమాన్యాలకు వేతిరేకంగా ఉద్యమాలు చేయడం కోసం కాదని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రైవేట్ ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తే మీ పాఠశాలల పరిస్థితి ఏంటో ఒక్కసారి ఆలోచించండి. మొన్నటికి మొన్న మానుకోట జిల్లాలో పని చేస్తున్న ఒక టీచర్ గుండె పోటుతో తో చనిపోతే యూనియన్ లో ఉన్న అందరూ టీచర్స్ చందాలు వేసుకుని రూ. 50,000 వేల రూపాయలు ఆ కుటుంబానికి అందించడం జరిగింది. ఆ కుటుంబానికి యూనియన్ అండగా నిలిచిందని మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గండు మురళి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## రోడ్లు తవ్వి వదిలేశారు



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు పట్టణం లోగల అంబేద్కర్ కాలనీలో మంజీరా పైప్ లైన్ లలో మురికి నీరు వస్తుందని వాటర్ బోర్డ్ వర్కర్లు కొత్తగా వేసిన సీసీ రోడ్డును త్రవ్వారని సెంట్రల్ టెలికం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ అన్నారు. మంజీరా నీటిలో డ్రైనేజీ నీళ్లు కలుస్తున్నాయని ఆ సమస్యను పరిష్కరిస్తామని గత నెల 27 నవంబర్ రోజున త్రవ్వి 15 రోజులు గడుస్తున్న పనులు ఇంత వరకు పూర్తి కాలేదు అన్నారు. పనులు నత్త నడకన నడవడంతో కాలనీవాసులకు వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. సీసీ రోడ్డు పగలగొట్టినప్పటినుండి నేటి వరకు కనీసం గుంత తీసి సమస్యను చూడడానికి కూడా ఏ అధికారులు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా దయచేసి సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలనీ, మరమ్మతులు పూర్తి కాగానే వెంటనే సీసీ రోడ్లకు మరమ్మత్తుచేయాలని, కాలనీవాసులతో కలసి బీజేపీ సెంట్రల్ టెలికం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ డిమాండ్ చేశారు.

# నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**విశ్వంభర, పటాన్ చేరు:** ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చేరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీకి చెందిన గంగాధర్ రెడ్డి కుమారుడు సాయి కిరణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాలుడు చికిత్స కోసం మంజూరైన 2 లక్షల 50వేల రూపాయల విలువైన ఎల్ఓసీ అనుమతి పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే జీఎంఆర్ బాలుడు తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, దేవానంద్, మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు అంతిరెడ్డి, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడ్ ప్లస్, ఎల్ఐసీలలో ఉద్యోగావకాశాలు

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్ మెడ్ ప్లస్, ఎల్ఐసీ మహబూబాబాద్ లో వివిధ పోస్టులకు గాను అర్హత కల్గిన నిరుద్యోగ స్త్రీ, పురుష అభ్యర్థులకు ఉద్యోగవకాశాలను కల్పించుటకు డిసెంబర్ 11న జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత తెలిపారు. అభ్యర్థులు ఎస్.ఎస్.సి, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, డిగ్రీ, ఆ పైన విద్యార్హతలు కలిగి 18–30 మద్య వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు డిసెంబర్ 11న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు జిల్లా కేంద్రంలోని కురవి రోడ్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్), రూమ్ నెంబర్ 25, రెండవ అంతస్తు, నందు గల జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం లో జరుగు జాబ్ మేళాకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 9666662481, ఎల్.ఐ.సి సాంబమూర్తి అసోసియేట్ – 9440423949 లో సంప్రదించాలని సూచించారు.

# ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడంలో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించి రాష్ట్రం ఏర్పాటుచేసిన ఘనత సోనియా గాంధీదే అని కొనియాడారు.


షాద్ నగర్ పట్టణంలో..


కేశంపేట మండల కేంద్రంలో..


వెల్లంకి గ్రామశాఖ ఆధ్వర్యంలో..


పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ నివాసంలో..


కేసముద్రం మండల కేంద్రంలో..


కాళేశ్వరంలో..


తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో..


వంగపహాడ్ లో..


నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ, జూపల్లిలో


గడిసింగాపూర్ గ్రామంలో..


రామన్నపేటలో..


తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో..


సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో..


మహేశ్వరం రామకృష్ణాపురం డివిజన్ వాసవి కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


మిర్యాలగూడ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..


హనంకొండ కాజిపేట్ కేంద్రంలో..


అమనగల్లు పట్టణంలో..

## భరత్ గౌడ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి అభినందన



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన మట్ట భరత్ గౌడ్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్ లు అభినందించారు. సోమవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే, పీ బీ సీ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసిన భరత్ గౌడ్ ను పూలమాలలు శాలువాలతో ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. యువజన కాంగ్రెస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటగాడి సతీష్, ఆనంద్, దినేష్, ఎంపీ అజార్, మహేష్, ఎండి దస్తగిరి, పుట్ట శివ, భయ్యా సాయి, జీవన్, అఫ్రోజ్, అశోక్, శ్రీకాంత్, శివ, వెంకటేష్, సమీర్, పాల్గొనడం జరిగింది.

## చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం

డా. పెండెం కృష్ణ కుమార్



**విశ్వంభర, సూర్యాపేట:** గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్ విభిన్న పాత్రాభినయ కళాకారులు, 350 విభిన్న పాత్రదారులు, రచయిత, సమాజ సేవకులు, పర్యావరణవేత్త డా. పెండెం కృష్ణ కుమార్ చింతల చెరువులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన ఆట వస్తువులు, వాటర్ క్యాన్, మెడికల్ కిట్, పెద్ద గోడ గడియారం, వరల్డ్ మ్యాప్ ఇండియా మ్యాప్, తెలంగాణ మ్యాప్ లు, అందరికి 15 కేజీల బరువు మోయగల రీయుజబుల్, వాషబుల్ క్లాత్ సంచులు అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు వారి మానసికోల్లాసానికి విజ్ఞానం వికసించడానికి చదువు, విజ్ఞానముతో పాటు క్రీడలు శారీరక దృఢత్వంనకు, ఆరోగ్యముగా ఉండడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అని అన్నారు. ప్రతి ఒక్కరు విదిగా విద్యార్థిని విద్యార్థులు ఆటలు ఆడటం అలవర్చుకోవాలని మంచి జ్ఞానాన్ని సంపాదించి దేశభక్తిని పెంచుకొని భవిష్యత్తులో దేశానికి మంచి పేరు తేవాలని అన్నారు. హెడ్మాస్టర్ ఆర్. సతీష్ కుమార్ ఆర్ రజిని, ఎండి మేహనజ్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పుట్టగొడుగుల ఉచిత శిక్షణ శిబిరం



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్లో యూనియన్ బ్యాంక్ స్వర్ణ భారత్ ట్రస్ట్ జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ మల్లారెడ్డి ఇన్స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో పుట్టగొడుగుల పెంపకం ఉచిత శిక్షణ శిబిరాన్ని మహేశ్వరం మండల ఏపీఎం సత్యనారాయణ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ ఉచిత శిక్షణ శిబిరంలో స్త్రీలు, పురుషులు అధిక సంఖ్యలో నేర్చుకొని మంచి అవకాశాలున్న పుట్టగొడుగులు ఉత్పత్తి చేయాలని వారు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని రుణాలు ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ట్రైనింగ్ మాస్టర్ చంద్రమోహన్ కోఆర్డినేటర్ శివ, మహేశ్వరం గ్రామ యాదవ సంఘం అధ్యక్షులు దుద్దు కృష్ణ యాదవ్, మహేశ్వరం మండల ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు షేక్ హాజీ బాబా, మహేశ్వరం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమ లత, మహిళలు పాల్గొని విజయవంతంగా జరుపుకోవడం జరిగింది.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



**విశ్వంభర, కందుకూర్:** నేదునూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు గ్రామంలో నిరుపేదల కుటుంబాలకు ఇంద్రమ్మ ఇండ్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తుంది కాబట్టి మన గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వారి కుటుంబ పరిస్థితి, ఇంటి పరిస్థితి అన్నీ క్షున్నంగా తెలుసుకొని ఇందిరమ్మ అప్ లో అప్లోడ్ చేసే కార్యక్రమం ప్రారంభం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ రాజేష్ గౌడ్, కందుకూరు మండల్ వైస్ ఎం.పీ.పీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, కందుకూరు మండల్ కోఆర్డినేటర్ ఎండి అఫ్జల్ బేగ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బొర్ర సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వరికుప్పల బాబు, మాధవరెడ్డి, అంకగాల దర్శన్, సంజీవరెడ్డి, బోయ భాస్కర్, ఎండి సద్దాం, వంగూరి నరసింహ, కారోబార్ మహేందర్, ఎండి రఫిక్ పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా హెూం గార్డ్స్ ఆఫీసర్స్, హెూంగార్డ్ లు తమకు గౌరవ వేతనం, ఇతర సదుపాయాలు పెంచినందుకు గాను కృతజ్ఞతగా సోమవారం ఇందిరమ్మ కాలనీ నందు గౌరవ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలోని హెూంగార్డ్స్ సంతోషం వ్యక్తం చేస్తూ వారి వారి కార్యాలయాలలో పాలాభిషేకాలు చేశారు. హెూంగార్డ్స్ పట్ల ఆత్మీయతను చాటుతూ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. హెూంగార్డుల దినభత్యం రూ. 921 నుండి రూ. 1000కి పెంపు, వీక్లీ పరేడ్ అలవెన్స్ నెలకు రూ. 100 నుండి రూ. 200కి పెంపు, విధుల నిర్వహణలో సహజమరణం పొందినా లేదా ప్రమాదవశాత్తు మరణం కలిగిన హెూం గార్డ్స్ కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయడం, ఇవేకాకుండా, ఆరోగ్యశ్రీ హెల్త్ స్కీం ను హెూం గార్డ్స్ కు వర్తింపచేసే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ఇవన్ని కూడ జనవరి నెల 2025 నుండి అమలు లోనికి వస్తాయి.

## బ్రాహ్మణ మహా సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, ఎల్బీనగర్:** బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, బ్రాహ్మణుల ప్రగతి కోసమే నిర్వహించబోయే బ్రాహ్మణ మహా సమ్మేళనానికి యావత్ బ్రాహ్మణులను ఆహ్వానిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు బీఆర్ వి సుశీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. సోమవారం కొత్తపేటలోని ఏ బీ 6 కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ్స్ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బ్రాహ్మణ మహా సమ్మేళనానికి ఈ నెల 15న ఆబిడ్స్ లోని రాఘవరత్న టవర్స్ లో ఉన్న మైనింగ్స్ అసోసియేషన్ హాలులో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసంబర్ 29న రవీంద్రభారతి వేదికగా మహా సమ్మేళనం కార్యక్రమం జరుగబోతుందన్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, ప్రగతి పథంవైపు నడిపించే ఉద్దేశ్యంతోనే మన ప్రభుత్వం, మన ప్రగతి పేరుతో బ్రాహ్మణ మహా సమ్మేళనం ఏర్పాటు చేశామని తెలిపారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా, మార్గదర్శకులుగా ఉన్న తెలంగాణా ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆలోచనలు, సలహాలు పర్యవేక్షణలో ఈ మహా సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూపదీపనైవేద్య పథకం సంఘం అధ్యక్షులు వాసుదేవశర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు పోచంపల్లి రమణారావు, కోశాధికారి విద్యావతి, ఆహ్వాన కమిటీ కన్వీనర్ రాంచందర్ రావు, విష్ణుదాస్ శ్రీకాంత్, డాక్టర్ ప్రియదర్శిని, వేదాంతం పవన్ కుమార్, పెండ్యాల వైద్యనాథ్ రావు, భానుశర్మ, మధుసూదన్ రావు, వాణి పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించేదాకా పోరాటం ఆగదు

లక్ష్మీ నరసింహారెడ్డి



**విశ్వంభర, కడ్తాల్:** సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం వహిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమ పిలుపులో భాగంగా సోమవారం రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు కర్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మి నర్సింహ్మా రెడ్డి ని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఐ ఎస్ సదన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ పట్టణ మాజీ సర్పంచ్, గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే,రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాది కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 1500 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సర్పంచుల పెండింగ్ బిల్లుల సాధనకై చలో అసెంబ్లీ పిలుపునిచ్చిన రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలను మరియు ఆయా సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించినట్లు పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

## సూర్యాపేటలో భగవద్గీత జయంతి వారోత్సవాలు



**విశ్వంభర, సూర్యాపేట:** భగవద్గీత జయంతిని పురస్కరించుకొని దేవాలయాలు-ధార్మిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 9 నుండి 15 వరకు గీతా జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక కన్వీనర్ ఎన్. సి .హెచ్ వేణుగోపాలచార్యులు, కోకన్వీనర్లు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్ కుమార్ లు ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక భగవద్గీతా పారాయణం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుండి శనివారం వరకు పట్టణంలోని అన్ని దేవాలయాలలో సామూహిక భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, అలాగే ముగింపుగా డిసెంబర్ 15న స్థానిక రవి మహల్ లో ప్రతి సంవత్సరం లాగానే వెయ్యి మంది భక్తులచే సామూహిక భగవద్గీత పారాయణం "సహస్రగళ గీతార్చన" కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమములో శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి వారు పాల్గొని భక్తులకు తమ ఆధ్యాత్మిక ప్రవచనాన్ని అందజేస్తారని తెలిపారు. కావున సూర్యాపేట పట్టణ,పరిసర గ్రామాల భక్తులు వందలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి భక్తులు, ఐక్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS

# దిగ్విజయంగా కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి

### ఎమ్మెల్సీ మహేష్ గౌడ్



**విశ్వంభర, నాంపల్లి:** తెలంగాణలో ప్రతిపక్ష నేతల కుట్రలను తిప్పికొడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తి చేసుకుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మహేష్ గౌడ్ సోమవారం శాసన మండలిలో మీడియాతో మాట్లాడారు. నేడు రాష్ట్రంలో రెండు పండగలు జరుపుకుంటున్నామని.. ఓ వైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'ప్రజాపాలన విజయోత్సవాలు', తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ జన్మదిన ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. మాటకు కట్టుబడి శ్రీమతి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా పాలనా విజయోత్సవాలు పండగ.. తెలంగాణ ప్రజల పండగ అని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం రూపొందిందని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రాజకీయ నేతలు పార్టీలకు అతీతంగా పాల్గొనాలని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేష్ గౌడ్ వెంట ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, తీన్మార్ మల్లన్న ఉన్నారు.

**తెలంగాణ పునర్వికాసం వైపు..**

కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ పునర్వికాసం వైపు పయనిస్తోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదాలతో రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన బీజేపీ కేంద్ర మంత్రులు రాష్ట్ర అభివృద్ధికి సహకరించడం లేదని.. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమేనని.. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల పాలన గడీలకు, ఫామ్‌హౌస్‌లకే పరిమితమైందని.. కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజలకు పాలన చేరువయ్యేలా..ప్రజాస్వామ్య పంథాలో నడుస్తోందని మహేష్ గౌడ్ వెల్లడించారు.



అంతకుముందు గాంధీ భవన్ లో శ్రీమతి సోనియాగాంధీ 79 వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఏఐసీసీ ఇన్చార్జి దీపా దాస్ మున్షీ, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేశారు. అనంతరం టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## నవోదయ స్కూల్ మంజూరు కాకపోవడం సిగ్గు చేటు



**విశ్వంభర, భైంసా :** రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలో ఒకటి చొప్పున నవోదయ విద్యాలయాలు మంజూరైనప్పటికి.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు కాకపోవడం సిగ్గు చేటని బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డా. కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న కూడా నవోదయ స్కూల్ మంజూరు చేయించడంలో పూర్తిగా విఫలం చెందరన్నారు. సుమారు 500 మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ తీసుకొని నిర్మల్ జిల్లాలో నవోదయ విద్యాలయం మంజూరు చేయించి పేద, మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీ ఇంటిని ముట్టడిస్తామని వెల్లడించారు.

## ఆశా వర్కర్లపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### బెవరేజస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవి ప్రసాద్

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్ల పై పోలీసుల దాడి ని తీవ్రంగా ఖండిస్తున్నామని బెవరేజస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవి ప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో ఆశ వర్కర్ల వేతనం రూ. 18,000 లు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. వేతనాలు పెంచాలని అడిగినందుకు వారిపై పాశవికంగా లాఠీచార్జి చేసి అరెస్ట్ చేయడం దారుణం అని అన్నారు. కేసీఆర్ గత ప్రభుత్వం లో ఆశా వర్కర్లకు ప్రగతి భవన్ కు పిలిపించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వేతనాలు పెంచిన విషయం తెలిసిందే. ఉద్యోగులతో సమానంగా 30 శాతం జీతాలు పెంచి 7,800 కు పెంపు అమలు చేశారన్నారు.సంవత్సరం గడిచినా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నారు. తెలంగాణ (కాంగ్రెస్) తల్లి ఆవిష్కరణ రోజు మహిళా ఉద్యోగులను వేధించినందుకు మహిళల కు క్షమాపణ చెప్పి వారి వేతనాలను పెంచి, సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**విశ్వంభర, సూర్యాపేట:** కలెక్టరేట్ కార్యాలయం లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. దివ్యాంగుల దినోత్సవం లో ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ పి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులు అయినప్పటికీ కూడా వారు ప్రతిభలో ముందంజలో ఉన్నారని కొనియాడారు. దివ్యాంగులు తమ తమ ప్రతిపదతో వివిధ రంగాల్లో ముందుకు వెళ్తున్నారని, దివ్యాంగులు శరీర లోపమే కానీ మానసికంగా, స్థిరమైన ఆరోగ్యం కలిగి ఉంటారని అదనపు కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులైన కానీ వారు పనిచేసిన తీరు ను ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రశంసించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని దినాలలో వంద రోజులు పూర్తిచేసిన దివ్యాంగులకు ప్రపంచ దివ్యంగుల దినోత్సవ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా పని కల్పించిన ఏపీఓలకు, టీ ఏ లకు, ఎఫ్ఏ లకు, ఈసీలకు సమ్మానం ,ప్రశంసా పత్రాలు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ వీవి అప్పారావు, డిప్యూటీ సీఈవో శిరీష, డీపీఓ నారాయణరెడ్డి, డీడబ్ల్యూఓ నరసింహారావు, అడిషనల్ డీఆర్డీఓ సెల్ఫ్ రామ్ సురేష్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, డీపీఎంలు, ఎన్ఆర్జీఎస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రజావాణికి 49 దరఖాస్తులు



**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లాలోని ప్రజలు వివిధ సమస్యలపై ప్రజావాణిలో అందించె ఆర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని జిల్లా ఆదనపు కలెక్టర్ రెవెన్యు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 49 దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇట్టి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుల నుండి అర్జీలను కలెక్టర్ పి రాంబాబు, జడ్పీ సీఈఓ వీవీ అప్పారావు స్వీకరించారు. ప్రజావాణి కి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరిగిందని, సూర్యాపేట జిల్లాలోని రూరల్ ప్రాంతం నుండి 2,50,684. సూర్యాపేట అర్బన్ ప్రాంతం నుండి 58,378. జిల్లాలో మొత్తం 3,09,068 దరఖాస్తులు రావడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల ఇన్స్ట్రక్షన్స్ మొబైల్ యాప్ ద్వారా గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలలో వార్డు అధికారులు పరిశీలించాలని, ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమం వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుడు కి సంబంధించిన అన్ని వివరాలు, అలాగే అర్హులైన దరఖాస్తుదారుడి ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, ప్రస్తుతం ఉన్న ఇంటి దగ్గర తీసుకున్న ఫోటో, ఇంటి లోపల, బయట ఫోటోలు ,అలాగే కొత్తగా నిర్మించ తలపెట్టిన స్థలం దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ చివరికల్లా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీల పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ ఓ కోటాచలం, డీటీడీఓ శంకర్, డీఈఓ అశోక్ కుమార్, కలెక్టరేట్ సుదర్శన్ రెడ్డి, డీ ఏ హెచ్ శ్రీనివాస్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్ నాయక్,సీ పీ ఓ ఎల్ కిషన్, ఎల్డీఎం బాపూజీ, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారిని లత ,డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీటీఓ రవికుమార్, డీడబ్ల్యూఓ నరసింహారావు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 15న బెంగుళూరులో ఆస్రా 6వ జాతీయ సదస్సు



**విశ్వంభర, బషీర్ బాగ్:** వినియోగదారుల ఫోరం ద్వారా నాణ్యమైన సేవలు రావాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ సీనియర్ నేత ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా వినియోగదారుల కేసులు ఆస్రా ద్వారా పరిష్కారించడం హర్షణీయం అన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఆస్రా) ఆధ్వర్యంలో ఈనెల 15న బెంగుళూరులో జరిగే 6వ జాతీయ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ముఖ్య అతిథిగా హాజరై ఆస్రా వ్యవస్థాపక అధ్యక్షులు హబీబ్ సుల్తాన్ తో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం వారి హక్కులకు భంగం వాటిల్లిన్నప్పుడు ఉచితంగా న్యాయం అందించడమే ప్రధాన ఉద్దేశ్యంగా ఆస్రా ఏర్పిడిందన్నారు. ఆస్రా ఫౌండర్ హబీబ్ మాట్లాడుతూ సంస్థ 2016లో ప్రారంభమై 12 రాష్ట్రాల్లో 1000 మంది స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నారని, ఆస్రా సంస్థ ప్రతి సంవత్సరం ఆస్రా నేషనల్ సమ్మిట్ నిర్వహిస్తుందన్నారు. డిసెంబర్ 15న 6వ జాతీయ సదస్సు బెంగళూరులో నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక ఫౌర సరఫరాల వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి మునియప్ప, ఐఏఎస్ విజయ్ జోష్న తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్రా తెలంగాణ అధ్యక్షులు వెంకటేష్ గుప్త, ప్రతినిధులు కీర్తి, సుమన్, ఖైలేష్, ప్రశాంత్, శిరీష పాల్గొన్నారు.

## డిండిలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ



**విశ్వంభర, డిండి:** డిండి మండల కేంద్రంలో తిరుపతయ్య గౌడ్ కుమారుడు కన్న స్వామి రాకేష్ ఇంట్లో ఎలకుర్తి మల్లేష్ గురు స్వామి తిరుపతయ్య గురుస్వామి తిరుపతిరావు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వామి మహా మహాపడి పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ అయ్యప్పస్వామి మహా మహాపడి పూజకు అయ్యప్ప స్వాములు, భక్తులు అత్యధికంగా పాల్గొన్నారు. మండపంలో శబరిమలై అయ్యప్పస్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామికి అభిషేకం పుష్పాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపతి రావు, మల్లేష్ గురుస్వామి, తిరుపతయ్య గురుస్వామి, శ్రీనివాస్ గురు స్వామి, మల్లేష్ గురు స్వామి, ఏటి కృష్ణ గురుస్వామి, వెంకటయ్య గురు స్వామి, హుస్సేన్ గురుస్వామి, మధు గురుస్వామి రమేష్ గురుస్వామి, రాంబాబు గురుస్వామి, కేదార్నాథ్ స్వామి, గణేష్ స్వామి, రాకేష్ స్వామి, రజిని స్వామి, రాఘవ స్వామి, బన్నీ స్వామి, రాంబాబు స్వామి దర్శించుకున్నారు.

# పాలగుమ్మి మధుర పాటల గుమ్మ పాలు

డాక్టర్ కె వి రమణ




**విశ్వంభర, హైదరాబాద్:** ఆకాశవాణిలో లలిత గీతాలకు ఎందరో మహానుభావులు ప్రాచుర్యం కల్పిస్తే పాలగుమ్మి విశ్వనాథం విశిష్టత కల్పించారని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. మోహన్ మెలడీస్ నిర్వహణలో విఖ్యాత కళా కారుడు పాలగుమ్మి విశ్వనాథం 105 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొన్నారు. ఈ మేరకు లలిత సంగీత గాయకులు, గురువులు మల్లాది సూరి బాబు, రామ లక్ష్మి రంగాచార్య లకు పాలగుమ్మి స్మారక పురస్కారం బహుకరించి మాట్లాడారు. పాలగుమ్మి మధుర పాటల గుమ్మ పాలు అని అభివర్ణించారు. పాలగుమ్మి ఆకాశ వాణి కోసం స్వర పరచిన దేవులపల్లి కృష్ణశాస్త్రి గీతం ' నారాయణ నారాయణ అల్ల అల్ల , నీ పిల్లలమే మే మెల్లా ' లోని సందేశం నేడు అవసరమని భావి తరాలకు ఈ స్ఫూర్తిని అందించాలని కోరారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ పురస్కార గ్రహీతలు రామ లక్ష్మి సూరి బాబు స్వర గంగా ప్రవాహంలో గాన శిరోమణిలని ప్రశంసించారు. సినీ పాటలు రాజ్యం ఏలుతున్న నేటి కాలంలో లలిత గీతాల భీష్మ పితామహుడు పాలగుమ్మి విశ్వనాథం పేరిట తన జీవన భృతి లో కొంత వెచ్చించి జయంతిని ఏటా నిర్వషిస్తున్న కలగ కృష్ణ మోహన్ అభినందనీయులని ప్రశంసించారు. అలాగే ఆ సంస్థ నిర్వాహకుడు కలగా.. కృష్ణ మోహన్ మల్లీశ్వరి సినిమాకు వీణ సహకారం అందించిన పాలగుమ్మి లలిత సంగీత శిఖరమన్నారు. ఆకాశవాణి కేంద్రం లలిత గీతాల పుట్టినిల్లు అని పేర్కొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**విశ్వంభర,సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన దోసర్ల సత్యనారాయణ తెల్లవారుజామున మరణించడం జరిగింది. విషయాన్ని తెలుసుకుని స్ఫూర్తి విద్యాసంస్థల ఛైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిక్షం, బొడ్డుపల్లి గాలయ్య, రాసాల వెంకటేష్, చింతల కృష్ణయ్య, బాకారం వెంకటేష్, బాకారం కృష్ణయ్య, రాసాల విజయ్, బల్గురి నరేందర్, రాజశేఖర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు



**విశ్వంభర, మహేశ్వరం/కందుకూరు:** మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించనందుకు జాప్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ చలో అసెంబ్లీ పిలుపు భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు కందుకూరు మండల్ గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్ ని ముందుస్తూ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది. అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతుకూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికై డిమాండ్ చేస్తూ 'మోసాల పుట్ట ధరణి-డొల్లతనపు భూమాత' అనే అంశంపై రాష్ట్ర రైతాంగ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ పట్లోళ్ల నాగిరెడ్డి సభాధ్యక్షత వహించగా.. డా.బాబురావు-పర్యావరణ శాస్త్రవేత్త, ఆచార్య కట్టా భగవంత రెడ్డి-న్యాయవాది, ఎస్.జీవన్ కుమార్-మానవ హక్కుల వేదిక, దొంతి నర్సింహారెడ్డి-సామాజిక విశ్లేషకులు, కన్నెగంటి రవి -రైతు స్వరాజ్య వేదిక, అంబటి నాగయ్య-తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు, విమలక్క-అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల చైర్ పర్సన్, బొమ్మకంటి కొమురయ్య-టి ఆర్ సి.పి.ఎస్ గౌరవాధ్యక్షులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబర్ 9, 2023న ఏకకాలంలో రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి దాదాపు సంవత్సరం కావొస్తుందన్నారు. కానీ మూడు విడుతలుగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి కేవలం 40 శాతం మందికి మాఫీ చేసి మిగతా రైతులను నిలువునా ముంచిందన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీల లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రుణమాఫీ రూ.49,500 కోట్లు అంచనా వేయగా.. దాన్ని 31 వేల కోట్లకు కుదించారన్నారు. చివరికి 17869.26 కోట్లు మాత్రమే రద్దు చేశారని, ఈ విధానం రైతులను నిలువునా మోసపరచడం తప్ప మరొకటి కాదన్నారు. రైతులకు పంట రుణాల మాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. పత్తి, వరి తదితర ధాన్యాలు పండించిన రైతులను గ్రామాల్లో దళారీలు మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వ్యవసాయ పరికరాలు సబ్సిడీలపై అందించాలని, వ్యవసాయ రుణాలు రద్దుచేసి కొత్త రుణాలు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే గత శాసనసభ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పలు వాగ్దానాలను అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో పడేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఒక సంవత్సరము కావస్తున్నప్పటికీ ఇంతవరకు ధరణి పోర్టల్ ను ఏ సముద్రంలో పడేసింది లేదనీ,సంపూర్ణ ప్రక్షాళన చేసింది లేదనీ ఎద్దేవా చేశారు. రైతు-కూలీ భరోసా, ధాన్యం పంటల బోనస్, నీటి మూటలుగానే మిగిలిపోయాయని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, నూతనంగా రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని, రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.15వేలు అందించాలన్నారు. కౌలు రైతులకు రుణమాఫీ, రైతు భరోసాను అందించాలని, ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని, ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళనకు-ఫార్మా కంపెనీలకు పొసగదని అంటూ, లగచర్ల ఘటనపై ప్రజా కమిటీ ఇచ్చే విచారణకు ఆదేశించాలని ఫార్మా అనుమతులన్నీ రద్దుచేసి హైదరాబాద్ మహానగరంతో పాటు సారవంతమైన తెలంగాణ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు- కూలీ పోరాట సమితి కార్యకర్తలు, అరుణోదయ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## మెజారిటీ ఆకాంక్షల మేరకే పాలన

### అలహాబాద్ హైకోర్టు జడ్జి శేఖర్



**విశ్వంభర, ప్రయాగ్‌రాజ్ :** హిందుస్థాన్‌లో కార్యకలాపాలు మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకే జరుగుతాయని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ అన్నారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)పై విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రయాగ్‌రాజ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.దేశంలో నివసిస్తున్న మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు దేశంలో కార్యకలాపాలు జరుగుతాయి. ఇది చట్టం. చట్టం మెజారిటీని బట్టి పని చేస్తుంది. కుటుంబం లేదా సమాజం విషయంలో చూడండి. కేవలం మెజారిటీ వ్యక్తుల సంక్షేమం, సంతోషాలకు ప్రయోజనం కలిగించేదానినే ఆమోదిస్తారు' అని జస్టిస్ యాదవ్ అన్నారు. సాంఘిక సామరస్యం, స్త్రీ, పురుష సమానత్వం, లౌకికవాదాలను బలపరచడమే ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) లక్ష్యమని చెప్పారు.

## టంగ్‌స్టన్ మైనింగ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం



**చెన్నై:** తమిళనాడు రాష్ట్రంలోని మధురై నగరంలో టంగ్‌స్టన్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. వాటర్ రిసోర్స్ మినిస్టర్ దురై మురుగన్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీ ప్రవేశపెట్టారు. కేంద్ర సర్కారును ఈ తీర్మానం తీవ్రంగా విమర్శించింది. తమిళనాడు అభ్యంతరాలను లెక్కచేయకుండా కేంద్రం మధురైలో టంగ్‌స్టన్ మైనింగ్‌కు అనుమతులు ఇచ్చిందని మండిపడింది.అసెంబ్లీలో తీర్మానానికి ఆమోదం లభించడానికి ముందు దీనిపై తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. చివరకు ఆ తీర్మానానికి సభ ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం మధురై నగరంలోని టంగ్‌స్టన్ గనులను తవ్వడానికి వేదాంత గ్రూప్‌కు అనుమతి ఇచ్చింది. దీనిపై అక్కడి ఆరిట్టపట్టి వాసులు ఆందోళనకు దిగారు. మైనింగ్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో రాష్ట్ర సర్కారు మైనింగ్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

## రెండు కార్లు ఢీ..

### చెలరేగిన మంటలు, ఏడుగురు మృతి



**అహ్మదాబాద్:** వేగంగా వెళ్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి.) సీఎన్‌జీతో నడిచే కారులోని సిలిండర్ పేలింది. దీంతో మంటలు చెలరేగాయి. రోడ్డు పక్కన ఉన్న గుడిసెలకు కూడా ఈ మంటలు వ్యాపించాయి. ఐదుగురు విద్యార్థులతో సహా ఏడుగురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం మలియా హాతీనా గ్రామం సమీపంలోని జునాగఢ్‌వెరావల్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్‌కు సమీపంలో రోడ్డు క్రాస్ చేసిన ఒక కారు హైవేపై ఎదురుగా వస్తున్న కారును వేగంగా ఢీకొట్టింది. దీంతో సీఎన్జీతో నడిచే కారులోని గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ నేపథ్యంలో మంటలు చెలరేగాయి. రోడ్డు పక్కన ఉన్న గుడిసెలకు కూడా ఈ మంటలు వ్యాపించాయి.కాగా, పరీక్ష కోసం వెళ్తున్న ఐదుగురు విద్యార్థులతో సహా ఏడుగురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. ఏడుగురు మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే గాయపడిన ఇద్దరికి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## కర్ణాటక ప్రభుత్వ తీరుపై ఏక్‌నాథ్ శిందే విమర్శలు



**ముంబయి:** కర్ణాటక ప్రభుత్వం తీరుపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే అసంతృప్తి వ్యక్తం చేశారు. బెళగావిలో నిరసనలు తెలుపుతున్న మహారాష్ట్ర ఏకీకరణ్ సమితి కార్యకర్తలపై పోలీసుల్ని ప్రయోగించడాన్ని ఖండించారు. సరిహద్దులో మరాఠా మాట్లాడుతున్న ప్రజలపై కర్ణాటక సర్కారు అణచివేత వ్యూహాలను అనుసరిస్తోందని మండిపడ్డారు. సోమవారం ఉదయం కర్ణాటకలోని సువర్ణ విధాన్ సౌధలో జరిగిన అసెంబ్లీ సమావేశాలను వ్యతిరేకిస్తూ మహారాష్ట్ర ఏకీకరణ్ సమితి కార్యకర్తలు, నేతలను ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంపై తాజాగా శిందే స్పందించారు.

మహారాష్ట్ర శాసన మండలి సమావేశంలో భాగంగా ఈ అంశంపై శిందే స్పందించారు. మహారాష్ట్రతో సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో మరాఠా మాట్లాడే ప్రజలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరి అన్యాయమన్నారు. మహారాష్ట్ర మండలిలో ప్రతిపక్ష నేత అంబాదాస్ దాన్వే అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. మహారాష్ట్ర ఏకీకరణ్ సమితి నిర్వహించే సమావేశాన్ని కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, ప్రజా ప్రతినిధులను నిర్బంధించిందని తెలిపారు. మరోవైపు, ఇరు రాష్ట్రాల మధ్య ఎప్పటినుంచో ఉన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించేందుకు అమిత్ షాతో గతంలో సమావేశం జరిగిందన్నారు. ఆ సమావేశంలో సానుకూలంగా చర్చలు జరిగినప్పటికీ.. కర్ణాటక ప్రభుత్వం ఈ తరహాలో వ్యవహరించడం గర్హనీయమన్నారు.

ఆక్రమణకు వస్తే..

# లాలీపాప్‌లు తింటూ కూర్చుంటామా?: దీదీ



**కోల్‌కతా:** బంగ్లాదేశ్‌కు చెందిన కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. విదేశీ శక్తులు ఆక్రమణకు వస్తే.. భారతీయులేమైనా లాలీపాప్‌లు తింటూ కూర్చుంటారా? అని అన్నారు. పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశాలపై తమకు హక్కు ఉందంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేతలు వ్యాఖ్యల నేపథ్యంలో దీదీ ఈ విధంగా స్పందించారు.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. కొందరు బంగ్లాదేశ్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. కేంద్రం తీసుకునే ఎటువంటి నిర్ణయానికైనా పశ్చిమబెంగాల్ కట్టుబడి ఉంటుందన్నారు. ఇదే సమయంలో బంగ్లాలో కొందరు చేసే రెచ్చగొట్టే ప్రకటనలకు స్పందించవద్దని, సంయమనం పాటిస్తూ ప్రశాంతంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన దేశ విదేశాంగ కార్యదర్శి బంగ్లాదేశ్‌లో ఉన్నారని, ఇక్కడున్నవారు అనవసరంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయవద్దన్నారు.

"బంగ్లాదేశ్‌లోని మైనారిటీలపై జరుగుతోన్న దాడులు, అక్కడి నేతల వ్యాఖ్యలను మన రాష్ట్రంలోని ఇమామ్‌లు కూడా ఖండించారు. అక్కడ పరిస్థితులు దిగజారితే మన బంధువులు, మిత్రులపైనా పడుతుంది. అందుకే ఏదైనా వ్యాఖ్యానించేటప్పుడు సంయమనం పాటించండి. రాష్ట్రంలో పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండేందుకు మనందరం కలిసి పనిచేయాలి'' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. పశ్చిబెంగాల్, బిహార్, ఒడిషాలపై తమ దేశానికి చట్టబద్ధ హక్కులు ఉన్నాయంటూ ఇటీవల ఢాకాలో ఏర్పాటు చేసిన సభలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేతలు పేర్కొనడం చర్చనీయాంశమైంది. తాజాగా దీనిపై స్పందించిన మమతా బెనర్జీ.. మన భూమిని ఎవరైనా ఆక్రమించుకోవడానికి వస్తే భారతీయులు ఏమైనా లాలీపాప్‌లు తింటూ కూర్చుంటారా? అని ప్రశ్నించారు. భారత విదేశాంగశాఖ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం, తృణమూల్ పార్టీ తప్పకుండా పాటిస్తుందని చెప్పారు. ఇదిలాఉంటే, బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడి విదేశాంగశాఖ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్, సలహాదారు తౌహిద్ హుస్సేన్‌లతో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హిందువులు, మైనారిటీల భద్రతపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ సహా భారత సరిహద్దుల్లో బంగ్లా దళాలు డ్రోన్ల మోహరించడంపైనా మాట్లాడామన్నారు.

## కేజ్రీవాల్ 'తగ్గేదేలే'.. బీజేపీ రప్పా-రప్పా!

### ఆమ్‌ఆద్మీ పార్టీ, బీజేపీల మధ్య పోస్టర్ వార్




**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశ రాజధానిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన 'పుష్ప 2' సినిమా స్టిల్స్‌తో అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ, బీజేపీల మధ్య పోస్టర్ వార్ మొదలైంది. తగ్గేదేలే అంటూ కేజ్రీవాల్ ఫొటోతో కూడిన ఓ పోస్టర్‌ను ఆప్ విడుదల చేయగా.. బీజేపీ కూడా రప్పారప్పా పేరుతో దీటుగా స్పందించడం గమనార్హం.

అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసిన రెండు పార్టీలు.. సోషల్ మీడియా సహా అన్ని మాధ్యమాల ద్వారా ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేజ్రీవాల్ 'ఝుకేగా నహీ (తగ్గేదేలే)' అంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ ఇటీవల ఓ పోస్టర్ విడుదల చేసింది. పుష్ప సినిమాలో హీరో పోజులో ఉన్న కేజ్రీవాల్.. చీపురు చేత పట్టుకొని ఉన్నారు. నాలుగోసారి మళ్లీ అధికారం తమదే అనే అర్థంలో ఆ పోస్టర్‌ను రూపొందించారు.

ఆప్‌కు దీటుగా స్పందించిన బీజేపీ కూడా తాజాగా ఓ పోస్టర్ విడుదల చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్.. పుష్ప క్యారక్టర్ తరహాలోనే కుర్చీలో కూర్చున్నట్లు దానిని రూపొందించారు. 'అవినీతిపరులను అంతం చేస్తామంటూ.. 'రప్పారప్పా' అని రాసి ఉన్న ఆ పోస్టర్‌ను కాషాయ పార్టీ విడుదల చేయడంతో ఢిల్లీ రాజకీయాలు ఆసక్తిగా మారాయి.కొన్నేళ్లుగా దేశ రాజధానిలో పాగా వేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ వరుసగా గెలుస్తూ వస్తోంది. 2013, 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఆప్.. ఈసారి కూడా అధికారాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు 1998 నుంచి దేశ రాజధానిలో అధికారానికి దూరమైన భాజపా.. ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది.

# రష్యాతో 4 బిలియన్ల డాలర్ల డీల్..

### లాంగ్ రేంజ్ రేడార్ సిస్టమ్ కొనుగోలు



**న్యూఢిల్లీ:** రష్యాతో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకోనున్నది భారత ప్రభుత్వం. సుమారు 4 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఆ ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. లాంగ్ రేంజ్ వార్నింగ్ రేడార్ వ్యవస్థను రష్యా నుంచి భారత్ కొనుగోలు చేయనున్నది. ఆ ఒప్పందానికి చెందిన సంప్రదింపులు అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అల్మాజ్‌ఆంటే కార్పొరేషన్ కంపెనీ వోరోనేజ్ రేడార్‌లను ఉత్పత్తి చేస్తున్నది. ఏరోస్పేస్ ఎక్విప్మెంట్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైల్ సిస్టమ్స్, రేడార్ల ఉత్పత్తిలో ఆ సంస్థ అగ్రస్థానంలో ఉన్నది. అయితే మిస్సైల్ బెదిరింపుల్ని గుర్తించి, ట్రాక్ చేసేందుకు సామర్థ్యాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే సుదీర్ఘ దూరం నుంచి క్షిపణుల కదలికల్ని రేడార్లతో పసికట్టేందుకు ఈ కొనుగోలు చేపట్టనున్నారు. దాదాపు 8 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలిస్టిక్ క్షిపణులు, విమానాలను వోరోనేజ్ రేడార్ వ్యవస్థ గుర్తిస్తుందని అధికారులు అంటున్నారు. కొన్ని దేశాల వద్దే ఉన్న ఇలాంటి టెక్నాలజీని ఇప్పుడు భారత్ కూడా సొంతం చేసుకోనున్నట్లు రష్యా చెబుతోంది.ఇటీవల అల్మేజ్‌ఆంటే బృందం భారత్‌లో పర్యటించింది. మేకిన్ ఇండియాలో భాగంగా సుమారు 60 శాతం రేడార్ వ్యవస్థను భారతీయ కంపెనీల ఉత్పత్తులతోనే నిర్మించనున్నారు. కర్నాటకలోని చిత్రదుర్గలో దీన్ని ఇన్‌స్టాల్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇక్కడ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ , ఏరోస్పేస్ సౌకర్యాలు ఉన్నాయి.

## ఐఎన్‌ఎస్ తుషిల్‌ను అప్పగించిన రష్యా..



**కాలినిన్‌గ్రాడ్:** మల్టీరోల్ స్టీల్త్ గైడెడ్ మిస్సైల్ యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ తుషిల్ ఇవాళ జలప్రవేశం చేసింది. రష్యాలోని కాలినిన్‌గ్రాడ్‌లో ఆ నౌకను ఆవిష్కించారు. ఈ కార్యక్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఐఎన్‌ఎస్ తుషిల్ జలప్రవేశంతో సముద్ర గస్తీలో భారత సామర్థ్యం పెరుగుతున్నట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఏఐ, కౌంటర్ టెర్రరిజం లాంటి అంశాల్లో భారత్, రష్యా సహకారం కొత్త దశకు చేరుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి, అడ్మిరల్ అలెగ్జాండర్ మోసేవ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఐఎన్‌ఎస్ తుషిల్‌ను.. రక్షణ కవచంతో పోల్చుతున్నారు. క్రివాక్ 3 క్లాస్ ఫ్రిగేట్‌కు చెందిన అప్‌గ్రేడ్ వర్షన్ ఇది. ఇప్పటికే ఇలాంటి ఆరు యుద్ధనౌకలు ఇండియన్ నేవీలో ఉన్నాయి. వాటిల్లో మూడు తల్వార్ క్లాస్ ఉన్నాయి. 1135.6 ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఏడవ యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ తుషిల్.భారతీయ నౌకాదళ స్పెషలిస్టుల సమక్షంలోనే తుషిల్ నిర్మాణం జరిగినట్లు చెబుతున్నారు. నిర్మాణం తర్వాత అనేక సార్లు ఆ యుద్ధనౌకతో ట్రయల్స్ నిర్వహించారు. ఈ ఏడాది జనవరి నుంచే ట్రయల్స్ చేశారు. ఇండియన్ నేవీలోని స్వార్డ్ ఆర్మ్‌తో తుషిల్ కలవనున్నది. వెస్ట్రన్ నావెల్ కమాండ్ కింద ఈ యుద్ధనౌక పనిచేస్తుంది.

## విమానాల్లో సాంకేతిక లోపం.. అత్యవసర ల్యాండింగ్


**కొచ్చి:** చెన్నై నుంచి కొచ్చి బయలుదేరిన ఓ ప్రైవేటు విమానాన్ని సాంకేతిక లోపం కారణంగా అత్యవసరంగా ల్యాండింగ్ చేసినట్లు చైన్నై విమానాశ్రయం అధికారులు పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున 117 మంది ప్రయాణికులతో చెన్నై నుంచి కొచ్చి బయలుదేరిన ఓ ప్రైవేటు విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ తిరిగి చెన్నైకి దారి మళ్లించారని తెలిపారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని.. మరో విమానంలో వారిని తమ గమ్యస్థానానికి పంపనున్నామన్నారు. మరో ఘటనలో దిల్లీ నుంచి షిల్లాంగ్ వెళ్తున్న స్పైస్‌జెట్ విమానంలోనూ సాంకేతికలోపం తలెత్తినట్లు అధికారులు వెల్లడించారు. విమానాన్ని అత్యవసరంగా పట్నాలోని జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు.

# ప్యూన్ ఘరానా మోసం.. రూ.10 కోట్ల కుంభకోణం

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో ఓ ఘరానా మోసం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ కార్యాలయంలో ప్యూన్ గా పని చేసే బ్రిజేంద్రదాస్ నామ్‌దేవ్ అనే వ్యక్తి మరో ఐదుగురి సాయంతో రూ.10 కోట్ల కుంభకోణానికి ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు తొలుత బ్రిజేంద్రను ప్యూన్‌గా కాకుండా డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారిగా చూపించి బ్యాంకుల్లో పనిచేస్తున్న మరికొందరు నిందితుల సాయంతో విత్తన ధ్రువీకరణ విభాగానికి సంబంధించిన నకిలీ పత్రాలు, డాక్యుమెంట్లను చూపించి రూ.10 కోట్లను అతడి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అనంతరం ఆ మొత్తాన్ని 50 వేర్వేరు అకౌంట్లకు బదిలీ చేసి, ఆ నగదుతో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు భూముల కొనుగోలుకు యత్నించారు. ప్రభుత్వ జాతీయ పశుసంవర్ధక పథకం కింద కొనుగోలు చేసిన భూమిలో ప్రాజెక్ట్‌లను ప్రారంభించి, ఈ పథకం ద్వారా వచ్చే సబ్సిడీని పొందాలని ప్లాన్ చేశారు. శాఖాపరమైన ఇబ్బందులు రాకుండా నకిలీ దస్త్రాలు, సీళ్లు సైతం తయారుచేశారు. అయితే వారి పథకం బెడిసి కొట్టడంతో ప్యూన్‌తో సహా ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

బ్రిజేంద్రదాస్ ప్రవర్తనపై విత్తన ధ్రువీకరణ అధికారి సుఖ్‌దేవ్ ప్రసాద్ అహిర్వార్‌కు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడని.. దీంతో ఈ కుంభకోణం బయటకు వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కుంభకోణానికి ప్రధాన నిందితుడైన బ్రిజేంద్రదాస్ నామ్‌దేవ్ నాలుగు నెలల కిందటే పథక రచన చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశామని.. వారి వద్ద ఉన్న నకిలీ పత్రాలు, భూములను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

## ఢిల్లీలో 40కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపులు



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. దాదాపు 40కి పైగా స్కూళ్లకు ఈతరహా బెదిరింపు ఈమెయిళ్లు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయా స్కూళ్లలో తనిఖీలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా విద్యార్థులను ఇళ్లకు పంపించేశారు.

ఆర్కే పురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పశ్చిమవిహార్‌లోని జీడీ గొయెంకా స్కూళ్లకు సోమవారం ఉదయం బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. మరికొన్ని పాఠశాలలకు నిన్న అర్ధరాత్రే ఈ బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. పాఠశాలల ఆవరణల్లో పేలుడు పదార్థాలను అమర్చామని, వాటిని పేల్చకుండా ఉండాలంటే 30వేల డాలర్లు ఇవ్వాలని అగంతకులు బెదిరించినట్లు తెలిపారు.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు నిర్వీర్యదళంతో ఆయా స్కూళ్ల కు వెళ్లి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ వచ్చిన ఐపీ అడ్రస్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఈ ఏడాది ఆరంభం నుంచి ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో పాఠశాలలకు పలుమార్లు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక, అక్టోబరులో రోహిణి ప్రాంతంలోని ఓ సీఆర్పీఎఫ్ స్కూల్ బయట బాంబు పేలుడు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది.

## ఆప్ రెండో జాబితా విడుదల.. ఆ కోచ్ కోసం సిసోదియా త్యాగం



**ఢిల్లీ:** వచ్చే ఏడాది ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పటికే తొలి జాబితాను విడుదల చేసిన అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ తాజాగా తమ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా పేరు ప్రకటించారు. అయితే ఆయన ఎప్పుడూ పోటీ చేసే పటపఢ్ గంజ్ స్థానం నుంచి కాకుండా జంగ్‌పురా నుంచి పోటీ చేయడం గమనార్హం. ఎన్నోఏళ్లుగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ స్థానం నుంచి ఇటీవల ఆప్‌లో చేరిన ప్రముఖ యూపీఎస్సీ కోచ్ అవధ్ ఓజా పోటీ చేయనున్నారు.

మనీలాండరింగ్‌తో ముడిపడిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో 17 నెలలుగా తిహాడ్ జైలులో ఉన్న సిసోదియా ఆగస్టులో విడుదలయ్యారు. ఇదిలాఉంటే.. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రానున్న ఎన్నికల కోసం పార్టీని ముందుకునడిపిస్తున్నారు. ఆప్ నేత ఆతిశీ ఢిల్లీకి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా ఢిల్లీ మంత్రిగా పనిచేసిన కైలాశ్ గహ్లోత్ ఇటీవల భాజపాలో చేరిన విషయం తెలిసిందే.

## బుర్కినా ఫాసోకు భారత రాయబారిగా ఓం ప్రకాష్ మీనా

**ఢిల్లీ:** బుర్కినా ఫాసో దేశానికి భారత తదుపరి రాయబారిగా ఓం ప్రకాష్ మీనా నియమితులయ్యారు. త్వరలో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ సోమవారం సాయంత్రం వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఓం ప్రకాష్ మీనా 1979 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో రాజస్థాన్ చీఫ్ సెక్రెటరీగా కూడా పని చేశారు.



## చంపేస్తామని హెచ్చరిస్తూ.. పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు వచ్చాయి. బెదిరింపు కాల్స్, సందేశాలు వచ్చిన విషయాన్ని అధికారులు.. పవన్ కల్యాణ్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

### కఠిన చర్యలు తీసుకోండి: అనిత

పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడంపై హోంశాఖ మంత్రి అనిత స్పందించారు. డీజీపీతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పేషీకి రెండుసార్లు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని డీజీపీ.. హోంమంత్రి అనితకు వివరించారు. ఫోన్ కాల్ వచ్చిన నెంబర్‌ను ట్రేస్ చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రతనిధుల పట్ల ఈ విధమైన చర్యలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అనిత స్పష్టం చేశారు.

## అల్లూరి జిల్లాలో విషాదం..

### విద్యుదాఘాతంతో తల్లి, ఇద్దరు పిల్లలు మృతి

**విశ్వంభర, పెదబయలు:** అల్లూరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెదబయలు మండలం గడుగుపల్లిలో విద్యుదాఘాతంతో తల్లి, ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఇంటిపైన బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తల్లి కుర్రా లక్ష్మి (36), కుమారుడు సంతోష్ (13), కుమార్తె అంజలి (10) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

## రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు: నాదెండ్ల మనోహర్



**విశ్వంభర, లావేరు:** కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధాన్యం కొనుగోళ్లలో సంస్కరణలు తీసుకొచ్చామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ధాన్యం తడిసిపోకుండా రైతులకు టార్పాలిన్లు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కలిశెట్టిగూడెంలో మంత్రి మనోహర్ సోమవారం పర్యటించారు. స్థానిక ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను తామే చెల్లించామన్నారు. ''ఈ ఏడాది శ్రీకాకుళం జిల్లాలో 5 లక్షల టన్నుల ధాన్యం కొంటున్నాం. దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్మవద్దు. తేమ 20శాతం వరకు ఉన్నా కొంటున్నాం. రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవు'' అని నాదెండ్ల హెచ్చరించారు.

## అమ్మో.. అది పెద్దపులే..

### ప్రత్తిపాడు పరిసరాల్లో భయం భయం



ప్రతీకాత్మక

**విశ్వంభర, ప్రత్తిపాడు:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు నిర్ధరించారు. ఆదివారం ప్రత్తిపాడు శివార్లలో ఆవును ఓ జంతువు చంపి తినేసింది. దానిని గుర్తించే క్రమంలో పాదముద్రల నమూనాల ఆధారంగా అధికారులు పెద్దపులిగా గుర్తించారు. ప్రస్తుతం పెద్దపులి పెదబాపన్నదార పరిసర అటవీ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని శంఖవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల్లోని సమీపాన ఉన్న 20 గ్రామాల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆవు కళేబరం పరిసరాల్లో నాలుగు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. 2022 మేలో 37 రోజుల పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పులి సంచరించింది. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం, తుని మండలాల్లో సంచరించింది. ఇటీవల సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు సుమారు 45 రోజులు రాజమహేంద్రవరం, కడియం, ఆలమూరు, రావులపాలెం పరిసర ప్రాంతాల్లో పులి తిరిగింది.

## కడప పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన అవినాష్‌రెడ్డి పీఏ



**విశ్వంభర, కడప:** వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి కడపలో పోలీసు విచారణకు హాజరయ్యారు. ఆయనకు ఇటీవల పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. దీంతో కడప సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు విచారణకు వచ్చారు. వర్రా రవీందర్‌రెడ్డి కేసులో రాఘవరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల తర్వాత ఆయన పులివెందుల రావడంతో పోలీసులు నోటీసులిచ్చారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మురళీ నాయక్ ఆయన్ను విచారిస్తున్నారు. సునీత, షర్మిల, విజయమ్మపై వర్రా రవీందర్‌రెడ్డితో అసభ్యకర పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై ఆరోపణలున్నాయి.

ఫిబ్రవరి 19 నుంచి

# శ్రీశైలం మల్లన్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

### ఏర్పాట్లను పరిశీలించిన ఈవో

**విశ్వంభర, శ్రీశైలం :** ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు శ్రీశైలం దేవస్థానం ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో భాగంగా ఏర్పాట్లపై ఈవో సంబంధిత అధికారులతో కలిసి కైలాసద్వారం, హఠకేశ్వరం, క్యూకాంప్లెక్స్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అటవీశాఖ సహకారంతో భీమునికొలను మెట్లమార్గం, కైలాస ద్వారం వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు వీలైనంత చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రహదారి గ్రావెల్ పనులు సైతం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కైలాసద్వారం వద్ద చలువ పందిళ్లు, తాత్కాలిక షెడ్లు, మంచినీటి వసతి, తాత్కాలిక విద్యుద్దీకరణ తదితర ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలన్నారు.ఫిబ్రవరి 19న ఉత్సవాలు మొదలవునున్నా.. పాదయాత్రగా వచ్చే భక్తులు ముందస్తుగానే క్షేత్రానికి వస్తారన్నారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి తొలివారం వరకే పనులన్నీ పూర్తవ్వాలని చెప్పారు. అలాగే అన్నదానం చేసే భక్తబృందాలకు దేవస్థానం తరపున సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అక్కడ దాతలు అన్నదానాన్ని ప్రారంభించే వరకు భక్తుల రద్దీ మేరకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టాలని సూచించారు. ఉత్సవం జరిగే రోజుల్లో ఆయా ప్రదేశాల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఉత్సవాల సమయంలో వైద్యారోగ్యశాఖ సమన్వయంతో వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హఠకేశ్వరం ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని ఉద్యానవనంలో దేవతా మొక్కలు నాటాలని ఆదేశించారు.


ఆ తర్వాత క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లను పరిశీలించారు, కంపార్ట్‌మెంట్లలో ఫ్లోరింగ్‌లో ఎలాంటి పగుళ్లు లేకుండా చూడాలని.. అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాలని ఆదేశించారు. క్యూకాంప్లెక్సులో మరిన్ని శౌచాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు నీరు సరఫరా జరగేలా చూడాలని చెప్పారు. ఇక శ్రీశైలం దేవస్థానం ప్రసారం చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను తిలకించేందుకు వీలుగా క్యూ కాంప్లెక్స్‌లలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. క్యూ కాంప్లెక్స్‌లో తొక్కిసలాట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో పోలీసుల సహాయ సహకారాలు తీసుకోవాలని చెప్పారు. ఈవో వెంట ఎఫ్ఆర్‌వో సుభాష్‌రెడ్డితో పాటు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఉన్నారు.




సందేహాలు పెరిగాయ్..

## విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాలి: జ్యోతుల నెహ్రూ

విశ్వంభర, విశాఖపట్నం: విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన అసెంబ్లీ సభా సంఘం సోమవారం విశాఖ డెయిరీని పరిశీలించింది. ఎమ్మెల్యే నెహ్రూ ఆధ్వర్యంలో సభ్యులు విశాఖ డెయిరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ఆదేశాలతో డెయిరీని పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలన తర్వాత సందేహాలు మరింత పెరిగాయని, నిపుణుల కమిటీ సహకారం తీసుకుంటామని చెప్పారు. విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాల్సి ఉందన్నారు.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చైర్మన్‌గా, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, ఆర్వీఎస్‌కేకే రంగారావు, దాట్ల సుబ్బరాజులను సభ్యులుగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు హౌస్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ''హౌస్ కమిటీ పరిశీలన సమయంలో డెయిరీ చైర్మన్ హాజరు కాలేదు. మాతో కేవలం ఎండీ మాత్రమే మాట్లాడారు. విశాఖ డెయిరీ 4 జిల్లాల పరిధిలో ఉంది. ఆయా జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తాం. పాడి రైతులకు నష్టం జరగకుండా నిర్ణయం తీసుకుంటాం. మా కమిటీ నివేదికను అసెంబ్లీకి అందిస్తాం'' అని జ్యోతుల నెహ్రూ చెప్పారు.స్పీకర్ ఆదేశాలతోనే విశాఖ డెయిరీపై హౌస్ కమిటీ వేసినట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. డెయిరీ విషయంలో అనేక అనుమానాలు, సందేహాలు ఉన్నాయన్నారు. పాడి రైతులను అడిగితే డబ్బులు తగ్గించారంటున్నారని, యాజమాన్యం మాత్రం అదేమీ లేదని చెబుతోందని మీడియాకు తెలిపారు. డెయిరీని హౌస్ కమిటీ మరోమారు పరిశీలిస్తుందని తెలిపారు.




## తరుణి ఫ్యాషన్ షోలో మెరిసిన మోడల్స్




**విశ్వంభర, హైదరాబాద్ :** ఫ్యాషన్‌లో ప్రసిద్ధి చెందిన తరుణి, ప్రత్యేక ఫ్యాషన్ షోలో లేటెస్ట్ బ్రైడల్ కలెక్షన్స్ లాంచ్‌తో పాటు చక్కదనం, సంప్రదాయం మరియు కాలాతీత సౌందర్యంతో మరపురాని సాయంత్రాన్ని నిర్వహించింది. ఈ ఫ్యాషన్ వాక్ ఆర్యన్ ఏజే మోడల్స్ తో తరుణి యొక్క అత్యుత్తమ సేకరణలను ప్రదర్శించింది, భారతీయ ఎత్నిక్ వేర్ యొక్క గొప్పతనాన్ని ప్రపంచంలోని దృశ్య ప్రయాణంలో అతిథులను తీసుకువెళ్లింది. బహుళ రౌండ్‌లను కలిగి ఉన్న ఈ ప్రదర్శన చీరలు, అనార్కలీ ఆధునిక సొబగులతో సహా బ్రాండ్ యొక్క నైపుణ్యాన్ని హైలైట్ చేసింది. సంప్రదాయం, ఆధునికత యొక్క వేడుక తరుణి యొక్క ఫ్యాషన్ షో భారతీయ మహిళల ఔన్నత్యాన్ని చాటింది. ప్రతి వస్త్రం ఒక ప్రత్యేకమైన కథను చెప్పింది. మన సాంస్కృతిక వారసత్వం యొక్క గాంభీర్యంతో పాతుకుపోయినప్పుడు ఆధునిక మహిళ యొక్క అందం, విశ్వాసాన్ని బయటకు తీసుకు రావడానికి రూపొందించబడింది. సంపన్నమైన పెళ్లి దుస్తుల నుంచి శుద్ధి చేసిన పండుగ సేకరణల వరకు, ప్రదర్శనలో ప్రతి సందర్భంలోనూ విభిన్న శైలులు ఉన్నాయి. సంప్రదాయ ఫ్యాషన్ ప్రేమికులను ఆకర్షిస్తాయి,మరపురాని జ్ఞాపకాలు సృష్టిస్తోంది అని తరుణి మార్కెటింగ్ మేనేజర్ ఊర్వశి కింగ్రని తెలిపారు.

## జగన్ బూటకపు యాత్రలతో రోడ్లపైకి వస్తే.. ప్రజలు నిలదీయడం ఖాయం: జీవీ




**విశ్వంభర, వినుకొండ:** చేసినవన్నీ చేసి ఇప్పుడు పోరుబాట అంటూ బూటకపు యాత్రలతో రోడ్లపైకి వస్తే జగన్‌ను అడుగడుగునా ప్రజలు నిలదీయడం ఖాయమని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక సంస్థల నిధుల మళ్లింపు నుంచి విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల వరకు రూ.వేలకోట్లు మింగేసిన పాపాలకే జగన్‌ను కాదని కూటమి ప్రభుత్వానికి అధికారమిచ్చారని తెలిపారు. ఇప్పటికైనా జగన్ తప్పులు సరిదిద్దుకుని, ఆత్మవిమర్శ చేసుకోవాలని చురకలు వేశారు. నూజండ్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ఆయన హాజరై వినతులను స్వీకరించారు. మండల వ్యాప్తంగా వివిధ సమస్యలపై 139 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ చేపట్టిన ప్రజాదర్బార్ ఎమ్మెల్యేలందరికీ ఆదర్శమని.. ఆయన బాటలోనే స్థానిక సమస్యలు తీర్చేలా ముందుకెళ్తున్నామని జీవీ తెలిపారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రీసర్వే అక్రమాలు, ఊరూరా భూకబ్జాలు తప్ప రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ కబ్జాల నియంత్రణ చట్టం ద్వారా.. ఇకపై ఎవరైనా భూఆక్రమణకు ప్రయత్నిస్తే నేరుగా జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.30వేల కోట్లకు పైగా భారం మోపిన వ్యక్తి.. పోరుబాట అంటున్నారని మండిపడ్డారు.

## జగన్ కంటే మహానటులు ఎవరూ లేరు


### మంత్రి అనగాని సత్యప్రసాద్

**విశ్వంభర, అమరావతి:** వైసీపీ అధినేత జగన్ కంటే మహానటులు ఎవరు లేరని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. పదే పదే అబద్ధాలు చెప్పడంతో పాటు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి ప్రజా రక్షకుడిగా చెప్పడం ఆయనకే సాధ్యమైందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యలు, దాడులు, అక్రమ కేసులతో అరాచకపాలన సాగించి.. ఇప్పుడేమో మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను దారిలో పెట్టి రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న శ్రమను నటన అంటున్నారని మండిపడ్డారు. వైకాపా హయాంలో విద్యార్థులు, ఉపాధ్యాయులపై మోయలేని భారాన్ని పెట్టి విద్యా వ్యవస్థను నాశనం చేశారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం ఘోరంగా పడిపోయిందని దుయ్యబట్టారు. గాడితప్పిన విద్యా వ్యవస్థను యువ నేత, మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కష్టపడి దారిలో పెడుతుంటే చూసి సహించలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నటించడం ఆపి ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని హితవు పలికారు.



## తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు

### : హోంమంత్రి అనిత



**విశ్వంభర, విజయవాడ:** గత వైకాపా ప్రభుత్వంలో అధికారులను విపరీతంగా బెదిరించారని హోంమంత్రి అనిత విమర్శించారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అందరినీ బెదిరించారన్నారు. విజయవాడలో సబ్‌జైలును ఆమె ఆకస్మికంగా సందర్శించి ఖైదీలతో ముఖాముఖి నిర్వహించారు. ''ప్రజలు మంచి నిర్ణయం తీసుకుని మాకు అధికారమిచ్చారు. ఖైదీని ఖైదీలా.. ముద్దాయిని ముద్దాయిలా చూడాలి. తప్పు చేసిన వారెవరినీ వదిలే ప్రసక్తే లేదు. కచ్చితంగా నిఘా ఉంటుంది.. చర్యలు తప్పవు. సబ్ జైలు మౌలిక వసతులపై ఆరా తీశాం. జైలులో అధికారులపై వస్తున్న ఆరోపణలపై వివరాలు సేకరించాం. విచారణ జరుగుతోంది. రెండు రోజుల్లో నివేదిక వస్తుంది. దానిపై త్వరలో చర్యలు తీసుకుంటాం. తమ తప్పులు బయట పడుతున్నాయన్న భయంతో విజయసాయి రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి మాట్లాడే స్థాయి ఆయనది కాదు. విజయసాయి రెడ్డిపై తప్పకుండా కేసులు నమోదు చేస్తాం. కాకినాడ పోర్టు కేసులో విచారణ జరుగుతోంది. వైకాపా నేతలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. జగన్ అండ్ కో ఏపీ సంపదను దోచుకున్నారు'' అని అనిత విమర్శించారు.


## ఆరు నెలల్లో వ్యవస్థను గాడిన పెట్టాం

### - అచ్చెన్నాయుడు



**విశ్వంభర, పార్వతీ-పురం:** కూటమి ప్రభుత్వానికి కేంద్రం బాగా సహకరిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు \ అన్నారు. అధికారంలోకి వచ్చాక అన్ని శాఖలపైనా సమీక్ష చేశామని, ఎవరూ ఊహించని విధంగా 6 నెలల్లో వ్యవస్థలను గాడిలో పెట్టామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం ఆయన పర్యటించారు. అందరూ ఆశ్చర్యపడేలా పథకాలు అమలు చేస్తున్నామన్నారు.''ధాన్యం కొనుగోళ్లపై ఒక్క రైతు కూడా ఫిర్యాదు చేయలేదు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేలు ఇస్తాం. ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతులకు రూ.145 కోట్లతో యంత్ర పరికరాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.860 కోట్లతో రహదారులు బాగు చేస్తున్నాం. సంక్రాంతికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. వైకాపా నేతలు రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ఉండేందుకు సీఎం ప్రయత్నం చేస్తున్నారు. కాస్త ఆలస్యమైనా సూపర్6 పథకాలన్నీ తప్పక అమలు చేస్తాం'' అని అచ్చెన్నాయుడు అన్నారు.

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య



**దిల్లీ:** మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను భాజపా ప్రకటించింది. ఏపీ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు అవకాశం కల్పించింది. గతంలో ఆయన వైకాపా నుంచి రాజ్యసభకు ఎన్నికై ఇటీవల రాజీనామా చేశారు. ఆర్.కృష్ణయ్యతో పాటు హరియాణా నుంచి రేఖాశర్మ, ఒడిశా నుంచి సుజిత్‌కుమార్‌ను అభ్యర్థులుగా బీజేపీ ఎంపిక చేసింది.

యూపీఎస్సీ సివిల్స్ (మెయిన్)

## ఫలితాలు విడుదల

**దిల్లీ:** అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (మెయిన్) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్ పరీక్షలు జరగ్గా.. ఈ ఫలితాలను UPSC సోమవారం సాయంత్రం విడుదల చేసింది. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లతో జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 1056 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు యూపీఎస్సీ గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి జులై 1న ఫలితాలు వెల్లడించారు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో మెయిన్ పరీక్షలు నిర్వహించిన అధికారులు.. తాజాగా ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. త్వరలో నిర్వహించే ఇంటర్వ్యూలో సత్తా చాటిన వారిని ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర (గ్రూప్ ఏ, గ్రూప్ బి) సర్వీసులకు ఎంపిక చేస్తారు.

# మైదానంలో మాటల యుద్ధం..



**అడిలైడ్:** అడిలైడ్‌లో ఆసీస్, భారత్ మధ్య జరిగిన టెస్టులో మహ్మద్ సిరాజ్ ట్రావిస్ హెడ్ మధ్య మాటల యుద్ధాన్ని ఐసీసీ తీవ్రంగా పరిగణించింది. సిరాజ్ మ్యాచ్ ఫీజులో 20శాతం జరిమానాగా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. తోటి క్రీడాకారుడి పట్ల మైదానంలో అనుచితంగా ప్రవర్తించడం ద్వారా ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని 2.5 ఆర్టికల్‌ను ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 20శాతం పెనాల్టీ విధించినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. అలాగే, హెడ్‌పైనా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. క్రమశిక్షణ ఉల్లంఘనకు గాను ఇద్దరికీ ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను జరిమానాగా విధించింది. ఇద్దరూ తమ తప్పుల్ని అంగీకరించారని, మ్యాచ్ రిఫరీ ప్రతిపాదించిన చర్యలకు అంగీకారం తెలిపారని పేర్కొంది. అడిలైడ్ వేదికగా ఆసీస్, భారత్ మధ్య జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ సందర్భంగా ట్రావిస్ హెడ్ మహ్మద్ సిరాజ్ మధ్య మాటల యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాక సిరాజ్ సంబరాలు చేసుకుంటూ బయటికి వెళ్లిపో అంటూ సైగలు చేశాడు. అయితే, సునాయసంగా సెంచరీ బాదిన హెడ్‌తో భారత పేసర్ వ్యవహరించిన తీరును ఆసీస్ మాజీ క్రికెటర్లతోపాటు కొంతమంది భారత మాజీ ఆటగాళ్లు తప్పుబడుతున్నారు. ట్రావిస్ హెడ్ తో సిరాజ్ అలా చేయకుండా ఉంటే బాగుండేదని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డాడు. తాజాగా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ సిరాజ్ వ్యవహరించిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు.

### డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో

## టాప్ 1లోకి దూసుకొచ్చిన దక్షిణాఫ్రికా..

**ముంబయి:** డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ ఆసక్తికరంగా మారింది. టీమ్‌ఇండియాపై విజయంతో టేబుల్ టాప్‌లోకి వచ్చిన ఆస్ట్రేలియా సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. ఆ జట్టును వెనక్కి నెట్టి ప్రస్తుతం అగ్రస్థానంలోకి దక్షిణాఫ్రికా దూసుకొచ్చింది.శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికా 20 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంతో తన పర్సంటేజీని (63.33 శాతం) మెరుగుపరుచుకుని టాప్ 1లోకి చేరింది. ఇక ఆస్ట్రేలియా 60.71, టీమ్‌ఇండియా 57.29 శాతాలతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అంతకుముందు పెర్త్ టెస్టు విజయంతో టాప్ 1లోకి వచ్చిన టీమ్ ఇండియా.. పింక్ బాల్ టెస్టులో 10 వికెట్ల తేడాతో పరాయజం పాలై మూడో స్థానానికి పడిపోయింది. ఇక శ్రీలంక నాలుగో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ ఐదో స్థానంలో కొనసాగుతోంది.డబ్ల్యూటీసీ సైకిల్‌లో మ్యాచ్‌లు ముగిసేనాటికి ఈ జాబితాలో టాప్ 2లో ఉన్న జట్లు ఫైనల్ ఆడతాయి. ఇక మూడోసారి ఫైనల్ చేరాలన్న టీమ్‌ఇండియా కల నెరవేరాలంటే.. ఆస్ట్రేలియాతో మిగిలి ఉన్న మూడు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాలి. ఒక్కటి ఓడినా పరిస్థితి క్లిష్టంగా మారుతుంది. ఆ సమయంలో ఇతర జట్ల ఫలితాలు తనకు అనుకూలంగా కలిసి రావాలి. అప్పుడే టీమ్‌ఇండియా ఫైనల్ చేరుతుంది.

### ఛాంపియన్స్ ట్రోఫీ: ఆడాలా.. వద్దా.. ?

# పాకిస్థానే నిర్ణయం తీసుకోవాలి : మాజీ క్రికెటర్

**ముంబయి:** వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ పై అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. దాయాది దేశంలో పర్యటించేది లేదని ఇప్పటికే బీసీసీఐ తన వైఖరి స్పష్టం చేసింది. మరోవైపు హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. ఈనేపథ్యంలో ఈ అంశంపై మాజీ క్రికెటర్ మదన్‌లాల్ స్పందించాడు. ఇప్పుడు బంతి పాకిస్థాన్ కోర్టులోనే ఉందని.. పీసీబీయే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిఉందని స్పష్టంచేశాడు.

''ఛాంపియన్స్ ట్రోఫీపై బీసీసీఐ ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. హైబ్రిడ్ మోడల్‌లో ఆడాలా.. వద్దా.. అనే నిర్ణయాన్ని ఇప్పుడు పాకిస్థానే తీసుకోవాలి. క్రికెట్ కొనసాగాలంటే.. వారు ఆడాలని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ దీనినుంచి ప్రయోజనాలు పొందుతుంది. ఎన్నో విషయాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. దీనిపై పీసీబీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది' అని మదన్‌లాల్ పేర్కొన్నాడు.




వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఛాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధతకు తెరదించేలా ఇటీవల ఐసీసీ (ICC)ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ టోర్నీని హైబ్రిడ్ విధానంలోనే నిర్వహించాలని నిర్ణయించిన ఐసీసీ.. భారత మ్యాచ్‌లకు వేదికగా దుబాయ్‌ను ఎంపిక చేసిందని సమాచారం. అలాగే 2027 వరకు జరిగే ఐసీసీ టోర్నీల్లోనూ పాక్ జట్టు విషయంలో హైబ్రిడ్ విధానాన్ని కొనసాగించేందుకు ఐసీసీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఐసీసీ ఛైర్మన్ జై షా, బోర్డు సభ్యుల మధ్య గురువారం అనధికార సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఫిబ్రవరిమార్చిలో పాక్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సిఉంది. కానీ ఈ టోర్నీ కోసం పాక్‌కు టీమ్‌ఇండియాను పంపేదే లేదని భారత ప్రభుత్వం స్పష్టంచేసింది. అయితే.. ఛాంపియన్స్ ట్రోఫీపై పీసీబీ ఇప్పటి వరకూ తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. దీంతో షెడ్యూల్ వెల్లడి వాయిదా పడుతూ వస్తోంది.మరోవైపు వచ్చే ఏడాది అక్టోబర్‌లో మహిళల వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. 2026 పురుషుల టీ20 ప్రపంచకప్‌ను శ్రీలంకతో కలిసి ఉమ్మడిగా భారత్ నిర్వహించనుంది. ఒకవేళ భారత్‌లోనూ హైబ్రిడ్ మోడల్ కొనసాగిస్తే.. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లు తటస్థ వేదికలపై జరగనున్నాయి.

### ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు..

# బుమ్రా ఐదు టెస్టులూ ఆడాలి: గావస్కర్

**ముంబయి:** బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమ్‌ఇండియా స్టార్ పేసర్ బుమ్రా అదరగొడుతున్నాడు. పింక్ బాల్ టెస్టులో భారత్ ఓటమి పాలైనప్పటికీ.. అతడు నాలుగు వికెట్లు తీశాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకూ మొత్తం 12 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అయితే.. అతడిపై పనిభారం పెరుగుతోందని.. మిగతా టెస్టులకు ఆడించే విషయంలో ఆలోచించాలన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ ఈ అంశంపై స్పందించాడు.

ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మిగతా అన్ని టెస్టులు బుమ్రా ఆడాలని గావస్కర్ సూచించాడు. అతడి బౌలింగ్ గొప్పగా ఉందని ప్రశంసించాడు. ఇక్కడ వర్క్‌లోడ్ సమస్యే ఉత్పన్నం కాదని స్పష్టం చేశాడు. ''అతడిని బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అన్ని టెస్టుల్లో చూడాలనుకుంటున్నాను. మీరు టీమ్‌ఇండియా తరపున ఆడుతున్నారంటే.. వర్క్‌లోడ్ అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఒకవేళ అతడు గాయపడితే తప్ప.. మిగతా అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండాలి. ఈ టెస్టు రెండున్నర రోజుల్లోనే ముగిసింది. దీంతో ఎక్కువ విరామం లభిస్తుంది. అతడికి 45 ఓవర్ల స్పెల్ ఇస్తున్నారు. ఇది సరైందే.. అలాగే ముందుకు సాగాలి. అతడు మన స్టార్ బౌలర్. అన్ని మ్యాచ్‌ల్లో అవకాశం ఇవ్వకపోతే.. ప్రత్యర్థి వికెట్లు తీసే అవకాశాలు తగ్గుతాయి. అతడిని ఎలా ఉపయోగించుకోవాలో కెప్టెనే నిర్ణయం తీసుకోవాలి'' అని గావస్కర్ సూచించాడు. ఇక బుమ్రా గురించి సారథి రోహిత్ శర్మ స్పందిస్తూ.. ''మేము ఒక్క బౌలర్ (బుమ్రా)తో మాత్రమే ఆడట్లేదు. ఇతర బౌలర్లు కూడా ఉన్నారు. వాళ్లు బాధ్యత తీసుకోవాలి. జట్టుకు వికెట్లు అందించాలి. అది సిరాజ్ కావొచ్చు లేదా హర్షిత్, నితీష్, ఆకాశ్, ప్రసిద్ధ్ కావొచ్చు. ఈ బౌలర్లు ఇప్పుడే టెస్టు క్రికెట్లోకి వచ్చారు. వాళ్లలో విశ్వాసం పెంపొందించడం ముఖ్యం. మేం ప్రణాళికలు రచిస్తూనే ఉంటాం. చర్చిస్తూనే ఉంటాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు బుమ్రా ఒక్కడే రెండువైపులా బౌలింగ్ చేయలేదు కదా'' అని అన్నాడు.



''ఓవర్ల మధ్య అతడితో మాట్లాడుతూనే ఉంటా. అతడి శరీరం ఎలా సహకరిస్తుందో తెలుసుకుంటాను. ఇది ఐదు మ్యాచ్‌ల సిరీస్. అతడిని ఫ్రెష్‌గా ఉంచడం ఎంతో ముఖ్యం. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కూడా ముఖ్యమే. అతడి ఫిట్‌నెస్‌ను పర్యవేక్షించడానికి ట్రెయినర్లు, ఫిజయోలు ఉన్నారు'' అని రోహిత్ వివరించాడు.

### రోహిత్ శర్మ

# అలా చేయడం వల్లే భారత్ ఓడింది

### : భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా



**ముంబయి:** బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలైంది. టెస్టుల్లో కెప్టెన్‌గా రోహిత్ శర్మకు వరుసగా ఇది నాలుగో ఓటమి. అతని కెప్టెన్సీలో స్వదేశంలో కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో భారత్ వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో రెండో టెస్టులో రోహిత్ ఇటు బ్యాటర్‌గాను, అటు సారథిగానూ విఫలమయ్యాడు. దీంతో రోహిత్ శర్మ కెప్టెన్సీ తీరుపై మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. అతని డిఫెన్సివ్ (రక్షణాత్మక) కెప్టెన్సీ వల్లే అడిలైడ్ టెస్టులో భారత్ ఓటమిపాలైందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా విమర్శించాడు. గత నాలుగు టెస్టుల్లో రోహిత్ కెప్టెన్సీ పేలవంగా ఉందన్నాడు. రెండో రోజు ఆటలో తొలి సెషన్‌లో బుమ్రాతో నాలుగు ఓవర్లే వేయించడాన్ని తప్పుబట్టాడు. ''జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు ఓవర్లు వేశాడు. అప్పటికే ఒక వికెట్ తీశాడు. మరి, అతను నాలుగు ఓవర్లే ఎందుకు బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత అస్సలు బౌలింగ్ చేయలేదు? ఆ సెషన్ మొత్తం బౌలింగ్‌కు దూరంగా ఉన్నాడు. రోహిత్ కెప్టెన్సీలో ఒక ట్రిక్ మిస్ అయ్యాడని చెప్తున్నారు. అది 100 శాతం నిజం. అతను డిఫెన్సివ్ కెప్టెన్సీ చేశాడు. దీనివల్లే భారత్ చేతిలో నుంచి మ్యాచ్ చేజారింది. ఈ శతాబ్దంలో ధోనీ, కోహ్లీ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిన కెప్టెన్ రోహితే కావడం ఆందోళన కలిగించే విషయం. అతని నాయకత్వంలో స్వదేశంలో వరుసగా మూడు ఓటములు ఎదురయ్యాయి. రోహిత్ కెప్టెన్సీ కాస్త పేలవంగా ఉంది' అని ఆకాశ్ చోప్రా అన్నాడు.

2011, 2014 సంవత్సరాల్లో ధోనీ సారథ్యంలో భారత్ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. 202021 మధ్య కెప్టెన్‌గా కోహ్లీ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. అడిలైడ్ టెస్టులో ఓటమి అనంతరం రోహిత్ మాట్లాడాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బ్యాటింగ్‌లో విఫలమవడం, బుమ్రాకు ఇతర పేసర్ల నుంచి సరైన మద్దతు లేకపోవడంతో భారత్ ఓడిపోయిందన్నాడు. ఇక, ఆసీస్‌తో సిరీస్ విషయానికొస్తే మూడో టెస్టు బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ డిసెంబరు 14న ప్రారంభమవుతుంది.

# 600 ఈవీ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్

**ముంబయి:** హ్యుందాయ్ మోటర్ ఇండియా వచ్చే ఏడేళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 600 పబ్లిక్ EV ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2024, డిసెంబర్ చివరి నాటికి 50 ఫాస్ట్ పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉంటుందని కంపెనీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2030 నాటికి ఈవీ మార్కెట్ దేశవ్యాప్తంగా వృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫంక్షన్ హెడ్ కార్పొరేట్ ప్లానింగ్ 'జే వాన్ ర్యూ' తెలిపారు. ప్రస్తుతం ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకపోవడం వల్ల హైవేలపై సుదూర ప్రయాణాలు చేసే ఎలక్ట్రిక్ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కీలకమైన హైవేలపై ఫాస్ట్ ఈవీ ఛార్జర్లను ఇన్‌స్టాల్ చేయడానికి హ్యుందాయ్ మోటార్స్ చొరవ తీసుకుంటోందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హ్యుందాయ్‌కు సంబంధించిన ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు అన్ని బ్రాండ్ల ఎలక్ట్రిక్ కార్ల వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. 2027 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 100 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు తమిళనాడు ప్రభుత్వంతో హ్యుందాయ్ సంస్థ ఎంఓయూపై సంతకం చేసింది. వాటిలో 10 స్టేషన్లు ఈ ఏడాది పూర్తయ్యేలోపు పనిచేయనున్నాయి. హ్యుందాయ్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు..గురుగ్రాం, ముంబై, పూణే, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో వ్యూహాత్మకంగా ఉన్నాయి. ఢిల్లీచండీగఢ్, ఢిల్లీజైపూర్, హైదరాబాద్‌విజయవాడ, ముంబైపూణే, ముంబైసూరత్, బెంగళూరుపూణే, పూణే కొల్హాపూర్‌తో సహా ప్రధాన రహదారులపై ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా కంపెనీ ఇప్పటికే పాన్‌ఇండియా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది.



# వచ్చే ఏడాది మరో బిగ్ ఐపీఓ..

### పబ్లిక్ ఇష్యూకు ఫ్లిప్‌కార్ట్ సన్నాహాలు!




**ముంబయి:** ప్రముఖ ఇకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ దేశీయంగా తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. రాబోయే 1215 నెలల్లో ఈ ఐపీఓ ఉండొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. చిన్న స్టార్టప్ స్థాయి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఇకామర్స్ సంస్థగా ఎదిగిన ఫ్లిప్‌కార్ట్.. వచ్చే ఏడాది మరో బిగ్ ఐపీఓగా నిలవబోతోందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశీయంగా ఐపీఓకు వచ్చేందుకు ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టిందని పలు ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఇందులోభాగంగా తొలుత తన హోల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించాలని ఫ్లిప్‌కార్ట్ భావిస్తోందని సమాచారం. ఇందుకోసం అంతర్గతంగా ఆమోదం లభించినట్లు తెలుస్తోంది. 2025లోనే ఐపీఓ ఉండొచ్చని, మరీ ఆలస్యమైతే 2026 తొలి త్రైమాసికంలో రావొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే జొమాటో, స్విగ్గీ, నైకా వంటి కొత్తతరం కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. వాటి సరసన ఫ్లిప్‌కార్ట్ కూడా చేరనుంది.

ఐఐటీ దిల్లీ విద్యార్థులైన సచిన్ బన్సల్, బిన్నీ బన్సల్ 2007లో ఫ్లిప్‌కార్ట్ స్థాపించారు. దీన్ని 2018లో అమెరికాకు చెందిన వాల్‌మార్ట్ సంస్థ కొనుగోలు చేసింది. ఆ సంస్థకు 81 శాతం వాటా ఉంది. ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ గ్రూపునకు కల్యాణ కృష్ణమూర్తి సీఈఓగా వ్యవహరిస్తున్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.17,907 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన ఫ్లిప్‌కార్ట్.. రూ.2,358 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. మరోవైపు ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ హోల్డింగ్ కంపెనీ సింగపూర్‌లో రిజిస్టర్ అయ్యింది. సాధారణంగా టెక్నాలజీ ఆధారిత సంస్థలు నియంత్రణ సంస్థల అనుమతులు, నిధుల సమీకరణ కోసం విదేశాల్లో తమ హోల్డింగ్ కంపెనీలను నెలకొల్పుతుంటాయి. ఐపీఓ ప్రణాళికలు కలిగిన జెప్టో, మీ షో, క్రెడిట్ బీ వంటి కంపెనీలు తమ హోల్డింగ్ సంస్థలను భారత్‌కు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

# కొత్త ఏడాదిలో కార్ల ధరలకు రెక్కలు..

**దిల్లీ:** కార్ల తయారీ కంపెనీలు ఒక్కొక్కటిగా కార్ల ధరలు పెంచేస్తున్నాయి. కొత్త ఏడాది నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే ప్రముఖ కార్ల తయారీ కంపెనీలైన మారుతీ, హ్యుందాయ్, మహీంద్రా, ఎంజీఈ మోటార్ ధరల పెంపును ప్రకటించగా.. తాజాగా టాటా మోటార్స్, కియా కూడా ఆ జాబితాలో చేరాయి. జనవరి 1 నుంచి కార్ల ధరలను పెంచనున్నట్లు ప్రకటించాయి.తమ ప్రయాణికుల వాహనాల ధరలను 3 శాతం వరకు పెంచనున్నట్లు టాటా మోటార్స్ సోమవారం తెలిపింది. విద్యుత్ వాహనాలూ ధరలూ పెంచుతున్నట్లు పేర్కొంది. ఉత్పత్తి వ్యయం పెరిగిన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మరో ఆటోమొబైల్ కంపెనీ కియా సైతం జనవరి 1 నుంచి కార్ల ధరలను 2 శాతం మేర పెంచనున్నట్లు తెలిపింది. ముడిసరకు ధరలు పెరగడం, సప్లయ్ చైన్ వ్యయాలు అధికమవ్వడం కారణంగా ధరల పెంపు తప్పడం లేదని పేర్కొంది. ఇప్పటి వరకు దేశీయంగా 16 లక్షల యూనిట్లు విక్రయించినట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది.

# ఐఆర్‌సీటీసీ సేవలకు అంతరాయం..!





**ముంబయి:** ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజమ్ కోఆపరేషన్ (ఐఆర్‌సీటీసీ)కి చెందిన ఈటికెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ వెబ్‌సైట్, యాప్‌లు సోమవారం దాదాపు గంటసేపు పని చేయవని సంస్థ తెలిపింది. నిర్వహణపరమైన పనులు చేపట్టడం వల్లే అది ఆగిపోయింది.ఈ విషయాన్ని ఐఆర్‌సీటీసీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ''నిర్వహణ పనుల కారణంగా.. ఈ టికెట్ సేవలు మరో గంటపాటు అందుబాటులో ఉండవు. తర్వాత ప్రయత్నించండి. టికెట్ రద్దు చేసుకోవడానికి, ఫైల్ టీడీఆర్ కోసం కస్టమర్ కేర్ నెంబర్ 14646, 07556610661,07554090600 నంబర్లకు ఫోన్ లేదా etickets@irctc.co.inకు మెయిల్ చేయండి'' అని సంస్థ తెలిపింది.

# ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి.. నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాన్ని నష్టాలతో ప్రారంభించాయి. రిలయన్స్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు సూచీలపై ఒత్తిడి పెంచాయి. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగియగా.. నిఫ్టీ 24,650 దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 81,602.58 (క్రితం ముగింపు 81,709.12) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొంది. ఇంట్రాడేలో 81,411.55 81,783.28 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 200.66 పాయింట్ల నష్టంతో 81,508.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 58.80 పాయింట్ల నష్టంతో 24,619.00 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించి 84.74 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా షేర్లు నష్టపోయాయి. ఎల్అండ్‌టీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.93 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2679 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



విశ్వంభర
V3 NEWS

# పార్ట్ వన్ పూర్తి చేశా..

## బాలీవుడ్ 'రామాయణ'పై రణ్‌బీర్ షూటింగ్ అప్‌డేట్

బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' . నితీశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి భారీ బడ్జెట్‌తో అల్లు అరవింద్ దీన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో రాముడిగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ అపడేట్‌ను రణ్‌బీర్ పంచుకున్నారు. తన కల నిజమైందని ఆనందం వ్యక్తంచేశారు.

''రామాయణ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది ఎంతో గొప్ప కథ. చిన్నప్పటినుంచి వింటూ పెరిగాం. ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు ఇందులో వర్క్ చేస్తున్నారు. నితీశ్ తివారి దీన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. పార్ట్ 1లో నా భాగం షూటింగ్ పూర్తి చేశాను. త్వరలోనే పార్ట్ 2 చిత్రీకరణ కూడా ప్రారంభమవుతుంది. ఇలాంటి పాత్రలో నటించడం నాకు కల. ఈ చిత్రంతో ఆ కల నిజమైంది. మన భారతీయ సంస్కృతి, గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప సినిమా 'రామాయణ'' అని చెప్పారు . ఇటీవలే ఈ సినిమా గురించి నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. విడుదల తేదీలను తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగం విడుదల కానున్నట్లు వెల్లడించింది.కొన్ని నెలలుగా ఈ సినిమాకు సంబంధించిన ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. ఈ చిత్రం షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా లీక్ అయ్యాయి. సైలెంట్‌గా చిత్రీకరణను పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో తన పాత్ర కోసం రణ్‌బీర్ శిక్షణ తీసుకున్నారు. డైట్ ఫాలో అవుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేవరకు మద్యపానం మానేసినట్లు చెప్పారు. సీత పాత్రలో నటించడం తన అదృష్టమని సాయిపల్లవి తెలిపారు. ఇక ఇందులో రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది.

### మూడు భాగాలుగా 'యానిమల్'..

ఇక ఇదే ఇంటర్వ్యూలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. యానిమల్ సినిమా అప్‌డేట్‌ను పంచుకున్నారు. ''యానిమల్'ను మూడు భాగాల్లో తెరకెక్కించనున్నారు. 2027లో దీన్ని ప్రారంభించనున్నారు. 'యానిమల్ పార్క్' పేరుతో రెండో పార్ట్ రానుంది. ఈ చిత్రం మొదటిభాగంలోనే దీని పూర్తి కథను సిద్ధం చేసుకున్నారు. ఇందులో నేను ద్విపాత్రాభినయంలో కనిపించనున్నా. హీరో, విలన్ రెండు పాత్రల్లోనూ కనిపిస్తాను. ఈ చిత్రం ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అని చెప్పారు.





# అలాంటి ప్రేమ మరొకటి లేదు: సమంత

హైదరాబాద్: ఇన్‌స్టాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు నటి సమంత. ఆ ప్లాట్‌ఫామ్ వేదికగా తన జీవితానికి సంబంధించిన పలు విషయాలను ఆమె తరచూ షేర్ చేసుకుంటారు. ప్రేమను ఉద్దేశించి తాజాగా ఆమె పెట్టిన పోస్టు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తన పెంపుడు శునకం సాషాతో దిగిన ఓ ఫొటోని షేర్ చేశారు. "సాషా చూపించే ప్రేమ మాదిరిగా మరొక ప్రేమ లేదు" అని క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం ఇది నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.

**ఎన్నో సవాళ్లు.. మరెన్నో పాఠాలు:**

ఈ ఏడాది ఎలా గడిచిందో తెలియజేస్తూ ఒక సందేశాత్మక పోస్ట్‌ను ఇటీవల ఆమె పంచుకున్నారు. ఎన్నో సవాళ్లు.. వాటినుంచి విలువైన పాఠాలు నేర్చుకున్నానన్నారు. "ఈ ఏడాది ముగింపునకు వస్తోన్న సమయంలో.. ఇప్పటివరకూ జరిగిన ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడుదొడుకులు తెలుసుకుందాం. సవాళ్ల నుంచి విజయాలు, ఎదుగుదల, ఆనందంతో ఒక తారగా ఇక్కడివరకూ వచ్చా. ఈ ఏడాది అందరినీ ఏదో ఒకవిధంగా పరీక్షించింది. కానీ, అది మనకు ధైర్యం, పట్టుదల విశిష్టత నేర్పించింది" అని పేర్కొన్నారు.


వ్యక్తిగత జీవితంలో ఇటీవల సమంత పలు ఒడుదొడుకులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు గత నెలాఖరులో కన్నుమూశారు. ఆ బాధ నుంచి బయటకు వచ్చేందుకు ఆమె వర్క్‌లైఫ్‌పై మరింత ఫోకస్ పెట్టారు. షూటింగ్స్‌తోపాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సందేశాత్మక పోస్టులను ఇన్‌స్టాలో పంచుకుంటున్నారు. సమంత ఈ ఏడాది 'సిటడెల్.. హనీ బన్నీ'తో ప్రేక్షకులకు వినోదం పంచారు. రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన ఈ సిరీస్ ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఏజెంట్ హనీగా సమంత నటనకు యాక్షన్ ప్రియులు ఫిదా అయ్యారు. ప్రస్తుతం ఆమె 'రక్త్‌బ్రహ్మాండ్ ది బ్లడీ కింగ్‌డమ్' అనే ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నారు. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకుడు. ఇటీవల సెట్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. "మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చేశా" అని పోస్ట్ పెట్టారు.




## సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్' ట్రైలర్ రిలీజ్..

వేదిక ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రం 'ఫియర్'. అరవింద్ కృష్ణ, జయప్రకాశ్, పవిత్ర లోకేశ్ కీలక పాత్రలు పోషించారు. డా.హరిత గోగినేని దర్శకత్వం వహించారు. ఎ.ఆర్ అభి నిర్మాత. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ డిసెంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు.

## సంధ్య థియేటర్ ఘటనపై అల్లు అర్జున్‌ను నిందించడం హాస్యాస్పదం: వర్మ



సంధ్య థియేటర్ ఘటనపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. ఈ విషయంలో హీరో అల్లు అర్జున్‌ను నిందించడం హాస్యాస్పదం అన్నారు. గతంలో తొక్కిసలాట ఘటనలు ఎన్నో జరిగాయని గుర్తుచేశారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. బెనిఫిట్ షోలను బ్యాన్ చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పారు. ఈమేరకు ఆయన తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

''భారీ సంఖ్యలో జనాలు పాల్గొన్నప్పుడే తొక్కిసలాట ఘటనలు జరుగుతాయి. ఇలాంటివి జరగడం ఇదేమీ తొలిసారి కాదు. తొక్కిసలాట ప్రమాదం వల్ల జరిగిందా? లేదా నిర్లక్ష్యం, అసమర్థత వల్ల జరిగిందా? ఉద్దేశపూర్వకంగా జరిగిందా? అనేది పూర్తిస్థాయి దర్యాప్తుతోనే తెలుస్తుంది. గతంలో ఇలాంటి ఘటనలు జరిగి వేల సంఖ్యలో మరణాలు సంభవించినప్పుడు వివిధ కారణాల వల్ల ఏ ఒక్కరినీ నిందించలేదు. ఈ ఘటనను దృష్టిలోఉంచుకొని బెనిఫిట్ షోలను బ్యాన్ చేయడం సమస్యకు పరిష్కారం కాదు. వరదల బాధితులకు, లేదా ఎవరికైనా విరాళం అందించేందుకు గతంలో బెనిఫిట్ షోలు ప్రదర్శించేవారు. కానీ ప్రస్తుత రోజుల్లో ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణను డబ్బు చేసుకోవడమే ఈ షోల ముఖ్యఉద్దేశం. దీనివల్ల ఎవరికీ ప్రయోజనం లేనప్పుడు వీటిని స్పెషల్ షోలు అని పిలవాలి. సాధారణ భోజనం, కాఫీలతో పోలిస్తే స్పెషల్ మీల్స్, కాఫీకి ఏవిధంగా అయితే ధర అధికంగా ఉంటుందో అదేవిధంగా స్పెషల్ షో టికెట్ రేట్లు కూడా అత్యంత ఖరీదుగా ఉంటాయి. రాజకీయ ర్యాలీలు, మీటింగ్స్‌కు ఏవిధంగా అయితే పర్మిషన్ ఇస్తారో అదేవిధంగా సినిమా ప్రదర్శనలకు కూడా పలువురు అధికారుల ఆమోదం ఉండాలి. సినీ తారలు థియేటర్లను విజిట్ చేయడం ఎంతోకాలం నుంచి జరుగుతుంది. వారిని చూసేందుకు జనాలు ఎగబడుతుంటారు. ఒక స్టార్ థియేటర్ విజిట్‌కు అనుమతి ఇవ్వాలా? వద్దా? అనే దానిపై పోలీసులు లేదా థియేటర్ యాజమాన్యం బాధ్యత వహించాలి. అంతేకానీ బెనిఫిట్ షోలను ఎందుకు నిషేధించాలి? దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఈ సినిమా బెనిఫిట్ షోలు ప్రదర్శించారు. అల్లు అర్జున్ (Allu Arjun) కేవలం ఒక్క థియేటర్‌కు మాత్రమే హాజరయ్యాడు. అక్కడే ఈ ఘటన జరిగింది. కాబట్టి స్టార్ విజిట్ చేసే థియేటర్ వద్ద ఆంక్షలు పెట్టకుండా బెనిఫిట్ షోలే పూర్తిగా రద్దు చేయాలనుకోవడం చూస్తుంటే.. ఒక ప్రమాదం జరిగిందని వాహనాలను రోడ్ల పైకి రావద్దన్నట్లు ఉంది. దీనివల్ల సమస్య తప్పుగా అర్థమయ్యే అవకాశం ఉంది. రాజకీయ సమావేశాలు, మేళాల్లో తొక్కిసలాట జరిగితే.. వాటిని ఎప్పుడైనా పూర్తిగా రద్దు చేశారా? అధికారులంతా ఈవిధంగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు.

**అసలేం జరిగిందంటే:**

పుష్ప2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వచ్చిన హీరో అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి(35)తో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. పోలీసులు వారికి సీపీఆర్ చేసి స్థానిక ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రేవతి మృతి చెందింది.

## అల్లు అర్జున్ ప్రతిభకు అభిమానిని..

### బన్నీని ప్రశంసించిన అమితాబ్



అల్లు అర్జున్‌పై బాలీవుడ్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ ప్రశంసలు కురిపించారు. బన్నీ వర్క్‌కు తాను అభిమానినని పేర్కొన్నారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప: ది రూల్' . తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణను సొంతం చేసుకుంటోంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ సినిమా ప్రచారంలో భాగంగా అల్లు అర్జున్‌అన్ని ప్రముఖ నగరాల్లో ఈవెంట్‌లు నిర్వహించిన సంగతి తెలిసిందే. ముంబయిలో ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బన్నీ మాట్లాడుతూ.. అమితాబ్ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. ఆయన ఎన్నో సంవత్సరాల నుంచి ఇండస్ట్రీలో స్టార్‌గా ఉన్నారని.. ఎంతోమంది నటీనటులకు ఆయన స్ఫూర్తి అని చెప్పారు. అమితాబ్ సినిమాలు చూస్తూ పెరిగానన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను ముందుకువెళ్తున్నట్లు చెప్పారు. తాజాగా ఈ వీడియోను అమితాబ్ షేర్ చేశారు.

'కృతజ్ఞతలు అల్లు అర్జున్. మీరు నా అర్హతకు మించి ప్రశంసించారు. నిజం చెప్పాలంటే నేను నీ ప్రతిభకు, నీ పనితీరుకు పెద్ద అభిమానిని. నువ్వు ఇలానే ఎంతోమందికి స్ఫూర్తినిస్తూ ఉండాలి. ఇలాంటి హిట్‌లు ఎన్నో అందుకోవాలని కోరుకుంటున్నా. శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు అల్లు అర్జున్ స్పందించారు. 'మీరు మా సూపర్ హీరో. మీ నుంచి ఇలాంటి ప్రశంసలు నమ్మలేకపోతున్నా. నాపై మీకున్న ప్రేమకు ధన్యవాదాలు' అని రిప్లై పెట్టారు.

## ఆ వార్తలు నమ్మొద్దు..

**- జానీ మాస్టర్**




విశ్వంభర, హైదరాబాద్: తనని డ్యాన్స్ యూనియన్ నుంచి శాశ్వతంగా తొలగించారంటూ జరుగుతోన్న ప్రచారంపై ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ స్పందించారు. ఆయా కథనాల్లో నిజం లేదని అన్నారు. తన పదవీ కాలం ముగియకుండానే సొంత నిర్ణయాలు తీసుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

''నిర్ధారణ కాని ఆరోపణలను కారణంగా చూపిస్తూ నన్ను శాశ్వతంగా యూనియన్ నుండి తొలగించినట్లు మీడియాలో ప్రచారం చేస్తున్నారు. వాటిని నమ్మకండి. నా పదవీ కాలం ఇంకా ఉంది. అయితే అనధికారికంగా, అనైతికంగా ఎలక్షన్లు నిర్వహించి వారికి వారే నిర్ణయాలు, హోదాలు తీసుకునే హక్కు ఎవరికీ లేదు. దీనికి కారణమైన వారిపై చట్టపరంగా పోరాటం చేస్తున్నా. త్వరలోనే వివరాలు చెబుతా. టాలెంట్ ఉన్నవారికి పని ఇవ్వకుండా, పని దొరక్కుండా ఎవరూ ఆపలేరు. నా కొరియోగ్రఫీలో 'గేమ్ ఛేంజర్' నుంచి ఓ మంచి పాట రానుంది. మీ అందరికి నచ్చుతుందని నమ్ముతున్నా. ఈ యూనియన్‌కు నేను ఎప్పుడూ రుణపడి ఉంటా. నా వద్ద వర్క్ చేసిన చాలామంది ఇప్పుడు కొరియోగ్రాఫర్లగా మారారు. ఇండస్ట్రీలో రాణిస్తున్నారు'' అని పేర్కొన్నారు.


జానీ మాస్టర్ లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. తనపై వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో అరెస్ట్ అయిన ఆయన కొంతకాలం జైలులో ఉండి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చారు. లైంగిక ఆరోపణల నేపథ్యంలోనే డ్యాన్సర్స్ యూనియన్ నుంచి ఆయన్ని శాశ్వతంగా తొలగించారని కథనాలు చక్కర్లు కొడుతున్నాయి.

## కీర్తి సురేశ్ తొలి బాలీవుడ్ మూవీ.. బేబీ జాన్ ట్రైలర్ వచ్చేసింది




విభిన్న కథా చిత్రాలతో దక్షిణాదిన విశేష క్రేజ్ సొంతం చేసుకున్న కీర్తి సురేశ్ 'బేబీ జాన్' తో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. వరుణ్ ధావన్ హీరో. వామికా గబ్బీ, జాకీ ష్రాఫ్ కీలక పాత్రలు పోషించారు. కాలీస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ట్రైలర్ ను తాజాగా విడుదల చేసింది.

## 'ఆర్ఆర్ఆర్'పై డాక్యుమెంటరీ.. రిలీజ్ ఎప్పుడంటే!




భారతీయ సినీ పరిశ్రమ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆస్కార్‌తో పాటు ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. ఎన్టీఆర్ , రామ్‌చరణ్ కథానాయకులుగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా 2022లో ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇప్పుడు ఈ టీమ్ ప్రేక్షకులకు ఒక సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ సినిమాపై డాక్యుమెంటరీని సిద్ధం చేసినట్లు తెలిపింది.

'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో ఈ డాక్యుమెంటరీ రానున్నట్లు ప్రకటించింది. ''ఆర్ఆర్ఆర్ కీర్తిని ప్రపంచం మొత్తం చూసింది. ఇప్పుడు దీని కథకు ప్రపంచం సాక్ష్యంగా నిలవనుంది' అంటూ ఈ ప్రాజెక్ట్ గురించి వెల్లడించింది. 'ఆర్ఆర్ఆర్' సినిమా తెరవెనక ఏం జరిగింది.. దీన్ని ఎలా రూపొందించారో ఇందులో చూపనున్నారు. ఈ డాక్యుమెంటరీ డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే దీన్ని థియేటర్‌లలో విడుదల చేస్తారా.. ఓటీటీలో విడుదల చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

అల్లూరి సీతారామరాజు (రామ్‌చరణ్) , కొమురం భీం (ఎన్టీఆర్) ప్రధాన పాత్రలతో రూపొందిన ఈ కల్పిత కథ దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.1200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఔరా అనిపించింది. థియేటర్లతో పాటు ఓటీటీల్లోనూ హవా చూపింది. అలాగే దీన్ని పలు భాషల్లో డబ్ చేయగా అక్కడ కూడా రికార్డు స్థాయిలో వసూళ్లు నెలకొల్పింది. జపాన్‌లో అత్యధిక కలెక్షన్లు రాబట్టి 300 మిలియన్ జపాన్ యెన్‌ల (రూ.18 కోట్లు) క్లబ్‌లో చేరింది. ఈ క్లబ్‌లో చేరిన తొలి భారతీయ సినిమాగా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ప్రస్తుతం రాజమౌళి .. మహేశ్‌తో తీయనున్న సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు కీలక దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తికాగా...లొకేషన్ల ఎంపికపై కసరత్తులు మొదలుపెట్టారు. గ్లోబ్ ట్రాకింగ్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతోంది. దీన్ని జనవరిలో చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు టాక్.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com